నేను దర్శించిన మహాత్ములు

# శ్రీ ఆనందమాయి అమ్మ



ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

# శ్రీ శ్రీ శ్రీ ఆనందమాయి

# దివ్య చరిత్ర

## అధ్యాయము -1

వెనుకటి తూర్పు బెంగాల్ లోని త్రిపురా జిల్లాలో విద్యాకూట్ అనే గ్రామం వున్నది. అక్కడ ఎన్నో సదాచార సంపన్నమైన బ్రాహ్మణ కుటుంబాలు వుండేవి. వీరిలో కాశ్యపగోత్రోద్భవుడైన బిపిన్ బిహారి భట్టాచార్య, అతని భార్య మోక్షదాదేవి విష్ణుమూర్తిని సాలగ్రామశిల రూపంలో శ్రద్ధగా పూజించుకొనేవారు. భట్టాచార్య ఎంతో విరాగి. ఒక కుమార్తె జన్మించగానే అతడు తన కుటుంబాన్ని సమీపంలోని కేవరా గ్రామంలో తన తల్లివద్ద విడిచిపెట్టి, సన్యాస దీక్ష తీసుకోదలచి ఎక్కడకో 3 సం॥ ల పాటు వెళ్ళిపోయాడు. మోక్షదాదేవి కంట నీరు చూడలేక ఆప్తులందరూ అతనిని వెదికి పట్టుకొని నచ్చచెప్పి ఇంటికి తీసుకు వచ్చారు. అటు తర్వాత గూడ అతడు ఎక్కువ సమయం భక్త బృందాలతో కలసి భజనలు, కీర్తనలు చేస్తూ, పాద యాత్రలు చేస్తూ వస్తుండేవాడు. అతడు ఇల్లు విడిచిన కాలంలోనే మొదటి బిడ్డ చనిపోయింది. అతని తల్లి ఒకసారి కసబా అను పట్టణంలో వున్న ప్రఖ్యాతమైన కాళికామాత మందిరానికి వెళ్ళింది. తనకొక మనవడిని

ప్రసాదించమని ప్రార్థించాలనుకొన్నది. గాని తీరా సమయానికి, ''మా బిపిన్‌కు ఒక కుమార్తెను ప్రసాదించు'' అనుకొని ఆమె తలంపుకు ఆమే ఆశ్చర్యపోయింది. అధికంగా ముస్లిములు, కొద్ది మాత్రం హిందూ కుటుంబాలు గల కేవరా గ్రామంలో ఆ కుటుంబం అంతటి పేదరికంలోను ఎంతో తృప్తిగా, తమకుగల కొద్దిలోనే అతిథులను వట్టిచేతులతో త్రిప్పి పంపక ఎంతో తృప్తితో జీవిస్తూ వుండేవారు. అతిథులకు పెట్టేందుకు ఏమీలేనప్పుడు కొద్దిపాటి చక్కెర గుళికలు పెట్టనిదే పంపించేవారు గాదు. మోక్షదాదేవి ఎన్నో భజన కీర్తనలు వ్రాస్తుంటే బిపిన్ బిహారి వాటిని ఎంతో మధురంగా పాడుతుండేవారు. వారికి ఏప్రిల్ 30, 1896 న రెండవ కుమార్తె జన్మించింది. ఆమెకు నిర్మలాదేవి అనిపేరు పెట్టుకొన్నారు. ఆ పాప గర్భంలో వున్నప్పుడు, పుట్టిన తర్వాత గూడ మోక్షదాదేవికి ఎన్నో దివ్య స్వప్నాలు వస్తుండేవి. దేవతలు తమ కుటీరానికి వచ్చినట్లు, వారిని తాము పూజించినట్లు కలలు వస్తుండేవి. రోజులు ఒకానొక అలౌకికమైన ఆనందంలో గడచి పోతుండేవి. ప్రసవమప్పుడు కూడ ఆమెకు ఎక్కువ బాధ కల్గలేదు. పుట్టిన బిడ్డ కూడ ఎంతకూ ఏడవకపోయేసరికి ఏదో లోపంతో పుట్టింది కాబోలు అని అందరూ తలచారు. మొదటి బిడ్డ దక్కనందుకు ఈ బిడ్డను మోక్షదాదేవి నిత్యమూ తులసి మొక్క మొదట్లో పడుకోబెట్టి, బిడ్డను కాపాడమని దేవిని ప్రార్థిస్తూ వుండేది. అదే అలవాటయి నిర్మలాదేవి పారాడ్డం వచ్చినప్పటినుండి స్నానం అవగానే తనకై తానే వెళ్ళి ఆ చెట్టు మొదట్లో కొంత సేపు పడుకొని వస్తుండేది.

పసితనం నుండీ గూడ నిర్మల ఎంతో సౌమ్యురాలు. తనకంటూ ఎన్నడూ ఏమీ కోరి ఎరగదు. ఊహ తెలియనారంభించి నప్పటినుండి తల్లికి, పొరిగిళ్ళ వారికి గూడ వస్తువులు అందిస్తూ,

ఎంతో సంతోషంగా వారి పనులలో సహాయం చేస్తూ అందరి ప్రేమను చూరగొన్నది. ఇంకొంచెం ఎదిగాక ఎవరింట్లో ఏ ఇబ్బంది వచ్చినా తానే వెళ్ళి వారికి వంట చేసిపెట్టి వారిళ్ళలోని పసిపిల్లలను సంరక్షిస్తుండేది. కానీ అన్నిటికంటే ప్రత్యేకంగా అనిపించిన అంశం ఆమెలో వుండేది - పెద్దవాళ్ళు ఏమి చెప్పినా వేరొక ఆలోచన చేయక, అక్షరాలా అప్పటికప్పుడే వారి ఆజ్ఞను అమలుచేసేది. ఇందువలన ఆమెతో పెద్దలుగూడ ఎంతో జాగ్రత్తగా మసలుకోవలసి వచ్చేది. నిర్మల తన చేతిలో ఒక గ్లాసు అజాగ్రత్తగా పట్టుకొన్నదని చెప్పి తల్లి సాధింపుగా, ''ఆ గ్లాసు క్రింద పడేయి, సరిపోతుంది'' అంటే, వెంటనే ఆమె ఆ గ్లాసును జార విడిచేది. ఒక బంధువు ఆమెను ఒకరోజు సంతకు తీసుకువెళ్ళి అచట ఒక శివాలయం ఎదుట ఆమెను కూర్చోబెట్టి, ''నేనొచ్చేవరకూ నీవు కదలకుండా కూచోవాలి సుమా?'' అని చెప్పి సరుకులు కొనడానికి వెళ్ళింది. తర్వాత సంతలో స్నేహితులతో కలసి ఆ పాప మాటే మరచి ఆ బంధువు ఎంతో ఆలస్యంగా ఇల్లుచేరింది. అప్పుడు నిర్మల సంగతి గుర్తుకు వచ్చి శివాలయానికి వెళ్ళేసరికి నిర్మల అక్కడే కాలూ చేయి కదల్చకుండా ఆమె కూర్చోబెట్టినట్లే కూర్చుండిపోయింది, కనుగుడ్లుగూడ కదల్చకుండా తదేకంగా చూస్తుండిపోయింది! తండ్రి బిపిన్ బిహారి చదువు చెబుతున్నప్పుడు వాక్యమెంత పెద్దదయినా అది ముగిసే వరకు గుక్కతిప్పుకోకుండా చదివేది.

నిర్మల చాలా కొంచెం చదువుకొన్నది. ఆమె తర్వాత పుట్టిన ఇద్దరు తమ్ముళ్ళు తరుచుగా జబ్బు పడుతూ పసితనంలోనే మరణించారు. తర్వాత పుట్టిన ఇద్దరు చెల్లెళ్ళను నిర్మలే చూచుకొనేది. ఇంట్లో తల్లికి తరుచుగా ఆమె సహాయం చేస్తూండేది. ఎంతో దూరాన

వున్న వీధిబడికి ఆమెను తీసుకువెళ్ళడానికి తరచుగా ఎవరూ వుండేవారు కాదు. అందువలన ఆమె ఎప్పుడోగాని బడికి వెళ్ళలేక పోయేది. ఆమె దగ్గర విరిగిన పలక తప్ప ఇంకేమీ వుండేది కాదు. అయినప్పటికీ క్లాసులో ఎప్పుడూ ఆమెయే అందరి పిల్లలకంటే అగ్ర స్థాయిలో వుండేది. అదేమి చిత్రమోగాని ఆమె చదువుకోనివచ్చిన, పాఠ్యాంశాల గురించే టీచర్లు ఆమెను ప్రశ్నించడం జరిగేది. క్రొత్తపదాల గురించికూడా క్షణమాలోచించగానే ఆమె మనస్సుకు వాటి అర్థం స్ఫురిస్తుండేది.

నిర్మలకు చిన్నప్పటినుండి పూజ, కీర్తనలంటే ఎంతో ప్రీతి. నిత్యమూ తండ్రి పూజ చేస్తుంటే ఆయనకు అన్నీ అందిస్తూ ఆయన చెంతనే కూర్చొని వుండేది. అంతటి సౌమ్యురాలికి పసితనం నుండి భయమంటే ఏమిటో తెలిసేదికాదు. వీధిలో పశువుల మందలు ఎదురయినప్పుడు సాటి పిల్లలందరూ భయపడి పారిపోయినా ఆమె మాత్రం ఎక్కడున్నది అక్కడే నిల్చిపోయేది. చిత్రం! ఆ పశువులు ఆమె చెంతన ఆగి ఆమెను వాసన చూసి, ప్రేమగా నాకి రాసుకుంటూ ముందుకు సాగిపోయేవి. అవన్నీ వెళ్ళిపోయాక పిల్లలందరూ ఆమెతో కలిసి ముందుకు సాగిపోయేవారు.

చిన్నప్పటినుండీ నిర్మల ఎవరు కంట తడిపెట్టినా సహించలేక పోయేది. తాను అహర్నిశలు ఎంతో ప్రేమతో పెంచిన ఇద్దరు తమ్ముళ్ళు చనిపోయినప్పుడు ఆమె ఎంతగానో దిగులు పడుతుందని భయపడిన బంధువులందరూ ఆశ్చర్యపోయేలా ఆమె చలించక నిర్లిప్తంగా వుండిపోయింది. కాని వారిని తలుచుకొని మోక్షదాదేవి ఎప్పుడు కుమిలిపోతున్నా నిర్మల ఎంతగానో శోకించి తనను

సముదాయించడంలో ఆమెకు బాధలేకుండా చేసేది. ఒక వేసవిలో పర్వదినాన బెంగాల్ రాష్ట్రమంతటా అటుకులు, పెరుగు, మామిడి పండ్లు కలిపి తింటారు. ఒక సం॥ ము చేత చిల్లికాని లేక ఆ పండుగ నాడు ఆ మామిడిపండు, పెరుగుపచ్చడి మోక్షదాదేవి తన పిల్లలకు పెట్టుకొనలేకపోయింది. ఆమె ఈ దౌర్భాగ్యానికి బాధ పడుతుంటే నిర్మల బయటకు పరిగెత్తి ఒక పెద్ద మామిడి పండును తెచ్చి పెట్టింది. ఆమె ఎవరింటి నుంచో తెచ్చిందని తల్లి కోపంతో, ''ఎక్కడ నుండి తెచ్చావు? వెంటనే వాళ్ళకు తిరిగి ఇచ్చేసిరా!'' అని మందలించింది. కాని ఆ పండు వారి కుటీరం ప్రక్కనే నేలపై పెట్టివున్నదని నిర్మల చెప్పింది.

చెట్టుపై బాగా పండిన వెలగపండు నేలపై రాలి పడటానికి చిన్న కదలికయినా చాలు. అలానే ఉత్తమ సంస్కారులకు జీవితంపట్ల భ్రాంతితొలగి వివేకముదయించడానికి ఎంత చిన్న సంఘటయినా చాలు. ఒకనాటి అర్ధరాత్రి నిద్రలేచిన బిపిన్ బిహారి తన ఇంటి మధ్య దూలానికి త్రాచుపాము చుట్టుకొని వుండడం చూచాడు. దానిని చంపడం అతనికి ఇష్టంలేదుగాని, ఆ దూలం క్రింద నిద్రిస్తున్న పిల్లల మీద అది జారిపడుతుందేమోనని భయపడ్డాడు. వారి పడక ప్రక్కన మంచాలు నిలబెట్టి వాటిపై చెక్కలు ఆచ్ఛాదనగా పెట్టాడు. నిర్మలకు మెలుకువవచ్చి అదంతా చూచి, ''మానవజీవితం ఎంత అనిశ్చితమో గదా! మనలను రక్షించాల్సిన మన తండ్రి గూడ ఈ విషయమై భగవంతుని శరణు పొందాల్సిందేకదా!!'' అనుకొన్నది. ఒకసారి వాళ్ళ అమ్మ ఇంటి చుట్టూరా నేలపై సున్నం నీళ్ళు చల్లడం చూచింది. ఆ ఘాటు భరించలేక నేలలోని పురుగులన్నీ బయటకు వచ్చేస్తుంటే చూచి నిర్మల, ''ధ్యానానికి కూర్చున్నప్పుడు భగవస్మరణమనే సున్నపు నీటికి తట్టుకోలేక క్షుద్రమైన తలంపులనే పురుగులన్నీ ఇలానే

బయటకు వచ్చేస్తాయి కాబోలు, అందుకే ధ్యానానికి కూర్చున్నప్పుడే ఎక్కడలేని ఆలోచనలు వస్తాయని అందరూ వాపోతారు'' అనుకున్నది. అందుకే కాబోలు, అంత పేదరికంలో జీవిస్తున్నా ఆ సంగతి ఆమెకు అప్పట్లో తోచలేదు. అన్నీ సమృద్ధిగా వున్న తృప్తి ఆమెకు వుండేది. అందరి పిల్లల్లాగా ఆమె ఏ మాత్రము అల్లరి చేయక పోవటము, పేచీ పెట్టక పోవటమూ అందరికీ నిర్ఘాంతంగా తోచేది.

ఆనాటి ఆచారాన్ననుసరించి ఆమెకు 13వ ఏటనే ఆట్పూరా గ్రామానికి చెందిన రమాపీ మోహన్‌తో వివాహమయింది. తర్వాత ఆమె కొంతకాలం పుట్టింట్లోను, తర్వాత 4 సం॥లు తన బాహారింట్లోనూ వున్నది. చాలివంత చదువురాని ఈ అమాయకు రాలికి ఆమె తండ్రి బిపిన్ బిహారియే ఆమె భర్తకు వ్రాయవలసిన జాబుల నమూనాలను తయారు చేసియిచ్చేవాడు. ఆమె భర్త ఎప్పుడైనా ఆమెకోసం మంచి పుస్తకాలు కొని తెచ్చేవాడు. తాను విశ్ర మించేటప్పుడు ఆమెను చదివి వినిపించమనేవాడు. వచ్చీరాని ఆమె చదువు చూచి నవ్వుకొనేవాడు. ఆమె ఆ ఇంట్లోకి నీళ్ళు తెచ్చేది, వంటలో సహాయం చేసేది, చిన్న పిల్లలను చూచుకొనేది. ఇంట్లో అందరికీ అన్నీ అందించేది. ఎంత పనైనా అలసట లేకుండా సంతోషంగా చేస్తూవుంటే చూచి అందరూ ఆమెకు బుద్ధిమాంద్యము కాబోలు అనుకొనేవారు. ఒకసారి నిరంతరము నీటిలో పని చేయడం వలన ఆమె చేతులు, కాళ్ళు బాగా పగిలి పోయి పుండుపడి వుండటం అందరూ చూచి నిశ్చేష్టులయ్యారు. అంత బాధలోనూ పెదవి విప్పని ఆమె నిబ్బరము అందరి హృదయాలనూ కరిగించింది. అంత పనిచేస్తూగూడ ఆమె పొరిగింటి గృహిణులనుండి కుట్టుపని, నూలు వడకటము, బుట్టలు అల్లటము ఎంతో చక్కగా నేర్చుకొన్నది. ఆమె

ఒకసారి తాను వడికిన 18 గజాలు పొడవుగల నూలు ఒక నిం క్కాయలో పొందు పరచి ఆ ఇంట్లో ఒక్కొక్కరికి ఒక్కొక్కటి చొ॥న బహూకరించింది. కాని అప్పుడప్పుడు అంతపని మధ్యలోనూ బాహ్యస్మృతి లేని ఒక విధమైన పరధ్యానంలో అలా ఎంతోసేపు కూర్చుండిపోయేది.

తల్లిదండ్రులు ఆమెను భర్త ఇంటికి పంపేటప్పుడు, ''నీవు నీ భర్త మాటను ఎన్నడూ జవదాటకూడదు. ఆయన మాటే నీకు వేదవాక్కు'' అని చెప్పారు. అప్పటి నుండి ఆమె ఎన్నడూ ఏమారక అలానే నడుచుకొనేది. నిజానికి ఆమె భర్త కొద్దిపాటి చదువుకున్న గ్రామీణుడు. పూజా పునస్కారాల గురించి గూడ అతనికి తెలిసినది చాలా స్వల్పమే. ఆ దంపతులిద్దరూ అష్టగ్రామంలో స్థిరపడ్డారు. ఆమె లోని ప్రశాంతత, గాంభీర్యము, సౌమ్యత సాటివారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఆమె కుటీర ప్రాంగణమంతా శుభ్రం చేయడం చూచి పొరుగువారు ఒకసారి గుప్‌రాయ్ అను ప్రఖ్యాత కీర్తనకారులను పిలిపించి కచేరీ చేయించారు. ఆమె సాంగత్యంలో కొందరికి అలాంటి ప్రేరణ కల్గేది. కానీ ఎక్కువమంది ఆమెను చూచి, ఆమెకు మనో జాడ్యమో, లేక గ్రహబాధో వున్నదని తలచేవారు. కారణం అలా కీర్తనలు జరుగుతున్నంతసేపు ఆమె నిశ్చేష్టురాలై కొయ్యలా బిగుసుకు పోయి పరధ్యానంగా కూర్చుండిపోయేది. ఒకప్పుడు ఆమెకు సుస్తీచేసి నాల్గుమాసాలు విద్యాకూట్‌కు విశ్రాంతికోసం వెళ్ళింది. అక్కడ గూడ ఆడవాళ్ళందరూ కలసి గవ్వలాటకు పిలిచినా ఆమె పాల్గొనేదికాదు. అందరూ తిరిగి తిరిగి కారణమడుగుతుంటే చివరకు, ''గవ్వలాడ్డం మావారికి ఇష్టముండదు'' అనిమాత్రం అన్నది. ''ఆయన ఇక్కడ

లేదుకదా - మరలా మీ ఇంటికి వెళ్ళాక ఎలాగూ ఆడవుగదా, ఇప్పుడు ఆడితే ఏమి పోయింది?'' అని వారెంత కవ్వించినా ఆమె చిరునవ్వుతో మెదలకుండా కూర్చునేది గాని ఎంతకూ ఆడేదికాదు; వారికి ఇంకేమీ సమాధానమిచ్చేదికాదు. ఆ కాలంలోనే వారి బంధువులమ్మాయి అన్నపూర్ణకు వివాహమయింది. కాని కొద్దికాలంలోనే ఆమె తిరిగి వచ్చి తన పుట్టింట్లోనే వుండసాగింది. కారణం ఆమెకు కొన్నేసి గంటల తరబడి స్పృహలేకుండా పోయేది. అందువలన ఆమె భర్త ఆమెను పంపివేసాడు. ఆమెకు మానసికమైన జబ్బని కొందరు, దయ్యం పట్టిందని కొందరు అనుకొనేవారు. ఒకసారి ఆమె ఆ స్థితిలో వుండగా నిర్మలాదేవి ఆమె చెవిలో ఏమో గొణిగింది; వెంటనే అన్నపూర్ణ లేచి కూర్చున్నది. అది చూచి ఆ గ్రామంలోని అందరూ నివ్వెరపోయారు. అటు తర్వాత అన్నపూర్ణ ఎన్నడూ అలా పడిపోలేదు; సంతోషంగా తిరిగి కాపురానికి వెళ్ళిపోయింది. తర్వాత ఆమె చెవిలో తాను ఏమి ఉచ్చరించినదీ నిర్మలాదేవి ఇలా చెప్పింది : ''నీవేమీ భయపడకు; మీవారి దగ్గరనుండి త్వరలో నీకు జాబు వస్తుంది. నీవిలా నటిస్తే నీ జీవితం పాడయిపోతుంది'' అని ఆమె చెప్పింది! సం॥ 1918లో నిర్మలాదేవి తన భర్తతో కలిసి భజిత్‌పూర్ వెళ్ళిపోయింది. కారణం అతనికి ఉద్యోగం అక్కడకు బదిలీ అయింది.

భజిత్‌పూర్‌లోనే ఆమె జీవితంలో క్రొత్త అధ్యాయం ఆరంభమయింది. తీవ్రమయిన సాధనచేసి నిర్మలాదేవి మహాత్మురాలైన ఆనందమాయి మాతగా రూపొందినదిక్కడే. ఈ దశ యొక్క ఆరంభం గురించి ఆమె, ''నేనొకరోజు మా ఇంటివద్దనున్న కొలనుకు వెళ్ళి ఆ నీళ్ళు ఒంటి మీద పోసుకొనుచుండగా, 'నేను సాధకురాలిగా

జీవిస్తే ఎలావుంటుంది?' అన్న భావంకల్గి ఆ లీల ఆరంభమయింది'' అని చెప్పింది. ఈ దశలోనే ఆమె తన భర్తకు భోలానాథ్ అని పేరు పెట్టింది. అప్పుడు భోలానాథ్ ఢాకా నవాబుగారి కొలువులో నియమించబడ్డాడు. ఒకరోజు ఆయన పైఉద్యోగి భూదేవ్‌బసు తన ఇంటివద్ద కీర్తన ఏర్పాటు చేసాడు. ఇతర స్త్రీలతోపాటు లోపలి గదిలో కూర్చున్న నిర్మలాదేవికి కీర్తన వినగానే భావ పారవశ్యం కల్గింది. ఆమె కోరిక మీదట ఆమెను ఇంటికి తీసుకు పోయినవారు ఆమెకు నరాల బలహీనత అని తలచారు. ఆమె సాధన గురించి ఎట్టి గ్రంథాలూ చదవలేదు గాని తన తల్లి, అమ్మమ్మ మొ॥న పెద్దలు ఆచరించిన పద్ధతిని చూచిన నిర్మలాదేవి గూడ ఆ రీతినే తన సాధన కొనసాగించింది. రోజూ తన నిత్యకృత్యమయ్యాక ఆమె తన గది శుభ్రం చేసుకొని, అందులో అగరవత్తులు వెలిగించి ఒక మూల కూర్చొని భగవంతుని నామాలు పఠించేది. కొద్ది నిముషాలలో ఆమె అవయవాలు వాటంతట అవే సర్దుకొని పద్మాసనము, సిద్ధాసనము వంటి ఏదో ఒక యోగాసనంలో నిలచేవి. తానేమీ చేయక అదంతా ఆమె చూస్తూ వుండేది. ఆ వెంటనే కొన్ని యోగముద్రలు, యోగక్రియలు, వాటంతటవే ఆమె దేహంలో ప్రారంభమయ్యేవి. అది అర్ధరాత్రి వరకూ కొనసాగుతుండటం ఒక్కొక్కప్పుడు భోలానాథ్ గూడా గమనించేవాడు. అది గమనించిన పొరుగువారు ఆమెకు దయ్యం పట్టిందని తలచి ఆమెకు దూరంగా వుండసాగారు. అంతటితో ఆమెకు సాధనకు ఇంకా అవకాశం కల్గింది. చివరికి వారందరూ ఎవరైనా మంత్రవేత్తలను తెచ్చి ఆమెకు గల గ్రహబాధను తొలగించుకోమని వత్తిడి చేస్తుండటంతో భోలానాథ్ అట్టి ప్రయత్నాలు చేసాడు. చివరకు ఒకరిద్దరు మంత్రవేత్తలు శాయశక్తులా ప్రయత్నించి చివరకు ఆమె

సాక్షాత్తు దేవి స్వరూపమని, ఆమెపై తమ మంత్రాలు పనిచేయ జాలవనీ చెప్పి, నమస్కారించి వెళ్ళిపోయారు. కాని ఆమె ఎన్నడూ తన దివ్య శక్తులను ప్రదర్శించనూ లేదు, కావాలని కప్పి పుచ్చు కోనూలేదు. డా॥ మహేంద్ర నంది అను మిత్రుడు ఆమెను బాగా గమ నించి, ఆమె మహోన్నతమైన ఆధ్యాత్మికస్థితిలో వున్నదని, ఆమెను నలుగురి దృష్టిలోకీ లాగవద్దనీ భోలానాథ్‌ను హెచ్చరించాడు. ఇలా ఆమె అంతర్యం ఉదయసంధ్యలా వికసిస్తుంటే భక్తులు ఒక్కరొక్కరే ఆమె చెంత చేరసాగారు. నిర్మలాదేవికి స్నేహితురాలైన ఉష ఆమెను విడిచి వుండలేక తన అత్తగారి కన్ను కప్పి రోజూ వీలయి నంత సమయం ఆమె సన్నిధిలో గడపసాగింది. మే 1922 నుండి మూడు మాసాల పాటు నిరంతర సాధనతో తనను తాను శుద్ధిచేసు కొన్నాక ఒకనాడు నిర్మలాదేవి తనకైతానే ఉపదేశదీక్ష తీసుకొన్నది. రక్షబంధక (రాఖీపూర్ణిమ) రోజున రాత్రి 9 గం॥లకు ఇంట్లో అందరికీ భోజనాలు పెట్టేసి అర్ధరాత్రి వరకూ పూజ చేసుకొన్నది. ఆ సమయంలో రోజుకు ఒక్కసారి మాత్రమే భోజనం చేస్తున్నది. నాటి రాత్రి ఆమె ధ్యానంలో కూర్చున్నప్పుడు అప్రయత్నంగా తన వ్రేలితో నేలమీద యంత్రంగీసి తన హృదయంలో పెల్లుబికిన ఒక బీజమంత్రం వ్రాసింది. ఆ విధంగా ఆమె తానే గురువై దీక్ష యిచ్చిందని, తానే శిష్యురాలై దీక్ష తీసుకొన్నదనీ తలచవచ్చు. అప్పటి నుండి 5 మాసాల పాటు ఆమెనోటి వెంట అప్రయత్నంగా ఓంకారము, తర్వాత ధారగా ఎన్నో సంస్కృత శ్లోకాలు, స్తోత్రాలు ధారాపాతంగా దొర్లుతున్నాయి. మళ్లీ మళ్లీ ఆమె వేళ్ళపై లెక్కిస్తూ జపం చేసుకొనేది. గంటలు, రోజులు బాహ్యస్మృతి లేకుండా, ఆకలి, నిద్రలేకుండా, ఉదయము, రాత్రి అనే భేదం తెలియని స్థితిలో గంటలు, రోజులూ గడచి పోయేవి

ఆమె తన నోట్లో ఒకానొక అమృతతుల్యమయిన తేనెవంటి పదార్థం ఊరేదని, అది మింగేదానిననీ చెప్పేది. ఆమె దేహం ఒక్కొక్కప్పుడు దూదిపింజవలె అతి తేలికగాను, మరొకప్పుడు కొండ రాయివలె అమిత బరువుగా అన్పించేదట. ఆమె శరీరంలో ఎంత కఠినమైన యోగాసనాలు, ముద్రలు ప్రకటనమయినప్పటికీ ఆమెకు ఎట్టి నొప్పి కల్గేదికాదట. కాని ఆమె గృహకృత్యాలు ఏమీ చేసుకొలేక పోయేదట. ఆ రోజులలో వారింటికి వచ్చిన బంధువులు ఆమెనిలా కొనసాగ నివ్వరాదని భోలానాథ్‌ను హెచ్చరిస్తుండేవారు. ఒకరోజు నిషీ కాంతు డను వారి బంధువు ఆమెతో, ''నీ ఆధ్యాత్మ శక్తికి ఏదైనా నిదర్శనము చూపించు'' అని నిలదీసాడు. అపుడు ఆమె భోలానాథ్‌ను తన ఎదుట కూర్చోబెట్టుకొని ఆయనను స్పృశించింది. ఆయన వెంటనే గాఢమైన ధ్యానంలో వుండిపోయి, మరలా ఆమె స్పృశించాక గాని ఆయనకు బాహ్యస్మృతి కల్గలేదు. ఒకరోజు ఆమె భోలానాథ్‌తో ఆయన తనవద్ద దీక్షతీసుకోవల్సిన రోజు వస్తున్నదని హెచ్చరించింది. ఆయన ఎలాగైనా దీక్ష తీసుకోకుండా తప్పుకుందామని ఆ రోజు అల్పాహారం గూడా తీసుకోకుండా ముందుగానే ఆఫీసుకు వెళ్ళిపోయాడు. దీక్ష తీసుకొనే ముందు ఎట్టి ఆహారమూ తీసుకోకూడదన్న నియమం తెలియ కుండానే ఆయన పాటించటం జరిగింది. సరిగా సమయానికి నిర్మలాదేవి దీక్ష తీసుకోవడానికి రమ్మని కబురు చేస్తే ఆయన, తనకు ఆఫీసు పనిలో తీరికలేదన్నాడు. అప్పుడు ఆమె, ''ఆయన రాకుంటే నేనే ఆఫీసుకు రావలసి వుంటుంది'' అని కబురు చేసింది. విధిలేక ఆయన ఇల్లు చేరాడు. ఆయన స్నానంచేసి ఆమె ఇచ్చిన క్రొత్తగుడ్డలు కట్టుకొని ఆసనంపై కూర్చున్నాడు. అప్పుడామెకు భావ సమాధి కల్గింది. అప్రయత్నంగా ఆమె నోటివెంట ఏవేవో మంత్రాలు దొర్లు

తున్నాయి. చివరకు ఒక మంత్రం ఆమె నెమ్మదిగా గొణుగుతున్నది. అప్పుడు ఆయన ఆమె నోటివద్ద తన చెవులు పెట్టి విని, అదే తనకిచ్చిన దీక్షామంత్రంగా స్వీకరించాడు. తర్వాత దానెలా జపించాలో ఆమె వివరించింది. తర్వాత ఆయన పెద్దలను విచారించినప్పుడు ఆమె చెప్పినది మంత్ర శాస్త్రానికి సరిపోయింది. ఆమె నుండి మంత్రదీక్ష జ్యోతిష్ చంద్రరాయ్ అను మరొక భక్తుడు మాత్రమే పొందాడు. ఆమె ఎన్నడూ ఇంకెవరికీ ఉపదేశము ఇవ్వలేదు.

డిశంబరు 1922 నుండి అనుకోకుండానే ఆమె 3 సం॥లు మౌనం పాటించింది. ఆమె పాటించిన మౌనంలో మౌనం మాత్రమే గాక, చేతులు మరియు ముఖములతో గూడ తన భావాలను ఇతరులకు తెల్పేదికాదు. ఆమె ముఖంలో కూడా వేరెట్టి భావాలూ ప్రకటమయ్యేవికావు. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలలో మాత్రం కొందరు భక్తులతో అత్యావసరమైనప్పుడు ఆమే క్లుప్తంగా మాట్లాడేది. సన్నిహితులు ఆమె దివ్యశక్తిని చవిచూడసాగారు. భజిత్‌పూర్‌లో ఒకరోజు దుర్గామాతకు వాసంతిపూజ ఎక్కడ జరిపించాలని భోలానాథ్ ఆలోచిస్తుండగా నిర్మలాదేవి, ''ఢాకా గోఖుల్ ఠాకూర్ గారిల్లు మీదే కదా, ఎక్కడో ఎందుకు?'' అన్నది. ఆ మాటలకర్థమేమో కొంత కాలమయ్యాక గాని ఎవరికీ తెలియలేదు. అలానే ఒకరోజు ఆమె, ''ఏమిటి, ఈ రోజు హరకుమార్ గొంతు వినబడుతున్నది!'' అన్నది. అతడు వారి బంధువు, ఎన్నో సం॥ లుగా అతడు వారిని కలవనే లేదు. కొంత సేపటికి అతడు వచ్చి వెళ్ళిపోయాడు. ఆటుతర్వాత అతడు మరెన్నడూ కలవలేదు! ఇంకొక రోజు ఆమె భోలానాథ్‌ను, ''అరేబియా అంటే ఏమిటి?'' అని అడిగింది. అది ఒక దేశం పేరని చెప్పగానే ''అరేబియాకు చెందిన ఇద్దరు ఫకీర్లు - గురుశిష్యులు -

నాకంతా స్పష్టంగా కన్పించాయి. నేను చిత్రకారిణినైతే వాటి బొమ్మలు గీసి చూపేదాన్నికూడా'' అన్నది. ఈ మాటలకర్థంకూడా కొంతకాలం తర్వాతనే అందరికీ తెలిసింది.

ఏప్రిల్ 1924లో అతడు పనిచేస్తున్న వ్యాపార సంస్థ రద్దవడం వలన భోలానాథ్‌కు ఉద్యోగం పోయింది. అతడు ఉద్యోగం కోసం ఏప్రిల్ 10న ఆమెను తీసుకొని ఢాకా చేరాడు. వెంటనే పని దొరకలేదు. మరల పని దొరికే వరకు నిర్మలాదేవిని స్వగ్రామానికి పంపించాలను కొన్నాడు గాని ఆమె, ''మూడు రోజులలో మీకు ఉద్యోగం రాకపోతే అప్పుడు పంపిద్దురుగానిలేండి'' అన్నది. మూడవరోజున అతనికి ఢాకా రాణి (నవాబ్‌జాది) గారి షెబాద్ తోటలకు మేనేజరుగా ఉద్యోగం వచ్చింది. విస్తారమైన ఆ తోటలో ఎన్నో పూలచెట్లూ, ఫలవృక్షాలు, ఈతకొట్టేందుకు కొలను వున్నాయి. కొన్ని భాగాలు పాలనలేక అడవులలా వున్నాయి. తోట చుట్టూరా ఎత్తైన ప్రహరీ వున్నది. వారికిచ్చిన ఇంటివద్ద సాంస్కృతిక కార్యక్రమాలకు ఉద్దేశించబడిన పెద్దహాలు ఒకటున్నది.

నిర్మలాదేవి ఇంకా మౌనంలోనే వున్నది. రోజులో ఎక్కువ భాగం ఆమె భావ సమాధిలో వుంటున్నది. ఆమె ఎలాగో తెల్లవారు ఝామున మెలుకువ తెచ్చుకొని, తెల్లవారుఝామునే వంట పూర్తి చేసి ఆఘా అనే పిల్లవాడిని బడికి పంపేది. తర్వాత కొలనువద్ద వంట పాత్రలు తోముకొని ఇలవేల్పుకు మహానైవేద్యం సిద్ధం చేసేది. అంత పని మధ్యలో గూడ తరచుగా ఆమెకు భావ సమాధి వచ్చేది. భోజనం వడ్డిస్తుండగా మధ్యలో ఆమె చేయి అలానే నిలచి పోయేది; కొలనువద్ద పాత్రలు తోముకొనుచుండగా ఆమె భావ సమాధిలో ఒళ్ళు

తెలియకుండా ఎంత నిప్పు అక్కడ పడిపోయింది; వంట చేస్తుండగా ఇట్టి స్థితులు కల్గడం వలన ఎన్నోసార్లు ఆమెకు శరీరం కాలింది. ఆమె గురించి వినినవారు కొందరు ఆమె దర్శనానికి రాసాగారు. ఆమె ఒక మాటయినా మాట్లాడక పోయినా, ఎవరికేసీ చూడకపోయినా ఆమెను దర్శించిన వారందరూ పిన్నలు, పెద్దలు-మంత్రముగ్ధులై 'అమ్మ, అమ్మ,' అంటూ ఆమెను విడవలేక పోయేవారు. ఈ భక్తులు సాటివారి కువిమర్శలు గూడ లెక్కపెట్టేవారుకారు. ఎందరెందరో అతిథులు అమోఘమైన ఆమె చేతి వంట తిన్నారు. ఆమె ఏరోజు వచ్చిన కూరలు, పండ్లు ఆరోజే ఖర్చు చేసేసేది. ఆమె చేసిన వంట కించిత్తు గూడ మిగలకుండా, కొద్దిగూడ తరుగవకుండా నాటి అతిథులకు సరిగ్గా సరిపోయేది. ఒకరోజు మాటల సందర్భముగా భోలానాథ్ ఆమెతో, ''నీకు ఏది తిన్నా ఒకటే అన్నావుగదా; ఈ ఎండు మిరపకాయల కారం తినగలవా?'' అన్నారు. వెంటనే ఆమె పిడికిలి నిండుగా ఎండు కారం తీసుకొని నోటినిండా పోసుకున్నది. అయినా ఆమె ముఖంలో కించిత్తుగూడా మార్పులేదు. కాని కొద్దిసేపట్లో భోలానాథ్‌కు రక్త విరేచనాలు ఆరంభమై కొద్దిరోజులకు గాని తగ్గలేదు. ఆయన బాధపడుతుంటే ఆమె, ''నన్నిలా పరీక్ష చేయవద్దని ఎన్నోసార్లు చెప్పాను గదా, ఇలా ఎందుకు చేసారు?'' అని జాలిగా అన్నది. ''ఇంకెప్పుడూ ఇలా చేయనులే!'' అన్నారు భోలానాథ్.

విశాలమైన ఆ తోటలో ఒక మూల రెండు ముస్లిముల సమాధులు వున్నాయి. విచారించగా అవి అరేబియా నుండి వచ్చిన గురుశిష్యుల సమాధులని, వారిని భక్తి శ్రద్ధలతో ఆ నవాబుల కుటుంబమే ఆ తోటలో వుండమని ఆహ్వానించారనీ, వారిద్దరూ

అక్కడ సమాధి చెందారని రాణిగారు చెప్పింది. అది వినగాన బజిత్‌పూర్‌లో నిర్మలాదేవి అన్న మాటలకు అర్థమేమో అందరికీ తెలిసింది. అలానే ఒకరోజు నిర్మలాదేవి తనకు ఒక చెట్టు దర్శన మిచ్చినదని, దాని పేరు సిద్ధేశ్వరీ వృక్షమని వినిపించిందనీ చెప్పి, ''ఆ పేరెక్కడయినా విన్నారా?'' అని భోలానాథ్‌ను అడిగింది. ఆయన ఎక్కడా వినలేదని చెప్పాడు. తరచుగా ఆమెను దర్శించే చావులచంద్ర అను సాధువు అర్ధరాత్రి కాలిబాటన ఎక్కడకో వెళ్ళిపోయేవాడు. ఒకరోజు భోలానాథ్ అతనిని, ''నీవు అర్ధరాత్రి ఎక్కడకు వెళతావ్?'' అని అడిగితే అతడు, ''ఇక్కడకు కొద్ది దూరంలో సిద్ధేశ్వరి అనుచోట అతి ప్రాచీనము, సుందరము అయిన కాళికాదేవి ఆలయానికి వెళతాను'' అన్నాడు. ఒకరోజు అందరూ కలసి అతనితో అక్కడకు వెళ్ళారు. అక్కడ మహారణ్యంలా వున్నది. ఆలయం ఎదుట పెద్దరావి చెట్టు ఒకటి వాలిపోయి వున్నది. ''ఇక్కడ ఎందరో మహాత్ములు తపస్సు చేసి సిద్ధి (ఆత్మజ్ఞానం) పొందారు. ఈ సమీపంలో ఎక్కడో 'పంచముండి ఆసనము' వున్నదట. అంటే తంత్రయోగులు మాత్రమే సాధన చేసుకొన్న ప్రదేశము. ఒకప్పుడిక్కడ మూడు మహావృక్షాలు వుండటం చేత దీనిని 'తీన్‌తిరి' అనికూడా అంటారు. ఈ ఆలయం 'సంవర్‌సన్' అనే గొప్ప సన్యాసి కట్టాడని ప్రతీతి. ఆ మూడు వృక్షాంలో ఇప్పుడు ఇదొక్కటే మిగిలింది. ఇది కూలి పోయి నప్పుడు దీనినుండి దివ్యమయిన వెలుగు వెడలి దేవీ విగ్రహంలో లీనమయిందని చెప్తారు.'' అని చావుల్ చెప్పాడు. తర్వాత ఒకనాటి రాత్రి నిర్మలాదేవి, బృందము సిద్ధేశ్వరీ ఆలయానికి వెళ్ళారు. కాని ఆలయానికి తాళం వేసి వున్నది. ఆమె భావ పారవశ్యంలో ఆ తాళం త్రాకగానే అది తెరుచుకున్నది. ఇక ఆలయాన్ని అలా విడిచి వెళ్ళలేక ఆ రాత్రి ఆ బృందము అక్కడే వున్నది.

ఆ రోజుల్లోనే నిర్మలాదేవి సుఖదుఃఖాలకు అతీతంగా వున్నదన్న నిదర్శనాలెన్నో కన్పించాయి. ఆగష్టు 1924లో 16 సం॥ల వయస్సుగల ఆమె చెల్లెలు సురబాలకు జబ్బుచేసిందని తెలిసి భోలానాథ్ మరియు నిర్మలాదేవి విద్యా కూటమి వెళ్ళి ఆమెను చూచి ఒక్కరోజులో వచ్చారు. వారు రాగానే ఆమె మరణించినదన్న వార్త కూడా వచ్చింది. అయినా నిర్మలాదేవి వైఖరిలో ఎట్టి మార్పులేదు. ఆమె వైఖరి, ''ఎలా జరిగితే ఏమి?'' అన్నట్లు వుండేది. సాటివారి అవసరాలు, భావాలననుసరించి మాత్రమే ఆమె చర్యలు కొనసాగేవి కాని ఆమె ఆశ్చర్యకరమైన రీతిన ఎన్నడూ ఏమీ చేసేదికాదు. ఎంతటి మహాద్భుతమైన లీల జరుగుతున్నా ఆమె మాత్రం సహజాతి సహజంగా ప్రవర్తించి, తనకు, సాటివారికి మధ్య తారతమ్య భావాలకు ఎట్టి అవకాశమూ లేకుండా చూచుకొనేది. ఆమె తల్లిదండ్రులుకూడా తరచుగా ఆమె వద్దకు వచ్చి పోతుండేవారు. అందరూ వారిని ప్రేమతో 'అమ్మమ్మ' (దాదిమా) అని, 'తాతయ్య' (దాదామసాయ్) అని పిలుచుకొనేవారు.

సెప్టెంబర్ 1924లో ఒకరోజు నిర్మలాదేవి బియ్యము, ఉప్పు, బంగాళదుంపలు తెప్పించి భోలానాథ్‌తో కలిసి సిద్ధేశ్వరీ ఆలయానికి వెళ్ళి మహానైవేద్యము వండి దేవికి నివేదించింది. అదే ఇద్దరూ భోజనం చేసాక, తాను కొద్ది రోజులు అక్కడే వుండదలచానని ఆమె చెప్పింది. విధి లేక దాదిమాగాని లేక భోలానాథ్ గాని ఆమెకు అక్కడ తోడుగా వుండేవారు. అమ్మ నిర్మలాదేవి తెల్లవారుఝామునే స్నానం చేసి ఆలయం వెనుక భాగంలో వున్న చిన్న గదిలోకి వెళ్ళి అర్ధరాత్రి వరకు ఏకాంతంగా వుండిపోయేది. ఆమెకు తోడుగా వున్నవారు ఆలయంలో వుండేవారు. అర్ధరాత్రి ఆమె బయటకు వచ్చి

చావులచంద్ర ఆప్తు మిత్రులు అందరితో కలిసి భుజించేది. అమ్మ మరల గదిలోకి వెళ్ళిపోయేది. ఎనిమిదవ రోజు తెల్లవారుఝామున అమ్మ భోలానాథ్‌ను ఒకచోటుకు పిలుచుకు వెళ్ళి, అక్కడ కూర్చొని కొంతసేపు భావ పారవశ్యంలో ఏవేవో మంత్రాలు చదివింది. తర్వాత తన కుడి చేయి నేలమీద పెట్టి దానిపై ఊదింది. చిత్రంగా ఆమె చేయి భుజం వరకు లోతుకు దిగిపోయి, లోపలనుండి ఎర్రగా వెచ్చగా వున్న నీరు ఊరింది. భోలానాథ్ భయపడి ఆమె చేయి బయటకు లాగి వేసాడు. ఆమె ఆయనచేత గూడ అందులో చేయి చొప్పించింది. ఉదయమే చావులచంద్ర ఆ చోట ఒక తులసి మొక్క, కొర్దిపూల మొక్కలు నాటి ఆ ప్రదేశాన్ని గుర్తు పెట్టాడు. తర్వాత ప్రాణగోపాల్ అనే భక్తుడు అక్కడ సొంత ఖర్చుతో ఆ కంతపై 21 చదరపు మూరల వేదిక నిర్మించి దాని చుట్టూ 5 చదరపు గజాల మేరకు వెదురు బొంగులతో ఆవరణ కట్టించాడు. అటు తర్వాత అమ్మ భక్తులతో కలిసి అక్కడకు వెళ్ళి రాత్రంతా మౌనంలో గడిపేస్తూవుండేది. అంత నిద్ర లేకపోయినా ఎవరి ఆరోగ్యమూ కించిత్తైనా దెబ్బతినేదికాదు. ఢాకా పట్టణం నుండి ఎందరెందరో విద్యావంతులు,. ఉద్యోగులు అమ్మ దర్శనానికి వస్తుండటంతో అంతవరకూ నిర్మానుష్యంగా వున్న 'షాబాద్' కళకళ లాడసాగింది. ఒకరోజు భోలానాథ్‌తో, ''ఇంతమందిని మీరు దర్శనానికి రానిస్తున్నారు; ఈ విషయమై మరొకసారి ముందుగా ఆలోచించడం మంచిది; లేకుంటే ఒకనాటికి ఈ జనవాహినిని ఆపువేయడం ఎవరితరమూ కాదు'' అన్నారు. కానీ భోలానాథ్ పట్టించుకోలేదు. ఒకప్పుడు రాణీగారు తమ ఆస్తి విషయమై నడుస్తున్న కోర్టు వ్యవహారంలో తనకు అమ్మ సహాయం కావాలని భోలానాథ్‌గారితో చెప్పించింది. అంతవరకూ ఆయన మాట జవదాటని అమ్మ అంగీకరించింది. ఆ ప్రకారమే వారు రాణీగారికి

అనుకూలంగా వచ్చింది. అంతవరకూ ఢాకా పట్టణం నుండి వస్తున్న పెద్దపెద్ద డాక్టర్లు, ప్రొఫెసర్లు ప్రభుత్వోద్యోగులు కూడా ఇంకా అధిక సంఖ్యలో షాబాద్‌కు రాసాగారు.

ఆ సం॥ము జనవరి 26న వచ్చిన సూర్యగ్రహణంనాటి రాత్రి 10 గం॥కు షాబాగ్‌లో కీర్తన ఏర్పాటు చేసారు. అది ప్రారంభమవగానే అమ్మకు ఏనాడూ లేనంత భావపారవశ్యం కల్గింది. బాహ్య స్మృతిలేని పరిస్థితిలో ఆమె మునివ్రేళ్ళమీద నిలచి కీర్తనతో లయ తాళబద్ధంగా ఊగుతూ పెనుగాలిలో ఎండుటాకువలె నృత్యం చేసింది. ఆమె దృష్టి ఊర్ధ్వముఖంగా నిలచిపోయింది; ఆమె ముఖం దివ్యమైన వర్చస్సుతో వెలిగిపోయింది. కొద్ది నిమిషాల తర్వాత ఆమె క్రింద పడిపోయి, ఎవరూ ఆపలేనంత వేగంగా నేలపై పొర్లింది. చివరకు కొంతసేపు ఆమె శిలాప్రతిమవలె నేలపై నిలచి వుండిపోయి మరికొద్దిసేపు -

**'హరే మురారే, మధుకైటభారే,**
**గోపాల, గోవింద, ముకుంద, శౌరే'**

అని ఎంతో మధురంగా కీర్తన చేసింది. చివరకు నిర్జీవమయి పోయి నట్లు నేలపై పడిపోయింది. ఆమె మరలా లేచి కూర్చున్నాక గూడ ఎన్నో దివ్యమైన భావాలు ఆమెలో ప్రకటమయినాయి. కొంతసేపు ఏవో మంత్రాల వంటి శ్లోకాలు ఆమె నోటివెంట గంగాప్రవాహంలా దొర్లాయి. తర్వాత ఏమీ జరుగనట్లే అమ్మ లేచి అందరికీ ప్రసాదం వడ్డించింది. అప్పటి నుండి ప్రతి సాయంత్రము షాబాగ్‌లో కీర్తన జరుగుతుండేది. క్రమంగా ఒక కీర్తనబృందము, వాయిద్యాలూ సమకూడాయి. నిరంతరమూ అమ్మ భావసమాధిలో వుండి పోతుండేది.

పగలు, రాత్రి అనే భేదమే తెలియని ఆనందపారవశ్యంలో కాలమంతా ఆమెకు సంతతధారగా గడవసాగింది. మాట్లాడుతూనే అకస్మాత్తుగా అమ్మ దృష్టి నిలచిపోయేది. అమ్మ శరీరం కొయ్యబారిపోయి శిలా ప్రతిమలా అయిపోయేది. శ్వాస అంతకంతకూ మందగించిపోయి చివరకు పూర్తిగా నిలచిపోయేది. ఆమె ముఖంలో చెప్పలేని శాంతి తాండవించేది. ఇలా కొన్ని గంటలో ఒకరోజో గడిచాక భక్తులు ఆమెను మేల్కొలపడానికి ఎంత ప్రయత్నించినా ప్రయోజనం వుండేది కాదు. చివరకు ఎలాగో ఆమెకే ఆమే మేల్కొనేది. అట్టి స్థితులలో ఒకొక్కప్పుడు ఎన్నో దేవతా ముద్రలు, భంగిమలు ఆమె శరీరంలో ప్రకటమయ్యేవి. అమాయకులైన భక్తులు ఆమె దేవీ అవతారమని తలచారు; పండితులు ఆమె ఆత్మజ్ఞానము పొందిన గొప్ప సాధకురాలని తలచారు. ఆమె మాత్రం అదేమీ పట్టించుకొనక సాధ్యమైనప్పుడల్లా వంట, పాత్రలు తోముకోవడం, ఇల్లు చిమ్ము కోవడం వంటివి చేసుకొంటూ వుండేది. ఆమె వైఖరి, 'ఎవరి భావము వారిది' అన్నట్లు వుండేది.

నిజానికి భక్తుల అనుభవాలు గూడా అలాగే వుండేవి. ఉదా :- ప్రమథనాథ్ బసు, అతని భార్య ఒకప్పుడు కొంతకాలం మౌనవ్రతం పాటించాలని వుందని అమ్మతో చెప్పారు. రోజూ కొంతసేపైనా మౌనం పాటించి ఆ సమయం సాధనకు వినియోగించుకోవాలని వారి తలంపు. అప్పుడు అమ్మ ప్రమథనాథ్‌కు మౌనం సిద్ధించడానికి ఒక క్రియ చెప్పారు. దానివలన అతడు ఒక ఆదివారమంతా మౌనంలో గడిపాడు. సోమవారం తెల్లవారాక గూడ అతడికి మాట పెగల్లేదు. ఆఫీసులోని వారంతా అతని రాకకోసం ఎదురు చూస్తున్నారు. అమ్మ అకస్మాత్తుగా అతనింటికి వెళ్ళి మౌనం తొలగించుకోవడానికి కావలసిన

మరొక క్రమ చెప్పారు. అలా అయితే తన నిత్య విధులకు ఆటంకము వస్తుందని అతడు వాపోతే ఆమె, ''నేనేమి చేసేది? మౌనం వహించడం ఎలా అని మాత్రం అడిగావు గాని దానిని చాలించడం ఎలాగో నీవు అడుగలేదుకదా?'' అన్నది.

అమ్మ కీర్తి అంతటా వ్యాపించడానికి ఆమెను దర్శించినవారికి కలుగుతున్న దివ్యానుభవాలు కూడ కారణమయ్యేవి. ఎందరెందరో రోగులు ఎన్నో ప్రాంతాల నుండి షెబాగ్ వచ్చేవారు. కేవలం ఆమె దృష్టివలన, స్పర్శ వలన, కాకతాళీయమైన ప్రసాదం వలన ఎందరికో వ్యాధులు తగ్గిపోయేవి. ఉదా :- కాళ్ళు చేతులు చచ్చుబడిపోయిన ఒక పిల్లవాణ్ణి ఆమె ఎదుట కూర్చోపెట్టారు. ఆమె నవ్వుతూ ఒక పోక చెక్క అతని ముందరకు విసిరి, ''అది తీసుకో నాన్నాం!'' అన్నారు. అతడెంతో శ్రమపడి ఎలాగో దానిని తీసుకున్నాడు. కొద్ది రోజులలో అతనికి వ్యాధి పూర్తిగా తగ్గిపోయింది. కాని అమ్మ తానెవరికీ వ్యాధులు నివారిస్తాను రమ్మని చెప్పలేదు సరికదా, తానుగా అట్టి ప్రయత్న మెన్నడూ చేయనూలేదు సరికదా, ''భగవంతుని ప్రార్థించుకోండి, రోగికేది శ్రేయస్కరమో అది ఆయనే చేస్తాడు, అతనికి వ్యాధి తగ్గడము శ్రేయస్కరం అవునో కాదో మనకు తెలియదు కదా! మీరు శక్తి వంచన లేకుండా అతనికి మంచి వైద్యము మాత్రం చేయించండి. ఆపై ఆయన చేసినదే శ్రేయస్కరమని విశ్వసించాలి'' అనేవారు. ఒక్కొక్కప్పుడు రోగిని చూడటానికి రమ్మని భక్తులు కోరేవారు. ఆమె, ''నేను వెళ్ళి చూస్తే తప్పక రోగం తగ్గుతుందని మీరు అను కుంటారు. కాని అది నిజమా?'' అనేవారు. సామాన్యంగా భక్తులు, ''తప్పకుండా అలానే జరుగుతుంది.'' అని నిశ్చయంగా చెప్పేవారు. ''మీరంతా అలా అంటున్నారు కనుక అలాగే జరుగుతుందేమో?

ఎవరికి తెలుసు?'' అని తామే రోగిని చూసి వచ్చేవారు.

తప్పనిసరిగా రోగులు స్వస్థులయ్యేవారు. ఎందుకోగాని ఒక్కొక్కప్పుడు ఆమె అలా అడుగగానే భక్తులు తడబడేవారు. అమ్మ, ''అలా తడబడతారేమి?'' అని మాత్రమనేవారు. అటువంటప్పుడు రోగికెట్టి మేలూ జరిగేది కాదు. ఒకసారి ఒకామె వచ్చి రోగంతో వున్న తన కొడుకును చూడడానికి రమ్మని అమ్మను కోరింది. భోలానాథ్ కూడా అమ్మను వెళ్ళిరమ్మన్నాడు. ఆమె అయోమయంగా ముఖంపెట్టి, ''ఎందుకు, అబ్బాయికి వ్యాధి తగ్గదు'' అన్నారు. కొద్దిరోజుల తర్వాత ఆమె మరలా వచ్చి తన బిడ్డను ఎలాగైనా బ్రతికించమని ప్రాధేయపడింది. అమ్మ నవ్వి, ''అతడు బ్రతికేందుకు ఏదైనా చేయమని చెప్పినా మీరు చేయలేరు. కావాలంటే 18 రోజులపాటు మంచం నుండి లేవకుండా చూచుకోండి. అటు తర్వాత చూద్దాం'' అన్నారు. కొద్ది రోజుల తర్వాత ఆ పిల్లవాడు చనిపోయాడు. అతని తల్లికి అమ్మపై విశ్వాసం సడలిపోయింది. ఒకరోజు ఆమె ఆవేశంగా అమ్మ వద్దకు వచ్చి, ''మీరే దైవమని నమ్మాను, మీరు చెప్పినది అక్షరాలా పాటించాను. అయినా బిడ్డ దక్కలేదు. అనవసరంగా ఆశలు పెంచి నా జీవితంతో చెలగాటమాడారు!'' అన్నది. అమ్మ దృఢమైన కంఠంతో, ''ఆ పిల్లవాడు క్రిందటి సోమవారంనాడు మంచం మీద నుంచి లేచి తిరిగాడు. మీరు చెప్పినట్లు ఎక్కడ చేశారు? అయితే అది మీ తప్పు కాదు. మీరెలాగూ చేయలేరని ముందే చెప్పాను'' అన్నారు. తర్వాత విచారించుకోగా వారి వీధిలో ఊరేగింపు జరుగుతుంటే అందరూ మేడమీద నుంచి క్రిందకు వెళ్ళి అది చూస్తున్నప్పుడు మేడమీద ఒంటరిగా వున్న ఆ పిల్లవాడు కూడ మంచంమీద నుండి లేచి వెళ్ళి వరండాలో నిలబడి ఊరేగింపు చూచాడట. అది చూచిన

తెలిసింది. అది తెలుసుకుని ఆ తల్లివచ్చి అమ్మకు క్షమాపణ చెప్పుకున్నది.

ఒకరోజు అమ్మ షాబాగ్ నుండి బయటకు వచ్చారు. అటు ప్రక్కగా ఒక టాంగా వెలుతుంటే అమ్మ బండివాణ్ణి పిలిచింది. ''ఎక్కడికి వెళ్ళాలి అమ్మగారు?'' అన్నాడు ఆ బండివాడు. అమ్మ ''మీ ఇంటికే?'' అన్నారు. అతడు మహమ్మదీయుడు. అతడు కొంచెం తటపటాయించి తర్వాత మాట్లాడకుండా అమ్మను తన ఇంటికి తీసుకువెళ్ళాడు. అక్కడ అతని తండ్రి అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మంచంలో అవసానదశలో ఉన్నాడు! డాక్టరు అతడు బ్రతకడని చెప్పడంతో ఆ ఇంట్లో అందరూ ఏడుస్తున్నారు. అమ్మ ఎంతో సరదాగా తమ చెంతనున్న వారిచేత మిఠాయి తెప్పించి, ఆ ఇంట్లో అందరకూ పెట్టి తిరిగి వచ్చేశారు. మరురోజుకల్లా ఆ వృద్ధుడు లేచి తిరిగాడు. ఒక్కొక్కప్పుడు అమ్మ దయవలన రోగికి స్వస్థత చేకూరడం, అప్పటినుండి అమ్మ కొద్దిరోజులు జబ్బు పడడం జరుగు తుండేది. మరొకప్పుడు ఎవరికైనా వ్యాధి తగ్గించమని భోలానాథ్‌గారు చెప్పినా ఆమె, ''అటువంటివి నాకెన్నడూ చెప్పవద్దు. ఎవరైనా జబ్బు పడాలని మీరెన్నడూ నన్ను ఎలా ప్రార్థించరో, అలానే! ప్రతివాడు అనుభవం ద్వారా కర్మ క్షయం చేసుకోవాలి. దానినడ్డుకుంటే వచ్చే పర్యవసానాలు బాగుండవు'' అనేవారు. ఒక విదేశీయురాలు, ''వ్యాధులన్నీ కర్మఫలములే అయితే చికిత్స చేయించుకోవడం సమంజసమా?'' అని అడిగింది. ''అస్వస్థతగా వుండి సాధన చేయడం కష్టం కనుక శరీరాన్ని స్వస్థతగా వుంచుకునే యత్నం మన శక్తి వంచన లేకుండా చేస్తూండవలసిందే. అప్పటికీ రోగ బాధ తగ్గనపుడు దానిని ఓర్చుకోవడం గూడ నేర్చుకోవాలి. అది భగవంతుని ప్రసాదమని

గుర్తించాలి'' అన్నారు అమ్మ.

అమ్మ సన్నిధిలో సిద్ధంగా వున్న కొద్దిపాటి వంటకాలే ఎందరు భోక్తలకో సరిపోవడం జరుగుతుండేది. సామాన్యంగా నెరవేరడం సంభవం కాని పరిస్థితులలో కూడ అమ్మతో చెప్పుకున్నంత మాత్రాన భక్తుల కోర్కెలు నెరవేరిన సన్నివేశాలెన్నో వున్నాయి. ఆమెతో నోరు విప్పి చెప్పకపోయినా భక్తులు మనసులో అనుకున్నవి నెరవేరుతుండడం కూడ కద్దు. అమ్మ దక్షిణ దేశంలో పర్యటిస్తున్నప్పుడు 1952లో మద్రాసు ప్రాంతంనుండి కొందరు భక్తులు జట్లుగా వచ్చి తమ ప్రాంతంలో వర్షాలు పడడం లేదని, ఎలాగైనా వర్షం అనుగ్రహించమని అమ్మను కోరారు. అమ్మ ఊరికే విన్నట్లు తలవూపారు. కొద్దిరోజులలో ఆ ప్రాంతంలో భారీ వర్షాలు పడ్డాయి.

భక్తులు పైకి చెప్పని మనోభావాలకు కూడ అమ్మ తరచుగా సమాధానమిస్తుండేవారు. కాని తాను వారి భావాలెరిగినట్లు ఎన్నడూ బయటపడేవారుకాదు. ఒకసారి సిమ్లా వద్ద సోలన్ అనే పట్టణంలో జరుగుతున్న నామయజ్ఞానికి అని ఎందరో భక్తులు వచ్చారు. నాటి రాత్రి 9 గం॥ వరకు భజన చేసిన బృందం సమీపంలోని శివాలయం వద్దనున్న గదిలో విశ్రమించి బీడీలు త్రాగుతున్నారు. వారిలో అమ్మ దివ్య శక్తుల గురించిన చర్చ వచ్చింది. వేడుక చూడవచ్చిన ఒక క్రొత్త వ్యక్తి ఆ భక్తుల మూఢ నమ్మకాలను విమర్శించాడు. చివరకు కుండపోతగా పడుతున్న వర్షంలోకి చూస్తూ, ''ఈ ఆనందమాయికి అంత శక్తే వుంటే, ఇప్పటికిప్పుడు, మన ఎదుట కనిపించమను నమ్ముతాను!'' అన్నాడు. భక్తులు సమాధానం చెప్పేలోపలే ఎవరో తలుపు గట్టిగా తట్టారు. మరుక్షణమే పెనుగాలికి తలుపులు బార్లా

తెరుచుకున్నాయి. అక్కడ వానలో తడిసి ముద్దయిన అమ్మ నిలబడి పకపకా నవ్వారు. అతడాశ్చర్యం నుండి కోలుకునే లోపలే ఆమె రెండడుగులు వేసి అదృశ్యమయ్యారు. అయినప్పటికీ దివ్య మహిమల ప్రస్తావన ఎప్పుడు వచ్చినా అమ్మ తరచుగా ఇలా చెప్పేవారు; ''ప్రకృతి ధర్మాలను ఉల్లంఘించడమే దివ్యలీల అనుకోవడం సరికాదు. నిజానికొక యోగి నీటి మీద నడిచినా, గాలిలో ఎగిరినా, దానివలన, ఇతరుల కొరిగేదేమిటి? ఏ సమయానికి ఏది అవసరమో అది జరుగుతూండడం అది గొప్పలీల. కాకుంటే అలా ఎప్పుడూ జరుగుతూండడం వలన అది మహిమగా గుర్తించకపోవచ్చు. కారణం దాని వలన ఎట్టి ప్రకృతి ధర్మాలూ ఉల్లంఘించబడవు. తాను సృష్టించిన ప్రకృతి ధర్మాలనుల్లంఘించి ఏపని జరుపుకోవడమూ నిజమైన దైవశక్తికి ఎన్నడూ అవసరం కలగదు. ఆయనే ఆ ప్రకృతి ధర్మం గనుక అవే ఆయన సంకల్పానుసారం నడుచుకుంటాయి.'' అని చెప్పేవారు.

అయినప్పటికీ సన్నిహితంగా వుండే భక్తులు ఎన్నో చిత్రమైన లీలలు కూడ అమ్మలో చూచారు. ఏప్రిల్ 1924లో అమ్మ రోజుకు రెండుసార్లు తడవకు మూడు ముద్దలు మాత్రమే భుజించేవారు. అంతకుముందు కొంతకాలం నిత్యమూ తొమ్మిది మెతుకులు మాత్రమే తింటూ సోమ, గురువారాలలో 3 ముద్దలు మాత్రమే తినేవారు. ఆ రోజులలో అమ్మ చేయి ఆమె నోటిదాకా వెళ్ళేదికాదు. అది మధ్యలోనే నిలిచిపోతే అమ్మ తలవంచి తన చేతిలోని ఆహారం తినేది. ఒక్కొక్కప్పుడు భోలానాథ్ గాని, అమ్మమ్మగారు కాని ఆమెకు తినిపించవలసి వచ్చేది. ''ఆరోజులలో సర్వం నా రూపమేనన్న భావముండేది'' అని తర్వాత ఒకప్పుడు అమ్మ వివరించారు. అదెలా

సాధ్యమని అడిగిన వారితో అమ్మ, ''సామాన్యంగా మనము అవసర

మైన దానికంటే ఎక్కువ తింటాము. నిజానికి మన దేహం స్వీకరించేది అతి కొద్ది ప్రమాణంలో వుండే సారము మాత్రమే. కనుక సాధన వలన శరీరం పరిసరాలనుండి ఆ కొద్దిపాటిసారం గ్రహించడం సాధ్యమే. లేక ప్రతిదానిలోనూ ప్రతిదీ వున్నది గనుక కేవలం గాలిపై కూడ జీవించవచ్చు. మరొకప్పుడు సమాధి వంటి స్థితిలో అంతమాత్రం ఆహారంకూడ దేనినుండి స్వీకరించకుండానే జీవించవచ్చు.'' అని చెప్పారు. ఆమె ఒకప్పుడు 13 రోజుల వరకు మంచినీరు కూడ త్రాగకుండా వున్నారు. ఆమె ఆరోజుల్లో నీరు కూడా పుక్కిలించేవారు కాదు. కొంతకాలం షాబాగ్‌లో చెట్లనుండి సహజంగా రాలిపడిన పండ్లను మాత్రమే తినేవారు. కొంతకాలం అనాయాచితంగా ఎవరైనా తెచ్చిన పళ్ళు మాత్రమే తీసుకునేవారు గాని సేవకులు ఎట్టి ఏర్పాటుచేసినా ఒప్పుకునేవారుకారు. ఒకవేళ అధికంగా పండ్లు వస్తే మరురోజుకు దాచిపెట్టనిచ్చేవారు కాదు, కొంతకాలం ఒక గుప్పెడు మాత్రమే ఆహారం తీసుకునేవారు. మరొకప్పుడు మూడు వ్రేళ్ళతో పట్టుగొనడానికి వీలయినంత మాత్రమే ఆహారం తీసుకునే వారు. ఎవరైనా పట్టుపడితే వారికి తెలిసివచ్చేలా ఏడు, ఎనిమిది మంది మనుష్యులకు సరిపడా తినేవారు. ఒకసారి ఆమె అలా వేగంగా తింటూవుంటే ఇద్దరు భక్తులు కలిసి కూడ ఆమె నోటికి అందించలేక పోయేవారు. ఒక్కొక్కప్పుడు భక్తులు గమనించకుంటే కాయలు, తొడిమలు, తొక్కలు గూడ తినేసేవారు. భక్తులు బాధపడుతుంటే, ''నన్ను తినమని మాత్రమే చెప్పారుకాని, ఏవి తినాలో, ఏవి విడిచి పెట్టాలో చెప్పలేదుకదా!'' అనేవారు. ఒకసారి, రాయపూర్‌లో ఒక భక్తురాలు చెంచాతో కప్పులో సగానికి పాయసం అమ్మచేత తినిపించింది. తరాత అమ్మ ఆమెను కూడ కొంచెం రుచి చూడ

మన్నారు. ఆ ఒక్క చెంచాకే నోరంతా కాలిపోయేంత వేడిగా వున్నది. అప్పుడా భక్తురాలు బాధపడి అమ్మ నోరు తెరిపించి చూడగా అమ్మ గొంతంతా చెక్కు లేచిపోయి ఎర్రని పుండయింది. అది పూర్తిగా తగ్గడానికి కొన్ని నెలలు పట్టింది.

అమ్మను పూజించడం సులభమేకాని దగ్గర వుండి సేవ చేయడం కష్టమయ్యేది. కారణం ఆమె తనకేమైనా కావాలనిగాని, వద్దని గాని చెప్పేది కాదు. ఏమి చేసినా అంగీకరించేది, ఏమీ చేయకున్నా అడిగి చేయించుకునే వారుకాదు. చూచుకుంటే ఆమెసేవలో ఎప్పుడూ ఏదో ఒక లోపము జరుగుతూనే వుండేది. ఎప్పుడూ ఆమె చెంత నుండేవారుఆమెకు ప్రత్యేకించి సన్నిహితులని క్రొత్తవారనుకునేవారు, కాని అది నిజంకాదు. అందరికీ ఆమె అంతే దగ్గర, అంతే దూరం. ఆమె ఎన్నోసార్లు ఆ విషయం స్పష్టంగా చెప్పారుగూడ. కాని కొందరు మాత్రమే ఆ విషయం హృదయపూర్వకంగా గుర్తించగలిగేవారు, దగ్గర-దూరము అన్నవి శరీరమునకు సంబంధించినవి మాత్రమే కావని తెల్పేందుకు ఆమె ఒక దృష్టాంతము చెపుతూండేవారు : ''ఒక సరస్సులో అందమైన పెద్ద తామరపూవు వున్నది. ఎన్నడూ తామర పూవును చూడని ఒక వ్యక్తి అటుగా పోతూ దాని సౌందర్యానికి ముగ్ధుడై కొంతసేపు నిలబడి చూచాడు. దాని క్రిందనే ఒక కప్ప గుడ్లప్పగించి చూస్తోంది. దాని చుట్టూ ఎన్నో చేపలు కన్నైనా ఆర్పకుండా తిరుగుతున్నాయి. 'కప్పా, కప్పా, అదేమి పూవో చెప్పవా?' అని అతడు అడిగాడు. అది, 'ఇది మామూలుగా బురద గుంటలో మొలిచే పూవేగదా, దాని గురించి అడిగేదేమిటి వెర్రిమొహమా' అని ఒక పురుగు కోసం గెంతిపోయింది. అతడదే ప్రశ్న ప్రతి చేపనూ అడిగాడు. అవన్నీ, 'ఆ కప్ప చెపితే చాలలేదా'? అన్నట్లుచూచి అక్కడనుండి దూరంగా వెళ్ళిపోయాయి. ఇంతలో ఎక్కడ నుండో

రివ్వున ఒక తేనెటీగ పూవుమీదకొచ్చింది. అతడు దానిని గూడ అదే ప్రశ్న వేశాడు. అది బదులు చెప్పకుండా పువ్వుపై వ్రాలి కడుపునిండా తేనె త్రాగి బరువుగా అతనివైపుకు ఎగిరి, 'ఇప్పుడడుగు చెబుతాను!' అన్నది. అతడి ప్రశ్న విని, 'ఇది అద్భుతమయిన తేనెగల తామరపువ్వు. దానితో నన్ను నేను నింపుకున్నాను. ఇంతకంటె ఏమి చెప్పేది?' అని చెప్పి మరొక్క మాటైనా వినకుండా ఎగిరి పోయింది. అలానే సాధు సత్పురుషుల దగ్గర కొందరు ఎంతో కాలముండీగూడ ఏమీ గ్రహింప లేకపోవచ్చు; పరిపాకమున్నవారు ఎక్కడ నుండో వచ్చి క్షణంలో సర్వమూ గ్రహించి వెళ్ళిపోవచ్చు. మన మాంద్యము, శ్రద్ధలే ఆ రెంటికీ కారణం'' అనేవారు.

ఎవరైనా ఆధ్యాత్మిక గ్రంథాలు చదువుతున్నా, భక్తిగీతాలు పాడుతున్నా అమ్మకు భావ సమాధి వెంటనే ప్రాప్తించేది. ఒకనాటి సత్సంగములో అమ్మ సరిక్రొత్త పంథాలో ఆధ్యాత్మ విషయాలగురించి చిత్ర విచిత్రమైన పదజాలంతో చాలాసేపు చెప్పుకుపోయారు. ఆ పదాలు అందరికీ అర్థం కాలేదు కూడ. ఆమె ప్రసంగం ముగియగానే క్రొత్తగా వచ్చిన వారిద్దరు ఆమెకు దూరం నుండే నమస్కరించి, తాము సుదూర ప్రాంతాల నుండి వచ్చిన బౌద్ధ భిక్షువులమని, తమ మనస్సులను ఎంతోకాలంగా వేధిస్తున్న బౌద్ధమత గ్రంథాలలోని అంశాలే ఆమె ఎంతో సూక్ష్మంగా వివరించారనీ చెప్పి తమ కృతజ్ఞతలు అందజేసుకున్నారు. మరొకప్పుడు ఒక హఠయోగి వచ్చి తాను, మరి ముగ్గురు మిత్రులూ సర్వసంగ పరిత్యాగము చేసి తమ జీవితాలలో 22 సం॥లు యోగ సాధనకే అంకితం చేశామని, అయినా తమకు నైరాశ్యమే మిగిలిందనీ వాపోయాడు. వారిలో ఒకడు చిన్న వయసులోనే మరణించాడట; ఇద్దరికి అనివార్యములైన వ్యాధులు సంక్రమించా

యట. అప్పుడు అమ్మ అతనిని ప్రక్కకు పిలిచి గంటకు పైగా అతనితో మాట్లాడి హఠయోగ సాధనలో అతడు చేసిన పొరపాట్లు వివరించి, వాటినెలా సవరించుకోవాలో చెప్పి పంపారు. తెలిసినా అమ్మ ఎవరికీ ఉపదేశమిచ్చేవారు కాదు. ప్రతివారిలోను దైవం పట్ల ప్రీతిని మేల్కొల్పడమే ఆమె కర్తవ్యం.

ఏప్రిల్ 1925లో సిద్ధేశ్వరిలో నిర్మించిన వేదికకు ఏడు రోజులలోగా ఆచ్ఛాదన కల్పించమని అమ్మ ఆదేశించారు. పనివారు అక్కడున్న పుట్టలను పడగొట్టడానికి వెరుస్తూంటే అమ్మ భోలానాథ్‌గారిని పంపి స్వయంగా వాటిని పడగొట్టించారు. ఏడవ రోజున అమ్మ తమ బృందంతో కలసి అక్కడికి వెళ్ళి రాత్రంతా కీర్తన చేశారు. ఆ సంవత్సరం వాసంతి పూజకూడ భక్తులు అక్కడే జరుపుకున్నారు. మొదటిరోజు సాయంత్రం ఆకాశమంతా కారుమబ్బులు కమ్మి తీవ్రమైన గాలి వాన ప్రారంభమయింది. వంటగది పై కప్పు ఎగిరి పోయింది. అందరూ భయపడుతూంటే అమ్మ తీవ్రమైన భావావేశంతో బయటి గాలివానలోకి బయల్దేరింది. లావణ్య అనే భక్తురాలు అమ్మను నిగ్రహించాలని ప్రయత్నించి ఆమె శరీరాన్ని తాకగానే స్పృహతప్పి క్రింద పడిపోయింది. అమ్మ బయటకు వెడుతుంటే భక్త బృందమంతా ఆమెతో కూడా వెళ్ళిపోయారు. కాని క్రింద పడిపోయిన లావణ్యను ఎవరూ పట్టించుకోనలేదు. కొంతసేపటికి శశాంకమోహన్ అనే భక్తుడొక్కడే ఆలయంలోని కుటీరం వద్దకు వచ్చి నిర్మానుష్యమైన ఆ ప్రదేశంలో ఎంతో మధురముగా 'హరిబోల్' అన్న కీర్తన వినిపించగానే మొదట భయపడ్డాడు. తర్వాత చూస్తే స్పృహలేని లావణ్య అక్కడ పడివుండడం గమనించాడు. ఆమెను దాటి పోయిన భక్తుల పాదాలకున్న మట్టంతా ఆమెను కప్పివేసింది. ఆమె

ముఖంలో అలౌకికమైన వర్చస్సు అవతరించింది. ఆమెనెలాగో అమ్మ చెంతకు చేర్చారు. ఆమెకు ప్రాప్తించిన స్థితి ఎంత గొప్పదో అర్థం చేసుకొనక ఆమెను మేల్కొల్పమని ఆమె తల్లి అమ్మతో మూర్ఛించింది. ''ఇట్టి ఆనందం కోసమే సాధకులందరూ తపించేది. కాని ఏం చేస్తాం, ఆమె తల్లి మూర్ఛిస్తున్నది'' అని అమ్మ లావణ్యను తాకి ఏవో యోగక్రియలు చేశారు. ఆ లావణ్యకు కొంతవరకు స్పృహ రావడము, మరలా ఆనంద పారవశ్యం పొంగి పొర్లడము, మరల మరలా జరుగుతుంటే, అమ్మ ''అడవిలోని కార్చిచ్చు రగుల్కొన్నాక వెంటనే ఆర్పడం ఎవరితరం?'' అన్నారు. ఎలాగో మూడు రోజులకు ఆమెకు స్పృహకలిగింది కాని, కొద్ది సంవత్సరాల తర్వాత ఆమె మరణించింది. మహాష్టమినాడు 10 తామరపువ్వులతో అమ్మకు పాద పూజచేసి 9వ రోజున మట్టి విగ్రహాన్ని నిమజ్జనం చేసి బృందమంతా షాబాగ్ తిరిగి వచ్చింది.

అమ్మ అనుగ్రహాన్ని విశేషంగా పొందగలిగిన వారిలో, భాయీజీ అని ఒకరు వుండేవారు. అతనికి అప్పుడప్పుడు మనస్సులో అమ్మ రూపం స్పష్టంగా దర్శనమయ్యేది. తరువాత విచారిస్తే అతని మనస్సులో అమ్మ ఎలాంటి వస్త్రాలు ధరించి ఎక్కడున్నట్లు కనిపించిందో అమ్మ నిజంగా అట్టి వస్త్రాలే ధరించి ఆరీతిగానే తమ ఇంట్లో వున్నట్లు ఋజువు అవుతుండేది. ఆ విషయమే అతడు అమ్మనడిగితే, ''నీవేమి చేస్తున్నావో చూడాలన్పించి నేనే అట్లా వచ్చాను.'' అనో, ''నన్ను చూడాలని గట్టిగా సంకల్పించుకున్నావు కనుక నేనే వచ్చాను'' అనో అమ్మ సమాధానమిచ్చేవారు. ఆమె దగ్గర భక్తులు పెరిగిన కొద్దీ అతడు కొన్నేసి రోజుల వరకూ అమ్మతో మాట్లాడటమే వీలయ్యేదికాదు. ఒకరోజు అతడు షాబాగ్ కూడ

వెళ్ళకుండా తన గదిలోనే వుండిపోయాడు. కొద్ది సేపటికి అకస్మాత్తుగా దిగులుగా వున్న అమ్మ ముఖము అతనికి కన్పించింది. అతడు ప్రక్కకు తిరిగి చూచేసరికి ఒక భక్తుడు వచ్చి, ''అమ్మ మిమ్ములను తీసుకు రమ్మన్నారు'' అని చెప్పాడు. అమ్మ అతనికి ఎన్నో పరీక్షలు గూడ పెట్టారు. ఒకరోజతడు ఆఫీసులో పనిలో తలమునకలవుతుండగా ఒక భక్తుడు వచ్చి అమ్మ పిలిచారని చెప్పాడు. కొద్దిసేపట్లో అతని పైఅధికారి క్రొత్తగా బదిలీ అయి వస్తున్నాడని తెలిసింది. అయినప్పటికీ భాయీజీ బయల్దేరి షాబాగ్ వచ్చేశాడు. అమ్మ అతనిని సిద్ధేశ్వర్ తీసికెళ్ళారు. అక్కడ ఆమెలోని దివ్యవర్చస్సు చూసి అతడు భోలానాథ్‌తో, ''ఇక నుండి ఈమెను ఆనందమాయిమాత అని పిలుచుకుందాము'' అన్నాడు. అటు తర్వాత అతడికి తను ఆఫీసులో పని మధ్యలో వచ్చేసినట్లు గుర్తొచ్చి మనస్సులో ఆందోళన కల్గింది. వెంటనే అమ్మ, ''ఇందాకటి దాకా బాగానే వున్నావు కదా, ఇంతలో వ్యాకులపడు తున్నావేమి?'' అన్నారు. అతడు కారణం చెప్పాడు. తీరా అతడు ఆఫీసుకు వెళ్ళాకచూస్తే, అతడు ఆఫీసులో లేని సంగతి వారెవరూ గుర్తించలేదని తెలుసుకొని ఆశ్చర్యపోయారు. తర్వాత ఒకసారి, ''నన్నారోజు అర్ధాంతరంగా ఆఫీసు పని మధ్యలో పిలిచారెందుకు?'' అని అమ్మనడిగాడు. ఆమె నవ్వి, ''గడిచిన కొద్ది నెలలలో నీలో ఎంత పరిణతి కల్గిందో చూడడానికే! అంతేగాక, నాకా రోజు 'ఆనందమాయి' అన్నపేరు నీవు పెట్టాలిగదా!'' అన్నారు.

ఒకరోజు భాయీజీ, అతని స్నేహితుడు ముసల్మాను మౌల్వీ జియాపుర్దీన్ హుసేన్‌తో కలిసి షాబాగ్ వెళ్ళి, బయట నిలబడి అక్కడ జరుగుతున్న కీర్తన చూస్తున్నారు. అమ్మ ఒక్కసారిగా భావపారవశ్యంలో లేచి, వీరిద్దరకు వచ్చి ఆ ముసల్మానును కుడిచేతో తాకి ముందుకు

సాగిపోయారు. ఆమె ఆ తోటలో వున్న దర్గాదగ్గరకు వెళ్ళి ఆ పారవశ్యంలోనే నమాజు చేయనారంభించారు. వెంటనే హుస్సేను గూడ ఆమెతో పాటు నమాజు చేసాడు. తర్వాత ఆమెతో పాటే తిరిగి వచ్చి కీర్తనలో గూడ పాల్గొన్నాడు. మత భేద విషయంలో అమ్మ అతని భావాన్ని సంస్కరించారన్న మాట. అలానే భాయీజీ, అతని స్నేహితుడు నిరంజనరాయ్ కీర్తన అన్నది అల్పమైన సాధన అని తలచి అందులో ఎన్నడూ పాల్గొనేవారు కాదు. ఒకనాటి సాయంత్రం షాబాగ్‌లో కీర్తన అయ్యాక అమ్మ, ''ఇవాళ కీర్తనలో ఎవరు పాల్గొనలేదో వాళ్ళు ఇప్పుడు పాడి తీరాలి!'' అన్నారు. ఆ మిత్రులిద్దరూ ఆశ్చర్యపోయి కీర్తన చేయసాగారు. క్రమంగా వారి హృదయాలలో గూడ కీర్తన చేయటం వలన భక్తి తీవ్రం కాసాగింది. అందువలన అటు తర్వాత ధ్యానం కూడా చక్కగా జరుగసాగింది. అప్పటి నుండి కీర్తన ఎంత విలువయిందో వారికి తెలిసింది.

ఆ రోజులలో అమ్మ అతి స్వల్పంగా తినడం చూచి భాయీజీ చాటుగా గోధుమ పిండి, నెయ్యి, షాబాగ్‌కు పంపించి, వాటిని అమ్మకు తెలియకుండా దాచివుంచి రోజూ పూరీలు చేసి ఆమెకు పెట్టమని భక్తులను కోరాడు. కానీ మూడవ రోజుకల్లా అమ్మ అతని సమక్షంలో తమ సేవకులతో, ''ఆశ్రమంలో వున్న పిండి అంతటితోనూ పూరీలు చేసితీసుకురండి!'' అని ఆదేశించారు. కొద్దిసేపట్లో సేవకులు దాదాపు 80 పూరీలు చేసుకొచ్చి ఆమె వద్ద వుంచారు. అమ్మ అవన్నీ తినేసి, ''పూరీలు ఇంకా వున్నా తినివేసేదాన్నే, నేనే తినడమంటూ మొదలు పెడితే మీరెంత శ్రీమంతులైనా, నేను తిన్నంత పెట్టలేరు. ఇలాంటి ఏర్పాట్లు ఎన్నడూ చేయకండి!'' అన్నారు.

ఒకరోజు అమ్మ భావ పారవశ్యంలో నేలమీద చిత్ర విచిత్ర

రంగులతో యోగ శాస్త్రంలో వివరించబడిన 'షట్చక్రాలు' అనబడు ఆరు యోగ కేంద్రాల బొమ్మలు గీసారు. అది చూచి భోలానాథ్ ఆశ్చర్యంతో భాయీజీని పిలుచుకు వచ్చి చూపించారు. మన శరీరంలో ప్రాణశక్తి, నాడులు, కుండలినీశక్తి, యోగమభ్యసిస్తుంటే అవి మేల్కొని మూలాధారము నుండి సహస్రార చక్రము వరకు వెళ్ళడం గురించి అమ్మ ఎంతో చక్కగా వివరించారు. సం॥ 1926లో ఒకరోజు చిటగాం నుండి దాస్ గుప్త అను ఫోటోగ్రాఫరు అమ్మను ఫోటోలు తీయాలని ఢాకాకు వచ్చారు. అప్పుడు అమ్మ ఒక గదిలో భావసమాధిలో అచేతనంగా పడి వున్నారు. అతడు భోలానాథ్ అనుమతి మరియు సహాయంతో ఆమెను ఎలాగో వెలుగున్న చోటికి తీసుకువచ్చి 18 ఫోటోలు ఎంతో జాగ్రత్తగా తీసాడు. కానీ, చిత్రం! 17 ఫోటోలు ఖాళీగా వున్నాయి; వాటిలో ఏ బొమ్మాలేదు. ఒక దానిలో మాత్రం కూర్చొనివున్న అమ్మ ఆకారమువున్నది. గాని ఆమె వెనుక ఛాయవంటి ఆకారము ఒకటి స్పష్టంగా పడింది. అతడు ఆశ్చర్యంతో దానిని కడిగి చూడగా అది భాయీజీ రూపం. నిజానికి ఆ ఫోటో తీసినప్పుడు భాయీజీ వేరెక్కడో వున్నాడు. అంతేగాక అమ్మ నుదుట ఒక అర్ధ చంద్రాకృతి వున్నది. దానిగురించి అమ్మనడిగితే ఆమె, "భోలానాథ్ మరియు భాయీజీ నన్ను గదిలో నుండి వెలుగులోకి తీసుకొని వస్తున్నప్పుడు నా దేహం ఎట్టి ఆకృతీ లేక కేవలం కాంతి పుంజంగా వున్నట్లు నాకు అన్పించింది. (అందుకే మొదటి 17 ఫోటోలు ఖాళీగా వచ్చాయి. తర్వాత క్రమంగా ఆ వెలుగు తగ్గుతూ వచ్చి నా ఎదుట అర్ధ చంద్రాకృతి వున్నట్లు అనుభవమవుతున్నది. దానికి తోడు భాయీజీ నా వెనుకనే నిలుచున్నట్లు నాకు భావన కలుగుతూ వున్నది'' అన్నారు. అంటే అమ్మ భావాలను బట్టి ఫోటోలో

బొమ్మలు వచ్చాయన్నమాట!

అమ్మకు ఏ క్షణంలో ఏ భావం కలుగుతుందో ఎవరూ ఊహించలేకపోయేవారు. దీనిని అమ్మ 'కెయాల్' (మొతకగా తెలుగులో 'ఖయాలీ' అంటాము.) అనేవారు. ఎప్పుడూ దానిని గుర్తించి దాని ప్రకారం నడుచుకోవడం ఎంత ముఖ్యమో ఆమె పరివారం తెలుసుకోవడానికి చాలా కాలం పట్టింది. కారణం ఆమె ఎన్నడూ అలా చేయమని వారిని వత్తిడి చేసేవారుకాదు; ప్రతి విషయంలోనూ, ఆమె భావం ఎలావున్నా, తమ చెంతనున్న పెద్దలందరిని తెలుసుకొని వారి అభిమతానుసారమే నడుచుకొనేవారు. అందువలన ఆమె భావాన్నే నడుచుకోవాలని ఎవరికీ తోచలేదు. అంతేగాక సామాన్యంగా అమ్మ తాముగా ఎట్టి లక్ష్యంతోనూ ఏ పనీ ప్రారంభించరు. ఆమెను భక్తులు తమ ఇండ్లకు తీసుకు వెళ్ళేటప్పుడు, తీసుకువెళ్లాక వారు చేసిన ఏర్పాట్లు ఆమెకు కొంత బాధను కలిగి స్తున్నా సరే, ఆమె ఎన్నడూ, పెదవి విప్పి చెప్పేవారు కారు. తమ చెంత నున్న సేవకులు తగురీతిన ఏర్పాట్లు చేస్తామన్నా ఒక పట్టాన ఆమె అంగీకరించేవారు కారు. ''వారి శక్తివంచన లేకుండా సాధ్యమయినంత ఉత్తమమైన రీతిన ఏర్పాట్లు చేసుకుంటారు. కానీ వారి తల్లి వాటిని కష్టపడనంతటి పల్లెటూరు బైతని పాపము వాళ్ళకేమి తెలుసు?'' అనేవారు అమ్మ. ఆమె సాటి వారి భావాలను గుర్తించి అనుసరించడం చూచిన ఒక భక్తుడు ఆమెను, ''అమ్మా, మీకెప్పుడూ ఇతరుల ఆలోచనలు తెలుస్తూనే వుంటాయా?'' అని అడిగాడు. ''ఎప్పుడూ తెలుస్తూ వుండవు. ఏ సమయంలోనైనా నా ధ్యాస ఏ విషయాలపై వుంటుందో దానికి సంబంధించినంత వరకు మాత్రమే నాకన్నీ తెలుస్తుంటాయి. పుస్తకంలో పుటలు చదివేటప్పుడు మన దృష్టి

విడివిడిగా అక్షరాలపై నిలువక, పదాలను, వాక్యాలను - అంతకంటె గూడ అందులోని భావం పై మాత్రమే నిలవడం వంటిదే ఇది కూడాను. అందులో ఏ భాగమైనా ఎప్పుడు జాగ్రత్తగా, వివరంగా చదవదలచినా చదవవచ్చు గదా! పూర్ణమయిన జ్ఞానము వున్నప్పుడు గూడ సామాన్యము, పరిమితము యైన జ్ఞానము మాత్రమే వున్నట్లు నడుచుకొనడమూ సాధ్యమే.'' అని చెప్పారు అమ్మ.

అమ్మ మొట్టమొదటిసారిగా సం॥ 1926లో నవరాత్రులప్పుడు భక్తుల కోరికననుసరించి శాస్త్రోక్తంగా కాళీపూజ చేసారు. అలాంటి పూజ మరలా చూడాలని వున్నదని భక్తులందరూ భోలానాథ్‌తో చెప్పుకొన్నారు. ఆయన వచ్చి అమ్మను మరలా పూజ చేయమని కోరితే ఆమె, ''ఇకముంచి ఫలానా చేయమని నన్ను ఎన్నడూ కోరవద్దు. ఇప్పుడు ఆ రీతిన ఏమీ చేయలేకున్నాను.'' అన్నారు. అంతటితో అందరూ అట్టి ఆలోచన మానుకొన్నారు. ఆ సం॥ము బజారులో అమ్మకానికి వచ్చిన కాళీమాత మట్టి విగ్రహాలన్నీ అమ్ముడు పోయి ఒక్కటి మాత్రమే మిగిలిపోయింది. అది అన్నిటిలా నల్లగా వుండక ముదురు నీలిరంగుగా వున్నది. పూజకు దానిని తీసుకురాగానే, అంతకు ముందే అమ్మకు సరిగ్గా అట్టి రంగుగల కాళీ రూపమే మనస్సులో మెదలినట్లు చెప్పిందని సేవకులన్నారు; అమ్మకూడ అలానే చెప్పారు. పురాణకథల ప్రకారం కాళికాదేవి రాజకుమార్తెగా జన్మించినప్పటికీ పరమ వైరాగ్యమూర్తియైన శివుణ్ణే వివాహమాడి కైలాసాన్ని గూడ రాజ వైభవంతో నింపివేసింది. ఆమె సంవత్సరానికి 3 రోజులు తన పుట్టిల్లయిన భూమిమీదకు వస్తుందని చెబుతారు. ఆ మూడు రోజులు బెంగాల్ రాష్ట్రమంతటా ఆమెను పూజిస్తారు. ఆమె యొక్క సౌమ్య రూపమే దుర్గ; తీవ్రరూపమే కాళి. ఎడమ వైపున్న పైచేతిలో ఖడ్గము, క్రింది చేతిలో కపాలము (పుర్రె), కుడివైపునున్న

పైచేతిలో అభయ ముద్ర, క్రింది చేతిలో వరద ముద్ర ధరించి, దుష్టులను సంహరించే ఆవేశంలో చూడక నేలపై శయనించివున్న శివునిపై కాలువేసి, ఆ పొరపాటుకు నాలుక కరుచుకుంటున్న రూపం లోనే కాళికాదేవిని పూజిస్తారు. సామాన్య జనులందరు సౌమ్యమైన దుర్గ రూపాన్ని పూజిస్తారు; తీవ్రసాధకులు అర్ధరాత్రి సమయంలో తీవ్రరూపిణియైన కాళిని కొలుస్తారు.

పూజా సమయానికి అమ్మను తీసుకువచ్చి విగ్రహం ఎదుట కూర్చోపెట్టారు. భావసమాధిలో వున్న ఆమె వెంటనే తమ ఎడమ చేతితో యోగ క్రియలు చేయనారంభిస్తూ అకస్మాత్తుగా లేచి నిలబడి భోలానాథ్‌తో, ''నా స్థానంలో నేనే కూర్చుంటాను, నీవు పూజ చేసుకోవమ్మ'' అని చెప్పి ఆ విగ్రహం ప్రక్కనే కూర్చున్నారు. భోలానాథ్ మంత్రాలు చదువుతూ పూవులతో అమ్మనే పూజించారు. ఆ దేశాచారాన్ననుసరించి జంతుబలి ఇవ్వడానికి అమ్మ అంగీకరించ లేదు. పూజ ముగింపున చేయవలసిన పూర్ణాహుతి గూడ జరిపించక అగ్నిని గూడ భద్రపరచారు. పూజ అయ్యాక సామాన్యంగా మట్టి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తారు. కాని భక్తులందరూ ఆ విగ్రహం జీవకళతో వున్నదని, కనుక దానిని నిమజ్జనం చేయడం బాధగా వున్నదనీ చెప్పగా అమ్మ దానిని మరొక గదిలో పెట్టించారు. నాటి రాత్రి పెద్ద గాలివాన వచ్చి పూజ గది తలుపు విరిగి అంతకు ముందు విగ్రహమున్న చోట పడింది. తరువాత పూజకు వచ్చిన ఇద్దరు భక్తులకు దివ్య స్వప్నం వచ్చిందని చెప్పి వారు గూడ పూజ ఏర్పాటు చేసుకున్నారు. వాళ్ళు మాత్రం చివర్లో బలి ఇవ్వడానికి మేకను గూడ తెచ్చుకున్నారు. కాని సమయానికి అమ్మ ప్రత్యామ్నాయంగా దాని మెడపై తమ చేయి

వుంచి దానిని విడిచి పెట్టించారు. అటు తర్వాత ఆ మేక ఎప్పుడూ అమ్మ వెంటనే తిరుగుతూ ఆమె కాళ్ళ వద్దనే పడుకొనసాగింది. జంతు బలి విషయమై అమ్మ ఆ భక్తుల దృష్టిని సంస్కరించారు.

తరువాత అమ్మ మీర్జాపూర్‌లో భాయీజీని విడిచిపెట్టి రాజస్థాన్‌కు బయలు దేరారు. అతడికి వీడ్కోలు చెబుతూ, ''నీవు తిరిగి వెళ్ళేటప్పుడు ఛూనార్ గ్రామ సమీపంలోని కొండవద్ద మందార పూలమాల కనిపిస్తుందేమో చూడు'' అన్నారు. కాని ఆ ప్రాంతంలో ఎక్కడా మందార చెట్లులేవు. అయినప్పటికీ అతనికొక చోట ఒక మందారమాల కన్పించింది. ఆ విషయం ఢాకాలోని భక్తులకు వ్రాస్తే అక్కడ ఆ రోజు కాళీ మాతకు పుష్పమాల వేయడం మర్చిపోయారని తెలిసింది. అలానే ఒక అమావాస్యనాడు అమ్మ రోజంతా తమ చేతులు మెలిబెట్టుకొంటున్నారు. ఆమె కన్నులవెంట నీరు కారుతున్నప్పటికీ ముఖంలో చిరునవ్వులు తాండవిస్తున్నవి. కొద్ది రోజుల తర్వాత భాయీజీ జాబు వ్రాశాడు – అమావాస్యనాడు రాత్రి కాళికా మందిరంలో ముగ్గురు దొంగలుపడి దేవి వంటిమీదవున్న ఆభరణాలు వలుచుకోవడంలో ఆ మట్టి విగ్రహానికి ఒక చేయి విరిగింది. విరిగిన విగ్రహం పూజించకూడదంటారు. ఆ విషయమై అమ్మ జాబు వ్రాయించగా కాశీలోని మహామహోపాధ్యాయ ఆనంద తర్కచూడా మణి అను మహాపండితుడు, ''నిమజ్జనం చేయవలసిన విగ్రహాన్ని పూజలో పెట్టించినది ఒక మహాత్మురాలు గనుక సామాన్యమైన ఆచారం పాటించక అమ్మ చెప్పినదే ప్రమాణంగా స్వీకరించండి'' అని జాబువ్రాయించాడు. అమ్మ ఆ విగ్రహాన్ని పూజలోనే వుంచమన్నారు. కాళిమాత దర్శనానికి కులమతభేదాలు లేక అందరూ రావచ్చని ఆమె నిశ్చయించారు గూడ. కాని తర్వాత కొంత కాలానికి విరిగిన చేయి ఆ

విగ్రహం నుండి విడివడి క్రింద పడిందని తెల్సగా, ''ఆ విరిగిన విగ్రహానికి ఇక పూజ చేయనవసరంలేదు'' అని కబురుచేసి ఆ విగ్రహంతోపాటు ఆలయం గూడా మూయించి వేశారు అమ్మ.

తరువాత కీర్తన, సత్సంగమూ జరగడానికి అమ్మకు ప్రత్యేకమైన ఆశ్రమమొకటుండాలని భక్తులు సూచించగా అమ్మ, ''ఈ ప్రపంచ మంతా ఆశ్రమమే. అందుకుగాను ఒక ప్రత్యేక స్థానమెందుకు? అయినా మీకు కావాలనిపిస్తే రామ్నాలో శిథిలమైన శివాలయంగల స్థలాన్ని సేకరించండి. అక్కడ పూర్వం ఎందరో సాధువులు తపస్సు చేసుకొన్నారు'' అన్నారు. ఒకరోజు షాబాగ్‌లో అమ్మ, ''నాకందరి పెదవులపై ఎందుకో రక్తమే కనిపిస్తోంది'' అన్నారు. ఆ సమయంలో ఢాకాలో తీవ్రమైన క్షయరోగంతో బాధపడుతున్న భాయిజీకి వ్యాధి తీవ్రమై నోటివెంట అధికంగా రక్తం పడిందని తర్వాత తెలిసింది. అంతటి కష్టసమయంలో అమ్మ తన దగ్గరలేనందుకు భాయిజీ ఎంతో బాధపడుతున్నాడు. ఒకనాటి రాత్రి అకస్మాత్తుగా అమ్మ అతని పడకపై కూర్చొని దర్శనమిచ్చి తమ చేయి అతని తలపై వుంచారు. వెంటనే అతని బాధ తగ్గి అతనికెంతో మనశ్శాంతి కలిగింది.

ఏప్రిల్ 1926లో అమ్మ అకస్మాత్తుగా షాబాగ్ విడిచి కొందరు భక్తులతో కలిసి హరిద్వార్‌లో జరుగుతున్న పూర్ణ కుంభమేళాకు వెళ్ళారు. అక్కడ గంగా స్నానం చేసి లక్ష్మణ ఝూలా, హృషికేశ్, ఆగ్రా, మథుర, బృందావనము సందర్శించారు. తరువాత మొదటిసారిగా అమ్మ జన్మదినం ఏప్రిల్ 30, 1926న షాబాగ్‌లో భక్తులు మహావైభవంగా జరుపుకున్నారు. తరువాత అమ్మ తీవ్రమైన జబ్బుతో వున్న భాయిజీని చూచిరావడానికి భోలానాథ్‌తో కలిసి

వెళ్ళారు. అప్పటికి వైద్యులు భాయీజీని మంచంమీద నుంచి లేచి తిరుగగూడదని శాసించారు. అతడు అమ్మతో తనకు హాయిగా కొలను లో స్నానం చేయాలని వున్నదని చెప్పాడు. ఆమె, ''కొలను దగ్గరలోనే వున్నది కదా, వెళ్ళిస్నానం చేసిరా!'' అన్నారు. అతడు వెంటనే లేచి వెళ్ళి సుమారు 70 గజాల దూరంలో వున్న కొలనులో స్నానంచేసి వచ్చాడు. నాటి నుండి అతని ఆరోగ్యం రోజు రోజుకూ బాగై, రెండు మూడు నెలలలో లేచి తిరుగసాగాడు. అమ్మ అతనిని చూడడానికి వెళ్ళినప్పటినుండీ ఎందరెందరో భక్తులు అమ్మను తమ ఇండ్లకు ఆహ్వానించసాగారు. అమ్మ అలా అందరినీ చూచి రావడంవలన ఆమె త్వరలో మరలా యాత్రలకు వెళ్ళనున్నారని భక్తులూహించారు. ఆ ప్రకారమే ఆమె, భోలానాథ్ కలిసి నారాయణగంజ్, రాజ్‌షాహి, కలకత్తా, దేవగర్, వింధ్యాచల్ వెళ్ళారు. అక్కడ అమ్మ కొద్ది మందితో కలిసి కొండలు, గుట్టలు, మధ్య నుండి కాలిబాటన అడవిలో నడుస్తున్నారు. కొంచెం ముందువెళ్ళిన అమ్మ అకస్మాత్తుగా ఒకచోట ఆగి, వెనుకవారిని, అక్కడనే నిలిచి పొమ్మని ఆదేశించారు. భోలానాథ్ కంగారుగా పరుగున ముందుకు వెళ్ళి చూచేసరికే అమ్మ పాదాలవద్ద పడగ విప్పిన నాగు నిలబడివున్నది. అమ్మ కాలు దానిమీద పడింది. కాని అది కాటువేసినదో లేదో చెప్పకుండా ప్రక్కకు తప్పుకుని ముందుకు సాగిపోయారు. ఆమె వెంటనున్న బృందంలో ఒక పిల్లవాడు, ''అమ్మా! ఈ వయస్సులో నా సోదరునికి సర్ప గండమున్నదని జ్యోతిష్కులు వ్రాశారు. ఆ పాముకాటును మీపైకి తీసుకొని మా అన్నను రక్షించారు గదూ?'' అన్నాడు. అమ్మ ఏమీ మాట్లాడకుండా తిరిగి కుటీరం చేరుకున్నారు. అపుడు చూస్తే ఆమె ఎడమ పాదం మీద పాము కాటేసిన గుర్తులు స్పష్టంగా వున్నాయి.

తరువాత అమ్మ ఢాకా వచ్చి కొద్దిరోజులుండి విద్యాకూటము,

అక్కడ నుండి ఖేయోరా వెళ్ళారు. అక్కడ అమ్మ జన్మించిన కుటీరంలో ఒక ముస్లింల కుటుంబమున్నది. అమ్మ ఆ కుటీరమంతా తిరిగి చూచి, తాము జన్మించిన చోట కొద్దిసేపు నిశ్చలంగా నిల్చొని, చివరికి ఆ ఇంటివారితో, ''మీరీగది ప్రార్థనకు మాత్రమే వినియోగించుకొనడం మంచిది'' అని చెప్పారు.

అమ్మ కలకత్తా వెళ్ళినపుడు దేశబంధు చిత్తరంజన్‌దాస్ గారి కుమార్తె అపర్ణాదేవి అమ్మను దర్శించి, ఒకనాడు తనకు స్వప్నంలో తెల్లని వస్త్రాలు ధరించిన స్త్రీ కన్పించి, త్వరలో ఆమెకు పెద్ద ఆపదరానున్నదని హెచ్చరించిందని చెప్పింది. ఆ చెప్పినది అమ్మేనని ఆమె భావం. తరువాత కొద్ది రోజులకు ఎవరో భక్తులు చిత్తరంజన్‌దాస్ మరియు అతని భార్య వాసంతీదేవి కలసి తీయించు కొన్న చిత్రపటం అమ్మకు చూపారు. అమ్మ నోటివెంట అప్రయత్నంగా, ''ఈమెకు శోకము, వైధవ్యము త్వరలో రానున్నాయి'' అన్నారు. కొద్ది కాలంలో అదే జరిగింది.

ఢాకాలోని రాణి ప్యారీబాను ఒకసారి అమ్మ దర్శనానికి వచ్చి ఆమె చేతి ప్రసాదం తినాలని వుందని చెప్పింది. అమ్మ స్వయంగా షడ్రశోపేతమైన భోజనం చేసి ఆమెకు పెట్టారు. భక్తితో ఆమె ఆలయంలోని కాళీమాతకు తన కంఠహారం సమర్పించుకొన్నది. తర్వాత ఆ కుటుంబాన్ని తీసుకొని అమ్మ ఆ తోటలోని దర్గాలదగ్గరకు వెళ్ళి ధ్యానంలో కూర్చున్నారు. కొద్దిసేపటికి పారవశ్యంలో ఆమెనోటి వెంట ఏదో వింతైన భాష, స్తోత్రాల వంటి వాక్కులు వెలువడ్డాయి. అవి వినిన యువరాణి, అవి ఖురాన్‌లోని వాక్యాలుగా గుర్తించి ఎంతో ఆశ్చర్యపోయింది.

కొత్తగా అమ్మను దర్శించిన భక్తులు ఆమెను వారివారి ఊళ్ళకు

ఆహ్వానించసాగారు. అమ్మ కామక్షయ అనే ఊరికి వెళుతూ దారిలో గౌహతి, బైషరి, ఫిరోజ్‌పూర్ వెళ్ళారు. ప్రతిచోట జనం తండోప తండాలుగా పుష్పమాలలు, ధూపదీపాలతో అమ్మకు దారి పొడుగునా స్వాగతం చెప్పారు. ఫిరోజ్‌పూర్‌లో అయితే లేవలేని ఒక వృద్ధురాలు తప్ప ఆ ఊరిలో అందరూ అమ్మను దర్శించారట. అప్పుడు అమ్మే ఆమె ఇంటికి వెళ్ళి దర్శనమిచ్చి వచ్చారు. ఒక్కొక్క గ్రామంలోని జనమంతా ఆమెను మేళతాళాలతో ప్రక్క గ్రామం వరకూ సాగనంపారు.

అమ్మ ఢాకా తిరిగివచ్చాక ఒకరోజు, ''సిద్ధేశ్వరి వద్ద వేదిక మధ్యలోని కుండం యొక్క పవిత్రతను భవిష్యత్తులో కాపాడుకోవడం మీ వల్లగాదు. జరుగవలసినది జరిగితీరవలసిందే గదా! దానిని మూసివేసి, దానిపై ఎవరూ కూర్చొనకుండా గుర్తుగా ఒక వేదిక నిర్మించండి'' అన్నారు. భక్తులందరూ హృదయపూర్వకంగా తమ శక్తి కొద్దీ విరాళాలు యిచ్చారు. అలా 1928లో నిర్మించిన ఆ చిన్నగదే మొదటి ఆశ్రమం. తరువాత అమ్మ గిరిడీ, వింధ్యాచల్, చునార్, మీర్జాపూర్, జైపూర్, భారత్‌పూర్ ప్రాంతాలలో భోలానాథ్‌తో కలసి పర్యటిస్తున్న కాలంలో ఢాకా రాణి గారి ఆస్తిపాస్తులన్నీ కోర్టు వారికి అప్ప చెప్పవలసి వచ్చింది. అందువలన భోలానాథ్ ప్రభృతులకు ఉద్యోగాలు పోయాయి. భక్తులందరూ షాబాగ్ ఖాళీ చేయ వలసివచ్చింది. అప్పుడు భక్తులందరూ కలసి ఢాకాలో ఒక ఇల్లు అద్దెకు తీసుకొని కాళీమాత విగ్రహాన్ని అక్కడికి తరలించారు. అమ్మ జన్మదినోత్సవం సిద్ధేశ్వరి వద్ద గదిలో ఏర్పాటు చేయాలని భక్తు లనుకొంటుంటే అమ్మ అద్దెకు తీసుకున్న ఆ ఇంటికి వచ్చారు. ఢాకారాణిగారి జమీందారీలో ఉద్యోగాలు కోల్పోయిన ఉద్యోగులతో ఆ విషయమై ఏమీ బాధపడవద్దని, అంతా మంచికే జరిగిందని అమ్మ

అన్నారు. ఆ మాట నిజమన్న సంగతి కొంతకాలానికే బుజువయింది. ఆ రోజులలోనే భాయిజీ అమ్మను దర్శించి, తాను కొద్ది మాసాల కంటె జీవించబోడని వైద్యులు నిర్ణయించారని చెప్పాడు. అమ్మ, ''కొద్ది సం॥ల వరకూ అలాటిదేమీ జరగబోదు. నీవు ఢాకాకు తిరిగి వచ్చి నీ ఉద్యోగంలో చేరు. తర్వాత చూస్తాము'' అన్నారు. అతడు ఉద్యోగంలో చేరిన రోజు అమ్మ, భోలానాథ్ అతనిని ఆఫీసులో దిగబెట్టివచ్చారు.

మే, 1928లో అమ్మ జన్మదినోత్సవం ఆరంభమైంది. తమను కోరిన ప్రతి ఒక్కరికీ సాధన గురించి అమ్మ వివరంగా బోధించారు. అఖండ జపము, కీర్తన, మరియు పూజలతో ఇంగ్లీషు కేలండరు ప్రకారం అమ్మ పుట్టిన తేది నుండి అమ్మ జన్మ తిథివరకూ ఉత్సవాలు జరిగాయి. ఉత్సవాలలో అతి ముఖ్యమైన అంశం - చివరిరోజున తెల్లవారుఝామున 3 గం॥లకు భక్తులు అమ్మకు పాదపూజ చేయడంతో కార్యక్రమం ముగియవలసి వున్నది. అప్పుడు అమ్మ భావ సమాధిలో స్పృహలేకుండా నేలపై పడివున్నారు. భక్తులక్కడ కూర్చొని కొందరు జపము, కొందరు కీర్తన చేస్తున్నారు. స్వయంగా భోలానాథ్ ఆమెకు పూజ చేశారు.

జన్మదినోత్సవం అయ్యాక అమ్మ, భోలానాథ్‌తో కలిసి భక్తుల ఆహ్వానంపై బారిసాల్, విక్రంపూర్, మున్షీగంజ్ వెళ్ళి సెప్టెంబర్ 1928లో వారణాసి చేరారు. అమ్మ భావసమాధిలో లేనపుడు ప్రతి సాయంత్రమూ ఆరు బయట కూర్చుని భక్తుల ప్రశ్నలకు సమాధానా లిస్తుండేవారు. మహామహోపాధ్యాయ గోపీనాథ్ కవిరాజ్ గారు మొదటి సారిగా అమ్మను దర్శించి ఆమె సదోష్ఠి విని, ''అద్భుతం, నేనింత వరకూ ఇంతటి మహత్తరమైన విషయాలు విననైనా లేదు'' అన్నారు.

గొప్ప గొప్ప పండితులు ఆజన్మాంతమూ ఆమెకు శిష్యులయ్యారు.

నిత్యమూ తెల్లవారుఝాము నుండి జనం తండోపతండాలుగా లెక్కలేనన్ని పుష్పమాలలు, పండ్లు, మిఠాయిలూ తీసుకుని అమ్మ దర్శనానికి వస్తూనే వుండేవారు. ఆమెకు స్నానపానాలు చేయడానికి గాని, గుడ్డలు మార్చుకోవడానికి గాని అవకాశమే వుండేది గాదు. రాత్రింబవళ్ళు స్వప్నంలోలాగా గడిచి పోతున్నాయి. ఆ జనవాహినిని నిగ్రహించాలని భోలానాథ్ ఎంతగానో ప్రయత్నించాడు. అంతంత సమయం భక్తులకీయ వద్దని అమ్మను హెచ్చరించసాగాడు. అమ్మ, ''ఈ విషయం నేను ముందుగానే హెచ్చరించాను. అపుడు మీరు నా మాట వినలేదు. అపుడు వూరుకొని ఇప్పుడీ మహా ప్రవాహాన్ని వెనుకకు మరలించాలంటే సాధ్యమవదు'' అన్నారు. ఒకనాటి రాత్రి అమ్మ అకస్మాత్తుగా, ''మృత్యువాసన్నమౌతోంది!'' అన్నారు. అపుడక్కడున్న ఒక భక్తురాలు, బహు సంతానవతి, ''అదేదో నా ఒక్కదానికే రానివ్వండమ్మా!'' అన్నారు. అమ్మ ఆమెకేసి చూచి నవ్వి వూరుకున్నారు. ఆ వేడుకల సంతోషంలో ఆ మాట అందరూ మరచి పోయారు. తరువాత అమ్మ కాశీ విడిచి వెళ్ళే రోజున అమ్మమ్మ గారితో, ''ఈ రోజు పౌర్ణమి అయినప్పటికీ నా కెందుకో బంగాళ దుంపలు వేసి వండిన అన్నం తినాలని వున్నది. కాని మీరందరూ మాత్రం నియమంగా ఉపవాసం పాటించి తీరాలి. మిగిలిన అన్ని రోజులూ మీరందరూ భోజనాలు చేస్తుంటే నేను తినను గనుక, ఈరోజు గూడా నేను చేసినట్లు మీరంతా చేయకూడదు'' అన్నారు. నిజానికి ఒక భక్తురాలు అమ్మకట్టి ఆహారం స్వయంగా తినిపించాలను కున్నదట అయినా సామాన్యంగా అమ్మ అమావాస్య, పూర్ణిమ రోజులలో ఏమీ తినరు గనుక ఆ మాట ఆమెతో ఎవరూ చెప్పలేదు.

ఆ తరువాత రోజు బయలుదేరి అమ్మ కలకత్తా చేరగానే వెనుక ఆ

రోజున రామన్న మృత్యువేళ తనకే రావాలని కోరిన ఇల్లాలు మరణించిందన్న వార్త అందింది. ఆమెకు అమ్మయందు ఎనలేని భక్తి. అమ్మను విడిచి వుండలేక పోయేది. పగలంతా వారణాసిలో జనం వస్తూండటంతో ఆమెకు అమ్మ దగ్గరుండే అవకాశమే లభించేదిగాదు. కనుక ఆమె రాత్రి ఇంటి పనులన్నీ చూచుకొన్నాక తనకు తోడుగా వచ్చేవారెవరూ దొరకనందువలన ఆమె మగవాని వేషం వేసుకుని, తలపాగా చుట్టుకొని, చేత కర్రపట్టుకొని అర్థరాత్రి సమయంలో ఒంటరిగా వీధి వెంటనడిచి అమ్మ సన్నిధికి వచ్చేది. ఆమె ధైర్యము, భక్తి చూచి అందరూ ఆశ్చర్యపోతుండేవారు.

ఒక భక్తుని ఆహ్వానం మన్నించి అమ్మ కోమిల్లా, కలకత్తా వెళ్ళారు. అక్కడొక భక్తుడు అమ్మను దర్శించి, ''అమ్మా! నేను స్వయంగా నా చేత్తో పండ్లు, మిఠాయి మీకు తినిపించాలని వున్నది. కాని నేనెన్నడూ ఎట్టి ఆహార నియమమూ పాటించనివాణ్ణి'' అన్నాడు. అమ్మ, ''ఏమీ ఫరవాలేదు, అలానే చేయి'' అని అతడు తినిపించిన పండ్లు తిని, ''నేటి నుండీ నీవేమి తిన్నా ముందుగా భగవంతునికి నివేదించి తిను'' అన్నారు. అతడలా చేస్తుంటే క్రమంగా అతని వ్యసనాలన్నీ తొలిగిపోయాయి. అలానే ఒకరోజు నిరంజన్‌రాయ్ అనే భక్తుని భార్య జబ్బుతో మృత్యుముఖంలో వున్నది. వారి బంధువొకరు అమ్మ కూర్చుండే గదిలో కూర్చుని రోగికి ప్రమాదం తప్పాలన్న సంకల్పంతో ధ్యానం చేస్తున్నాడు. ఆ సమయంలో అమ్మ ఎక్కడికో వెళ్ళారు. అతడు ధ్యానం ముగించి కళ్ళు తెరవగానే అమ్మ మెరిసే పోతున్న కళ్ళతో అతని ముఖంలోకి చూస్తున్నట్లు దర్శనమైంది. అందువలన అమ్మ తన ప్రార్థన మన్నించిందని, రోగి తప్పక జీవిస్తుందనీ అతడు దృఢంగా విశ్వసించాడు. కాని కొద్ది రోజులలో ఆ

రోగి మరణించడంతో అతడెంతో నిరాశ చెందాడు. ఒకరోజు ఆ విషయమాలోచిస్తున్న అతనికేసి చూచి అమ్మ, ''ఆమెకెట్టి బాధా లేకుండా చేయమని నీవు కోరావుగదా, కేవలం మృత్యువు తప్పడం మాత్రమే బాధలు లేకపోవడం కాదుగదా, ఆమెకెట్టి బాధా లేకుండేలా చేయడమంటే ఇదే'' అన్నారు.

అమ్మ ఢాకాకు తిరిగి వచ్చాక తన కోసం భక్తులద్దెకు తీసుకొన్న 'ఉత్తమ్ కుటీర్' అనే ఇంటి నుండి ఒకరోజు భోలానాథ్‌తో కలిసి సిద్ధేశ్వరికి వెళ్ళారు. తమకింక తిరిగి ఆ ఇంటికి వెళ్ళాలనిపించడం లేదని అమ్మ చెప్పారు. ఆ వార్త తెలియగానే భక్తులందరూ ఒక్కొక్కరే సామాన్లు తీసుకుని సిద్ధేశ్వరికి చేరుకున్నారు. మరొక్కసారి కాళీమాత విగ్రహాన్ని గూడ తరలించవలసి వచ్చింది. కాళికాలయంలోని ఒక గదిలో అమ్మ ఆదేశించిన ప్రకారం భోలానాథ్ సాధనలో నిమగ్నమయ్యాడు. అమ్మ ఒక్కరే ఒక గదిలో వుండనారంభించారు. రోజూ కొద్దిమంది బ్రహ్మచారులు వచ్చి అక్కడ అగ్నిహోత్రానికి ఆహుతులు వేస్తుండేవారు. తమ దర్శనానికి వచ్చిన భక్తులు పది ని॥ల కంటే ఎక్కువసేపు వుండగూడదని అమ్మ ఆదేశించారు. ఒకరోజు భోలానాథ్ ఎక్కడికి వెళుతున్నారో చెప్పకుండా అతనికి రైల్వేస్టేషన్లో వీడ్కోలు చెప్పిరమ్మని భక్తులను కూడా పంపారు. అతడిని సాగనంపి వచ్చిన భక్తులు అమ్మను దర్శించి క్రొత్త నియమాన్ని అనుసరించి పది ని॥లలో అందరూ సెలవు తీసుకున్నారు. కొద్దిరోజులలో అమ్మను గూడ తారాపీఠ్‌కు రమ్మని భోలానాథ్ వ్రాశాడు. అమ్మ ఒకటి రెండు పాత దుప్పట్లు మాత్రమే మూటకట్టుకొని అకస్మాత్తుగా బయలుదేరారు. ఆమె రైల్లో కూర్చున్నాక తమ బంగారు గాజులు రెండూ భక్తులకిచ్చి, వాటితో ఉంగరాలు చేయించి బ్రహ్మచారులకివ్వమని

చెప్పారు. తారాపీఠము కేవలం సర్వసంగపరిత్యాగులకు మాత్రమే నిలయమైన ప్రఖ్యాత శ్మశానం. అమ్మకు తోడుగా ఎవరైనా వుండి భోజనం గూడ పసిపిల్లకువలె తినిపించవలసిన పరిస్థితిలో, ఆమె భావ సమాధిలో మైమరచి వున్నప్పుడు ప్రతి చిన్న నిత్యకృత్యము ఎవరో ఒకరు జ్ఞాపకం చేయవలసిన పరిస్థితిలో, ఆమె ఒక్కరే అక్కడ నివసించబోతున్నారని అందరూ బాధపడ్డారు. కానీ అమ్మ కట్టి తలంపు ('ఖేయాల్') కలిగాక దానికి తిరుగేమున్నది! కాని అమ్మ అక్కడకు చేరేసరికే కలకత్తానుండి కొందరు భక్తులు తారాపీఠ్ చేరుకున్నారు. వెనుకొక రోజు భోలానాథ్‌కు ధ్యానంలో శిరస్సులేని కాళీమాత విగ్రహం దర్శనమైంది. ఆ మాట చెప్పగానే అమ్మ అతనిని తారాపీఠ్‌కు పంపారు. కాని ఆమె ఆ క్షేత్రమే అతనికి ఎందుకు నిర్దేశించారో మొదట ఎవరికీ అర్థంకాలేదు. భోలానాథ్ అక్కడున్న తారాదేవి (కాళిక రూపాలలో ఒకటి) ఆలయం ముంగిట వరండాలో కూర్చొని సాధన చేసుకోనారంభించాడు. కొద్ది రోజులలో ఆలయ పూజారులకు అతనిపై సద్భావం కలిగి తమలో ఒకడుగా భావించ సాగారు. ఒకనాటి రాత్రి పూజారులు తారాదేవికి పవళింపు సేవ చేయడానికి ఏకాంతమైన ఆలయానికి వచ్చారు. వారు తారాదేవి విగ్రహానికి వున్న అలంకారమంతా తొలగించినపుడు చూచి భోలానాథ్ నివ్వెరపోయాడు. అచటి విగ్రహానికి సహజంగా శిరస్సులేదు! తెల్లవారు ఝామున సుప్రభాతమయ్యాక భక్తుల దర్శనానికి ఆలయద్వారాలు తెరచేముందు మిగిలిన అలంకారాలతోపాటు మూలవిగ్రహానికి పూజారులు శిరస్సు గూడ తగిలిస్తారు. అప్పుడు భోలానాథ్‌కు అర్థమైంది. తనకు ధ్యానంలో శిరస్సు లేకుండా దర్శనమిచ్చిన కాళీమాత ఆ క్షేత్రంలోని మూలదైవమని. కాని ఎన్నడూ ఆ క్షేత్రం దర్శించని ఆనందమాయి

మాతకు ఎవరికీ తెలియని ఆ రహస్యమెలా తెలుసునన్నది ఆశ్చర్యం. అది అర్థమైనప్పటి నుండి భోలానాథ్ మరింత శ్రద్ధగా సాధన చేసు కోనారంభించాడు. ఆయనకు చలిబాధ తెలిసేదిగాదు. నిరంతరము ధూమపానం చేసే అలవాటుగల ఆయనకు ఆ వ్యసనం గుర్తుకైనా వచ్చేదిగాదు. ఆయన నిరంతరం ధ్యానంలో నిమగ్నుడై భోజనంగూడా అతి స్వల్పంగా చేయనారంభించాడు. ఆ క్షేత్రంలో కొద్దిమంది పూజారుల కుటుంబాలు మాత్రమే నివసిస్తుండేవారు. అమ్మ పగలంతా ఆ స్మశానంలో సంచరిస్తూ రాత్రి సమయాలలో విశ్రమిస్తుండేవారు. ఆ పూజారుల భార్యలు అమ్మ సంరక్షణ చూసుకో సాగారు. భక్తులనవసరంగా భయపడ్డారేగానీ అమ్మకు ఆదరణ ఎక్కడ లభించదు?

కొంతకాలమయ్యాక భోలానాథ్, అమ్మ పూరీ వెళ్ళి అక్కడి నుండి విద్యాకూటం చేరారు. అప్పుడు భోలానాథ్‌కు ఉద్యోగం లేదు గనుక ఆ ఋషి దంపతులు విధిగా ఢాకాకు తిరిగి రావలసిన అవసరంలేదు. అయినప్పటికీ మే 1929లో జరుగనున్న అమ్మ జన్మదినోత్సవం, ఢాకాలో జరుపుకోడానికి అమ్మ అనుమతి సంపాదించి అచటికి సమీపంలో నున్న రామ్నాలో ఒక విశాలమైన స్థలం సేకరించి, అందులో మట్టితో అమ్మకొక కుటీరం నిర్మించారు. ఆ సందర్భంగా చాలా రోజులు నిరంతరం కీర్తనలు చేసి చివరకు సంతర్పణకన్నీ సిద్ధం చేశారు. భావ సమాధిలో బాహ్యస్మృతి లేకుండా పడివున్న అమ్మను ఎలాగో మేల్కొలిపి, స్నానం చేయించి, కొత్త వస్త్రాలు ధరింపజేసారు. ఆమె తమ తండ్రిగారి దగ్గర కొంచెము, తల్లిగారి దగ్గర కొంచెము భోజనం పెట్టించుకొని తిన్నారు. తరువాత అందరిచేత మరలా కొంతసేపు కీర్తన చేయించారు. తరువాత ఆమె

[illegible] ఆశ్రమమంతా తిరిగి దాని ప్రాకారాన్ని అక్కడక్కడా చిత్రమైన రీతిన తాకుతున్నారు. వెనుక ఆమె షాబాగ్‌లో అలానే చేయడము, ఆ తరువాత కొద్ది కాలానికే అచటి ఆశ్రమం శాశ్వతంగా విడిచి వచ్చేయడమూ జ్ఞాపకం వచ్చిన భక్తులు అది చూచి ఎంతో భయపడ్డారు. అయినప్పటికీ ఆమె అంత గంభీరంగా వున్నప్పుడు మాట్లాడించడానికి ధైర్యమెవ్వరికీ చాలేదికాదు. ఆస్థితిలో ఆమె ఎవరినీ గుర్తుపట్టినట్లుగా గూడ వుండేవారు గాదు. అందరికీ సమ్మతముగాని నిర్ణయమేదో ఆమె తీసుకోబోతున్నారని మాత్రం అందరికీ స్పష్టమైంది. తరువాత కొంతసేపు ఆమె నోటి వెంట ఏవో మంత్రాలు ధారగా వినవచ్చాయి. ఇంతలో ఆమె ఆకస్మికంగా మంత్రాలు నిలుపుజేసి, ''మీరందరూ నన్ను ఢాకా విడిచి వెళ్ళిపోనివ్వవలసిందే; నేనీరోజు వెళ్ళి తీరవలసిందే!'' అని చెప్పి, తమ సన్నిహిత సేవకులతో, ''నాకెట్టి అడ్డమూ చెప్పవద్దు; చెబితే నేనీ శరీరం ఇక్కడ త్యజించి యైనా నేను వెళ్ళిపోతాను'' అన్నారు. ఆ సమయంలో భోలానాథ్ ఒక భక్తుని ఇంటికి వెళ్ళివున్నారు. కనుక ఆమె, ''భోలానాథ్ రాగానే ఆయనకన్నీ వివరంగా చెప్పి నాకు గల్గిన ప్రేరణకెట్టి ఆటంకమూ కల్పించవద్దని చెప్పండి'' అన్నారు. ''మరి మీకు తోడుగా ఎవరొస్తారు!'' అన్నాడొక భక్తుడు. ''నావరకూ నాకు ఎవరి తోడూ అవసరం లేదు. కానీ నా కెవరైనా తోడుండడం ధర్మమని మీకు తోస్తే మా నాన్నగారిని తోడుగా పంపించండి!'' అన్నారు. వెంటనే తాతగారు కొద్ది వస్తువులు మూటగట్టుకుని సిద్ధమయ్యారు. అమ్మ మాత్రమేమీ తీసుకోలేదు. కొద్దిసేపు భక్తులంతా మౌనంగా ఆమె చుట్టూ ఆరు బయట కూర్చున్నారు. కొద్దిసేపట్లో భోలానాథ్ వచ్చారు. అమ్మ తాము వెళ్ళడానికి ఆయన అనుమతికోరి, ''మీరనుమతించకుంటే

ఈ శరీరాన్ని మీ పాదాలవద్ద వదిలేస్తాను'' అన్నారు. ఆయనేమీ మాట్లాడలేక, ''నీవొక్కర్తెవే ప్రయాణం చేస్తే లోకం నిందిస్తుంది'' అన్నారు. అమ్మ, ''నిందకు తావిచ్చేరీతిన నేనేమీ చేయను, మా నాన్న నాకు తోడుగా వుంటారు'' అన్నారు. భక్తులు కారు పిలిపించబోతే అమ్మ అంగీకరించక కొద్దిమందితో కలిసి కాలినడకన అర్ధరాత్రి నడచి రైల్వేస్టేషన్ చేరుకున్నారు. అక్కడ చేరిన భక్తులందరూ తలా కొంత డబ్బు వేసుకొని టికెట్ తేబోతున్నప్పుడు అమ్మ తాము మైమెన్సింగ్ వెడుతున్నామని చెప్పారు. సరిగ్గా రైలు బయలుదేరే వేళకు భాయీజీ గూడ రైలెక్కాడు. అమ్మ తనతో ఒక జత గుడ్డలు గూడ తన వెంట తీసుకురాలేదని ఒక భక్తుడు ఆమెకు గుడ్డలు తెచ్చే మిషమీద మర్నాడు మైమెన్సింగ్ వచ్చాడు గానీ అమ్మ అతనిని వెంటనే ఢాకాకు తిప్పి పంపివేశారు. తరువాత అమ్మ ఒక గమ్యమంటూ లేకుండా బంగాళాఖాతంలోని ఒక ద్వీపమైన అధినాధ పర్వతము, మరొక ద్వీపమైన చంద్రనాథ్, కలకత్తా, హరిద్వార్, డెహరాడూన్ వెళ్ళి అక్కడ నుండి సహస్రధార, అయోధ్య వెళ్ళారు. అక్కడ కొద్ది రోజులున్నాక అమ్మ ఒకరోజు గంగా తీరంలో నడుస్తూ అకస్మాత్తుగా రైలుస్టేషన్‌కు బయలు దేరారు. ఆమె ప్రక్కనున్న ఒక పిల్లవాడు పరుగున వెళ్ళి గుడ్డల మూట తీసుకొచ్చాడు. అక్కడ నుండి అమ్మ కాశీ, మొగల్సరాయి, వింధ్యాచలము, నవద్వీపము వెళ్ళారు. నవద్వీపం చేరేముందు అమ్మ ''నేనెవరికీ తెలియని చోటుకు వెళ్ళాలి'' అన్నారు. అంతేగాక, అక్కడికి వెళ్ళడంలోని ఆంతర్యమింకొకటి తర్వాత తెలిసింది. అంతకు ముందు ఆమె నవద్వీపం వచ్చినపుడు నిరంతరమూ  మౌనంలో వుంటున్న ఒక సాధువును చూచారు. ఈసారి గూడ అమ్మ తిన్నగా అతని ఆశ్రమానికే వెళ్ళారు. ఆ సాధువు శిలా ప్రతిమవలె రెప్పైనా

[illegible] కూర్చొని వుండేవాడు. [illegible]
భోలానాథ్ ప్రభృతులు ఆ సాధువును చూచి ఆయన సజీవుడైన మానవుడని నమ్మలేక పోయారు; మట్టితో చేసిన విగ్రహమేమోననుకున్నారు. కానీ అమ్మ రెండవ రోజుకల్లా అతని ఆంతర్యం పట్టేశారు. అతడు చాటుగా ఎవరికీ తెలియకుండా రాత్రి సమయాలలో లేచి తిరగడము, ఏదో ఒకటి తినడము చేస్తున్నాడు. అమ్మతో ఆ విషయం అతడే ఒప్పుకున్నాడు. నిజానికి ప్రజలనలా మోసం చేయడం తనకు ఇష్టం లేదని, కాని తనకు సేవచేస్తున్న ఒక వృద్ధురాలు బలవంతంగా తన చేత అలా చేయిస్తున్నదనీ వాపోయాడు. అమ్మ కొద్దిసేపతనితో మాట్లాడి బీహార్ రాష్ట్రంలోని 'అక్నా' అను ఒక మారుమూల గ్రామానికి వెళ్ళిపోయారు. కొద్దిరోజులలోనే నవ ద్వీపమంతా నివ్వెరబోయేలాగున ఆ సాధువు ఒకరోజు తెల్లవారేసరికి ఆ ప్రదేశం విడిచి ఎక్కడికో వెళ్ళిపోయాడు. కొద్ది రోజుల్లో అమ్మ కలకత్తా చేరారు. అప్పట్లో అమ్మ చాలా స్వల్పంగా తింటూండడం వలన ఆమెకేమి తినిపించడానికీ తనకవకాశం కల్గలేదని ఒక వృద్ధురాలు లోలోపల బాధపడుతోంది. అమ్మ ఆమెతో, ''స్వయంగా నీచేతులతో నాకు తినిపించాలని వున్నది గదా? నీకు తోచినదల్లా పెట్టు తింటాను'' అన్నారు. ఆమె సంతోషంతో తాను పూజ కోసం తెచ్చుకొన్న పెరుగు, మిఠాయి, పండ్లు అమ్మకు తినిపించింది. అదే అమ్మకు ఆమె చేసుకొన్న చివరిసేవ; కొద్దిరోజుల్లో ఆ వృద్ధురాలు గతించింది.

జూన్ 15, 1929న రామ్నాలో అమ్మకు ఆశ్రమం నిర్మించడానికి తన యావచ్ఛక్తినీ ధారబోసిన నిరంజన్‌రాయ్ అను భక్తుడు మరణించాడు. అతడు తన భార్య మరణించిన శోకానికి ఆహుతయిపోయాడు. అమ్మ రామ్నా తిరిగి వచ్చినప్పటికీ అతడు [illegible]

నిర్మించిన ఆశ్రమంలో 24 గంటలు మౌనంగా గడిపారు. భోలానాథ్ సిద్ధేశ్వరిలోనే నివసించసాగాడు. అమ్మ ఆరోగ్యమేమీ బాగలేదు. అంతకు ముందు ఎన్నోసార్లు ఆమెకెంత జబ్బు చేసినప్పటికీ ఆమె అస్వస్థతగా కన్పించేవారుగాదు. కానీ ఈసారి ఆమె ఎంతగానో శుష్కించి పోయారు. అయినప్పటికీ ఎవరూ తమకు తోడుగా వుండడానికిగాని, సేవ చేయడానికిగాని ఆమె సుతరాము అంగీకరించలేదు. ఆమె వంట గూడా చేయాలని ఎంతగానో ప్రయత్నించారుగానీ అది సాధ్యపడలేదు. మానవులు దేనినీ బుద్ధి పూర్వకంగా విడిచిపెట్టనక్కరలేదని, ఏదో ఒక నాటికి వాటికవే విలిచిపోతాయనీ ఆమె అంటూండేవారు. శక్తివంచన లేకుండా సాధన చేస్తూండడమొకటే చాలునని అమ్మ అనేవారు. అదే గాబోలు అమ్మ వంట చేసే విషయంలో గూడా జరిగింది. ఆ రోజులలో అందరితో ఎప్పుడూ సరదాగా వుండే అమ్మతో భోలానాథ్ గూడా ఎంతో ముభావంగా వుంటున్నారు. వారిని దర్శించవచ్చిన భక్తులకేమీ తోచడంలేదు. ఇందుకు కారణమేమో తరువాత తెలిసింది. వారి వివాహమైన దగ్గరనుండీ అమ్మ అనుసరించే పద్ధతులకెన్నడూ భోలానాథ్ ఎట్టి ఆటంకమూ కల్పించలేదు. కాని రెండు నెలలుగా అమ్మకు అతడు స్వేచ్ఛనివ్వరాదని, గృహిణిగా ఆమె ధర్మం నిర్వర్తించేలా చూడాలని సాటివారు పెట్టిన వత్తిడినునుసరించి ఆయన ఆమెను నిర్బంధింపజూచాడు. అలా చేయడానికి అమ్మకెట్టి అభ్యంతరమూ లేదుగాని, ఎంతగా ప్రయత్నించినా ఆమెకు సాధ్యపడ లేదు. కొద్దికాలానికి భోలానాథ్ తీవ్రంగా జబ్బుపడ్డాడు. అమ్మకు గూడ జబ్బుచేసింది. కాని అలా అని భోలానాథ్‌ను తప్పుపట్టడానికేమీ లేదు. ''ఆయన మనస్సులో విషయవాసనల ఛాయలే లేవు. ఆయనకు

[illegible] 'నేనే' అంతా. ఆయన ఆత్మ [illegible] అంటులేదు'' అని అమ్మే చెప్పారు. ఆయనకు జబ్బు చేసినప్పుడు అహర్నిశలూ అమ్మయే సేవచేశారు. భక్తులు వైద్యం చేయించారు. ఆగస్టు నెలలో అమ్మకు జ్వరం రాసాగింది. ఒక క్షణంలో 100 డిగ్రీలు, మరికొద్ది నిమిషాలకు 106 డిగ్రీలు టెంపరేచర్ వస్తూండేది. అయినప్పటికీ అమ్మ ఎంతో ఆరోగ్యవంతురాలిలా మొకటి ఉత్సాహంతో తిరుగసాగారు. కొద్దిరోజులకు మాత్రం ఆమె శరీరమంతా పక్షవాతం వచ్చినట్లు చచ్చుబడింది. అయినా ఆమె మాత్రం నవ్వుతూ ఎంతో సంతోషంగా కబుర్లు చెబుతుండేవారు. ఒకరోజు ఎవరి సహాయమూ లేకనే ఒక చేయి పైకెత్తగలిగారు; మరునాడు కొద్దిగా నడచి కొద్ది రోజులలో లేచి తిరుగసాగారు. అయినా జ్వరం వస్తూనే వున్నది. ఆమె వంటికి నీరు పడుతున్న లక్షణాలు గూడ కనిపించాయి. నీటికి తోడు రక్తవిరేచనాలవుతున్నాయి. ఆమె అంతటి అనారోగ్యానికి అలవాటుపడితే ఇక స్వస్థురాలవ్వాలన్న సంకల్పమే ఆమెకు కల్గక పోవచ్చునన్న భయంతో ఒకరోజు భోలానాథ్ చికాకుగా, ''ఇంత జబ్బు చేస్తే సంతోషించేందుకేముంది; త్వరగా కోలుకో!'' అని కసిరారు. ఆ తర్వాత అమ్మ కొద్ది రోజులు నూతి ముడుచుకొని ఎవరితోనూ మాట్లాడలేదు. ఒక వంక ఆమె దర్శనానికి తండోపతండాలుగా జనం వస్తున్నారు. వారెవరైనా ఆమెతో జబ్బు నివారించుకోమని కోరితే ఆమె, ''నేను మీలో ఎవర్నీ ఎలా వెళ్ళిపొమ్మనలేనో అలాగే యీ జబ్బును గూడా పొమ్మనలేను. సమయమొచ్చినపుడు వారంతట వారే వెళ్ళిపోతారు'' అనేవారు. అక్టోబర్‌లో ఆమె చాలా రోజులు మరలా మంచం పట్టి క్రమంగా కోలుకున్నారు. సం॥ 1930 ఆరంభంలో ఆమె భోలానాథ్‌ను సిద్ధేశ్వరి వెళ్ళి సాధన మరలా కొనసాగించుకొమ్మని [illegible]

చెప్పారు. ఆయన తరుచుగా అక్కడికి వెళ్ళి ప్రగాఢమైన ధ్యానంలో గంటలు గంటలు కూర్చునేవాడు. ఆ సం॥రం అమ్మ జన్మదినోత్సవం గడిచాక ఒకరోజు అమ్మ, ''నాకు ఇంటింటా ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి'' అన్నారు. కొద్ది రోజులలోనే (జూన్ 1930) మత కలహాలు చెలరేగి ఆ ప్రాంతమంతా విలయతాండవం చేశాయి. ప్రభుత్వం 'కర్ఫ్యూ' విధించింది.

ఆగష్టు 1930లో ఆ ఋషి దంపతులు ఇద్దరు భక్తులతో కలిసి దక్షిణ దేశయాత్ర చేశారు. అప్పుడు విశాఖపట్నంలో మూడు రోజులు, మద్రాసులో వారం రోజులూ గడిపి, చిదంబరము, శ్రీరంగము, కాంచీపురము, మధురై దర్శించారు. తరువాత రామేశ్వరంలో ఒకవారము, కన్యాకుమారిలో పదిహేనురోజులు గడిపారు. ఒకరోజు శశాంకమోహన్ అను భక్తుడు కన్యాకుమారి ఆలయంలో ధ్యానం చేసుకొంటూండగా మధ్యలో అతనికి కన్నులు తెరవాలనిపించింది; వెంటనే అతని ఎదుట మధ్య ద్వారం దగ్గర అందమైన ఒక చిన్న అమ్మాయి నిలుచొని కనిపించింది. అతడు చూడగానే ఆమె గర్భాలయంలోకి వెళ్ళింది. అతడు చివాలున లేచి వెళ్ళి చూచేసరికి గర్భాలయంలో ఆ అమ్మాయి కనిపించలేదు. అతడు తిరిగి తాను కూర్చున్న చోటికి రాగానే ఆ అమ్మాయి మరలా కనిపించి వెనకకు అడుగులు వేసుకొంటూ వెళ్ళి విగ్రహంలో లీనమైంది. అమ్మ అక్కడ వీధులవెంట, సముద్రతీరంలోనూ యధేచ్ఛగా సంచరిస్తూన్న ఒక అవధూతను అప్పుడప్పుడూ కలుసుకుంటుండే వారు. ఆమెను ఆ ప్రాంతపు ప్రజలు 'మాయీ అమ్మ' అనేవారు. అమ్మను చూడగానే ఆమె కిలకిలా నవ్వేవారు. తరువాత అమ్మ

త్రివేంద్రం, మంగుళూరు వెళ్ళి బొంబాయిమీదుగా ద్వారక చేరారు.

తరువాత వింధ్యాచలం, జగన్నాథపురి సందర్శించారు. అప్పుడు అమ్మ సన్నిధిలో కీర్తన చేసిన భక్తులు ఒక భక్త సమాజంగా ఏర్పడి ప్రతి వారమూ ఒకరి ఇంట నేటికీ అమ్మలీలలు చెప్పుకొని కీర్తన చేస్తున్నారు. అమ్మ ఎక్కడకు వెళ్ళినా అచటి ప్రజల వేషభాషలు, ఆచారాలు ఆలయ నిర్మాణంలోని సంప్రదాయ భేదాలు గూడ నిశితంగా గమనించేవారు.

ఒకప్పుడు కలకత్తాలో యువకుడైన ఒక సాధువు అమ్మ భక్తులతో కలిసి కాలక్షేపం చేస్తుండేవాడు. ఒకరోజు అతని భార్య అమ్మ వద్దకొచ్చి అతనినెలాగైనా ఇంటికి పంపమని అమ్మను వేడుకొంది. అమ్మ అతనితో, ''నీవు సన్యాస మార్గం అవలంబించాలంటే మొదట ఇంటికి వెళ్ళి ఆమెకు నచ్చజెప్పుకోవాలి. నీ నిర్ణయానికి ఆమె ఆమోదం అవసరం'' అన్నారు. కొద్దిరోజులలో అతడికి జబ్బు చేస్తే అమ్మ అతనిని ప్రాణ్‌కుమార్ అను భక్తుడి ఇంట విడిచి కాక్స్‌బజార్ అనే ఊరికి వెళ్ళారు. అక్కడొకరోజున ఆమె సముద్ర తీరంలో తమ చేతులతో గుంట తవ్వుతుండడం జూచి అమ్మమ్మగారు కారణ మడిగారు. అమ్మ, ''నా సమాధి నేనే తవ్వుకుంటున్నాను'' అన్నారు. అమ్మమ్మగారు ఆమెను వెంటనే వారించి ఇంటికి తీసుకొచ్చారు. తరువాత తెలిసింది – అమ్మ అలా గొయ్యి తవ్విన క్షణంలోనే కలకత్తాలో ప్రాణ్‌కుమార్ ఇంటనున్న ఆ సాధువు మరణించాడని. సాధువును దహనం చేయరు. సమాధే చేస్తారు.

అమ్మ ఢాకా తిరిగి వచ్చాక ఒకరోజు సద్గోష్ఠిలో ఒక పండితుడు ''అమ్మా, మీరెప్పుడూ సమాధి స్థితిలో భగవంతుడితో ఐక్యమై వుంటున్నారు. దయచేసి మా స్థితికి వచ్చి సమాధానం చెబితే మాకెంతో ప్రయోజనముంటుంది'' అన్నాడు. అమ్మ, ''మీరంతా

క్రింద స్థాయికి దిగిరావడమూ అంటూ ఏమీ లేదు. నాకంతా ఒక్కటే. నా శరీరంలోని మార్పులననుసరించి అట్టి వ్యత్యాసమున్నట్లు మీకు తోచవచ్చు'' అన్నారు.

సం॥ 1931లో గూడ అమ్మ జన్మదినోత్సవాలు మహావైభవంగా పూర్తయ్యాక ఆమె భజిత్‌పూర్ వెళ్ళారు. ఆమె అక్కడ వెనుక తాము నివసించిన ప్రదేశాలన్నీ చూపించారు. బాల్యంలో ఆమె నివసించిన ఇల్లు భక్తులకు చూపించారు. అపుడు వారింట్లో పనిచేసిన సేవకురాలు వచ్చి అమ్మను చూచి సంతోషించింది. ఆమె సాధన చేసుకొన్న గదిలోని మట్టి తీసి అమ్మమ్మగారు పవిత్రంగా దాచుకున్నారు. తరువాత అమ్మ కలకత్తాకు చేరారు.

కొద్దికాలం తర్వాత అమ్మ రథయాత్ర చూడటానికి పూరీ జగన్నాథం వెళ్ళదలిచారు. అంతకు కొద్దిరోజులు ముందుగా ఆమె, ''ఏదో కీడు జరుగనున్నట్లు నాకు తోస్తున్నది. మీరేమి చేయగలరో చూచుకోండి!'' అని భక్తులతో అన్నారు. పూరీ చేరిన తర్వాత ఆ మాట గుర్తుకు వచ్చి ఆ రోజు రథోత్సవంలో ఏదో బీభత్సం జరుగబోతుందని భయపడి బృందమంతా తిరిగి వెళ్ళిపోవాలని చెప్పారు. కాని రథయాత్ర చూసే ఉత్సాహంలో భక్తులు కదలలేదు. అమ్మ బంధువులలో ఒకామె తన ఇద్దరు పిల్లలను అమ్మవద్ద విడిచి తిరిగి కలకత్తాకు పోతూ, ''అమ్మా, నా ఇద్దరు బిడ్డలను మీకప్పగించి వెళుతున్నాను'' అని చెప్పి వెళ్ళింది. ఒక వారం తర్వాత ఆ ఇద్దరిలో సంతోష్ అనే పిల్లవాడు ఎక్కడా కన్పించలేదు. తరువాత ఒక బావిలో అతని శవం తేలింది. అది చూచి భక్తబృందమంతా నిశ్చేష్టులయ్యారు.

అమ్మ మాత్రం ఏమీ జరుగనట్లే వచ్చిన భక్తులందరినీ పరామర్శి స్తున్నారు. అటువంటి ఆకస్మిక మరణం అశుభమని తలచి

సామాన్యంగా అట్టి దేహానికి పెద్దలు అగ్ని సంస్కారానికి అంగీకరించరు. కాని భక్తులందరి కోరికా మన్నించి పండితులెలాగో దహనం జరిపించారు. మరురోజే అమ్మ వింధ్యాచలం వెళ్ళారు. చనిపోయిన పదమూడవ రోజు అతనికి శ్రాద్ధం జరిపించరాదని వారణాసి మరియు పూరీలోని పండితులు అభ్యంతరం చెప్పినట్లు అమ్మకు వార్త చేరింది. వెంటనే అమ్మ ఆ పండితులందరికీ తంతి ద్వారా తెలిపి వారి ఆమోదం సంపాదించారు. ఆ శ్రాద్ధ దినానికి అమ్మ వారణాసిలో సంతోష్ ఇంటికి వెళ్ళారు. గర్భశోకంతో వున్న ఆ తల్లి అమ్మతో, ''అమ్మా, నేను మీకు నా బిడ్డలిద్దరినీ వప్పజెపితే, వారిలో ఒక్కరికే మీరు ఆశ్రయమిచ్చారే' అన్నది. ఆ తల్లి హృదయంలో కరుడుగట్టుకు పోయిన శోకం చూచి అమ్మ విలపించసాగారు. వెంటనే సంతోష్ తల్లి తన పుత్రశోకం మరచి అమ్మను సముదాయించింది. అమ్మ వారి ఇంట పదిహేను రోజులున్నారు. అన్ని రోజులూ ఆ ఇల్లు నిత్య పండుగలా భక్తులతో కళకళలాడింది. తరువాత ఒకరోజు ఆ ఇంటి యజమాని అడిగారు : ''అమ్మా! మీరు ఆరోజు అంతలా శోకించారెందుకు?'' అన్నాడు. అమ్మ, ''మీ హృదయాలలో శోకం బిగుసుకుపోయి మీ హృదయవేదన తగ్గలేదు. మీ హృదయంలోని శోకాన్ని నేనే వెడలగ్రక్కాను'' అన్నారు. తరువాత అమ్మ వింధ్యాచలం తిరిగి వచ్చారు. అక్కడనుంచి ఢాకా చేరుకున్నారు.

అమ్మ సన్నిధిలో నివసించిన భక్తులలో ఎంతో మార్పు వచ్చింది. మొదట నుండి ఎన్నో సుఖాలకు అలవాటుపడిన శశాంకమోహన్ క్రమంగా అన్ని సుఖాలను విడిచిపెట్టాడు. ఒకప్పుడు సిద్ధేశ్వరిలో వుండగా అమ్మ ఒక కమండలం తెప్పించి, దానిని భద్రపరచమని అమ్మమ్మగారికిచ్చారు. అటుతరువాత దాని సంగతి ఎవరికీ గుర్తులేదు.

చాలాకాలం తర్వాత ఒకరోజు అమ్మ తమకా కమండలం కావా లన్నారు. అపుడు అమ్మమ్మగారు సిద్దేశ్వరం వెళ్ళింది. సరిగ్గా ఆ సమ యానికి అచటి కోనేటిలో ఈత గొడుతున్న ఒకతని కాలికి ఏదో గట్టిగా తగిలితే అది తీసి చూడగా, అది అమ్మ కోరిన కమండలమే! అపుడు అమ్మమ్మగారు అది తీసుకువచ్చి అమ్మకిస్తే, ఆమె శశాంక మోహన్‌గారికిచ్చింది. నాటి నుండి సుమారు 70 సం॥ల ఆ వృద్ధుడు రోజుకు ఏడెనిమిది గంటలు సాధన చేయసాగాడు. అతడు హోమియోపతి మందులు ఎప్పుడూ దగ్గర వుంచుకొని ఎందరో పేదలకు ఉచితంగా వైద్యసేవ చేస్తుండేవాడు.

సం॥ 1931లో కాశీపూజ అయ్యాక అమ్మ మరొక్కసారి యాత్రలుచేసి వచ్చారు. అపుడు జెంషెడ్‌పూర్‌లో అమ్మను ఎందరెందరో తమ ఇండ్లకు తీసుకువెళ్ళారు. ప్రతివారూ అమ్మ తమ ఇంట్లో ఏదైనా తినాలని ఆశిస్తుంటే, కూడా వచ్చిన అమ్మమ్మగారు ఒక్కొక్క ఇంట్లో ఒక్కొక్క ముద్ద చొ॥న అమ్మచేత ఆహారం తినిపించింది. నిత్యమూ అతి స్వల్పంగా మాత్రమే తినే అమ్మకు అదే చాలా ఎక్కువ అనిపించింది గాబోలు, ''ఈరోజు ఇంత ఎక్కువగా తినిపించారేమి?'' అన్నారు. అమ్మమ్మగారు, ''అమ్మా, మీరంత స్వల్పంగా తింటారని చెబితే భక్తులు నమ్మక మీకు నేను సరిగా తిండి పెట్టడం లేదనుకుంటున్నారు. అలాగాకుంటే మీరు వారింట్లో తినడం నాకిష్టం లేదనైనా అనుకుంటున్నారు. అందుకని ప్రతి ఇంట్లోనూ కొంచెమైనా మీచేత తినిపించాను'' అన్నది. అపుడు ఆనందమాయి, ''ప్రజలు నీగురించి ఏమనుకున్నా పట్టించుకొనక, నీ కర్తవ్యమే నీవు నిర్వహించాలి. వారేమనుకుంటారోనని భయపడితే నీ కర్తవ్యమెలా నెరవేర్చగలవు?'' అన్నారు. భక్తుల మెప్పుకోసమని అమ్మ సేవల్లో

లోపం చేసినందుకు అమ్మమ్మగారు నొచ్చుకున్నది. అమ్మ ఇచ్చిన అట్టి ఆదేశాన్ననుసరించే అంతటి వృద్ధుడైన శశాంకమోహన్ గూడ తెల్లవారుఝామునుండీ సాయంత్రం వరకూ ధ్యానం చేస్తుండేవాడు. సాయంత్రం 6 గం॥లకు రామ్నా వెళ్ళి ప్రసాదం తీసుకొని మరలా వచ్చి తెల్లవారుఝామున 3 గం॥ల వరకూ ధ్యానం చేసేవాడు. అప్పుడొక గంటమాత్రం నిద్రించి మరలా ధ్యానమారంభించేవాడు.

అమ్మ పరిహాసంలో గూడ అప్పుడప్పుడూ ఆమె లీల ప్రకటమౌతుండేది. కాకీమా అను ఒక పంజాబీ మహిళ మహా బలవంతురాలు, పరిహాసంగా తన బలప్రయోగంతో భక్తురాళ్ళందరినీ ఓడిస్తుండేది. ఒకరోజు అమ్మ తమ మూడువేళ్ళతో ఆమె చేయి పట్టుకుంటే, ఆమె ఎంత ప్రయత్నించీగూడ ఆ పట్టు విడిపించుకోలేక పోయింది.

సం॥ 1931లో రామ్నా ఆశ్రమంలోని దేవతా విగ్రహాలను తిరిగి పోత పోయించాలని నిశ్చయించారు. అందుకవసరమైన బంగారంలో ఎక్కువ భాగం అమ్మ ఇచ్చినదే. ఆమెకెందరో భక్తులు ఎన్నెన్నో నగలిచ్చేవారు. కాని ఆమె తమ వివాహానికి భోలానాథ్‌గారు పెట్టిన ఒక సన్నని కంఠహారము, చేతులకు శంఖాల గాజులు, ఒక బంగారు పోతపోసిన ఇనుప కడియము మాత్రమే ధరించేవారు. ఆ సం॥రం అమ్మ జన్మదినోత్సవానికి 21 రోజులపాటు అఖండ కీర్తనము, పూజలు, హోమాలు జరిపించారు. చుట్టుప్రక్కల మైదానమంతా జనవాహినితో నిండిపోయింది. ఈసారి ఉత్సవంలో భక్తులకవసరమైన ప్రతి ఏర్పాటూ అమ్మయే స్వయంగా చూసుకున్నారు. సిద్ధేశ్వరిలో ఆమె నిర్మింపజేసిన వేదికపై అమ్మ శివలింగం ప్రతిష్ఠించారు. ఉత్సవానికొచ్చిన వారందరూ ఎన్నో తినుబండారాలు, రకరకాల

వస్తువులు, కానుకలు తెచ్చారు. ఏ వస్తువు ఎవరు సమర్పించారో అమ్మ ఎంతకాలానికైనా మరచేవారు కాదు. వస్తువులు, పదార్థాలు అధికంగా వచ్చాయిగదా అని వాటిని దుబారా చేసినా, అలక్ష్యం చేసినా, పాడైపోనిచ్చినా అమ్మ సహించేవారుగాదు. పూజ, అగ్నిహోత్రము మొ॥న విషయాలలో అమ్మ ఎవరికి తగిన సూచనలు వారికిచ్చేవారు. వారణాసిలో మహాయజ్ఞం జరిగినపుడు అచట సమావేశమైన పండితులు అనులుపెట్టిన దానికి అమ్మ చెప్పిన సూచనలెంతగానో సరిపోయేవి. ఒక సాధకునికిచ్చిన సూచన గురించి మరొక సాధకునికి గాని, ఇతర భక్తులకు గానీ అమ్మ ఏమాత్రమూ తెలియనిచ్చేవారు గాదు. అటువంటి సూచనలు ప్రాణసమానంగా, లోభి ధనం దాచుకొన్నట్లు, దాచుకోవాలని అమ్మ చెప్పేవారు. తరువాత అమ్మ ఢాకా పట్టణంలో ఎందరిళ్ళకో వెళ్ళారు. ఆ భక్తులు సమర్పించిన వస్తువులు తీసుకుపోవడానికి ఒక ప్రత్యేకమైన బండి అవసరమైంది. తరువాత అవన్నీ భక్తులకు వినియోగం చేసి అమ్మ సిద్ధేశ్వరికి వెళ్ళారు. అపుడు ఆమె అచటి కాళీ విగ్రహాన్ని, రావిచెట్టునూ చాలాసేపు ఎంతో ప్రేమగా నిమిరారు. నాటి సాయంత్రం రమ్నా ఆశ్రమంలోని ఆలయం వరండామీద అమ్మ కూర్చున్నారు. కొద్దిమంది భక్తులు మాత్రమే ఆమె చుట్టూ కూర్చున్నారు. రాత్రి సుమారు 11-30 గం॥లకు ఆమె లేచి, ''నేను వెళుతున్నాను'' అన్నారు. ఆమె సోదరుడు తొందరపడి, ''సరే వెళ్ళి పడుకోండమ్మా, చాలా ఆలస్యమైంది'' అన్నాడు. అందరూ ఆమెకు నమస్కరించి ఇళ్ళకు వెళ్ళిపోయారు. తరువాత బడలిక చెంది నిద్రిస్తున్న భోలానాథ్‌ను పిలిపించి అమ్మ ఆయనతో

ఏమో మాట్లాడారు. భోలానాథ్ వెంటనే దుస్తులు వేసుకొని ప్రయాణానికి సిద్ధమయ్యారు. తరువాత ఆమె బాయిజీకి కబురు

చేసి, అమ్మమ్మను పిలిచి ''సాధకులకు ఓరిమి ఎంతో ప్రధానం. నేను ధాకా విడిచి వెళ్ళిపోతున్నాను. ఇదివరకల్లా మీరందరూ నేను తిరిగి రావాలని సంకల్పించడంవల్ల వచ్చాను. ఈసారి నన్ను యథేచ్ఛగా సంచరించనివ్వండి. మీరిలా ఆటంకపరుస్తూంటే నాకది సాధ్యమవదు'' అన్నారు. ఆ మాట విని అమ్మమ్మగారు దుఃఖం ఆపుకోలేకపోయింది. అప్పుడొక సేవకుడు, ''మీరెక్కడికి వెళుతున్నారు? ఎప్పుడు వస్తారు!'' అంటే, ''అదేమీ నిశ్చయంగా తెలియదు'' అన్నారు. అంతకుముందు ఆమె ఎప్పుడు ధాకా విడిచి వెళుతున్నా, ''నేవలా తిరిగి వస్తాను'' అనో, ''మీరెప్పుడు కోరుకుంటే అప్పుడే తిరిగి వస్తాను'' అనో చెప్పేవారు. కాని ఈసారి ఆమె అలా చెప్పలేదు. దిక్కుతోచక అందరూ మౌనంగా వుండిపోయారు. ఇంతలో భాయీజీ రాగానే, ''నీవీ రాత్రి మాతో బయలుదేరాలి'' అన్నారు అమ్మ. అతడు కొద్ది నిమిషాలు నిశ్చేష్టుడై మాట్లాడలేకపోయాడు. ''అదేమిటి? నీవలా చేయలేవా?'' అన్నారు అమ్మ. అతనికి జీవితంలో అత్యంత కఠోరమైన నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని చూచేవారందరికీ తెలుస్తూనే వున్నది. అతడు, ''నేను మొదట ఇంటికి వెళ్ళి ప్రయాణానికి కొంత డబ్బు తీసుకువస్తాను'' అన్నాడు. ''నీవింటికి వెళ్ళడానికి వీలులేదు. ఇక్కడున్న వారివద్ద ఎంత పైకముంటే అంతే తీసుకో!'' అన్నారు అమ్మ. తరువాత ఆమె అమ్మమ్మగారికీ, తాతగారికీ కబురు చేసారు. అంత అర్ధాంతరంగా నిర్ణయం తీసుకున్నందుకు తాతగారు కోపగించుకొని తాము రానన్నారు. అమ్మమ్మ గారు మాత్రం బయలుదేరారు. ఆనందమాయి అమ్మ తమ అలవాటు ప్రకారం వాళ్ళ అమ్మగారి పాదాలకు నమస్కారం చేసి నడక ప్రారంభించారు. కారు తెప్పిస్తామంటే ఒప్పుకొనక కొద్దిమంది

సేవకులతో కలిసి రైల్వేస్టేషన్‌కు నడిచి వెళ్ళారు. అమ్మమ్మగారిని గూడ ఆశ్రమానికి పంపివేసి భోలానాథ్ గారితో కలిసి అమ్మ గురువారము, జూన్ 2, 1932న ఢాకా విడిచిపెట్టి వెళ్ళిపోయారు. ఆ బృందం ఉత్తరదేశంలో అనేక ప్రాంతాలు తిరిగి చివరకు రాయపూర్ అనే కుగ్రామంలో ఒక శిథిలమైన శివాలయంలో విడిది చేశారు. ఆ ప్రదేశ మంతా చెట్లు, తుప్పలతో నిండి అడవిలా వున్నది. తేళ్ళు, పాములు స్వేచ్ఛగా సంచరించే ఆ చోట నీటి వసతి గాని, విద్యుత్ దీపాలు గాని లేవు. భోలానాథ్ అక్కడే కూర్చుని సాధన చేసుకోనారంభించారు. అమ్మ ఒంటరిగా ఆ ప్రాంతమంతా సంచరిస్తుండేవారు. భాయీజీ గ్రామానికి వెళ్ళి కొద్ది మంచినీరు, ఆహారమూ తీసుకొస్తుండేవారు. వారు సాధువులని తలచి గ్రామస్థులా శివాలయానికి వచ్చి అమ్మ దర్శనం చేసుకోనారంభించారు. క్రమంగా డెహరాడూన్ నుండి గూడా జనం రాసాగారు. వారికి అమ్మ ఈ విధంగా బోధిస్తుండేవారు :

''మనిషియొక్క విశ్వాసంపై పరిసరాల ప్రభావమెంతగానో వుంటుంది. అందువలన సాధుసత్పురుషుల సాంగత్యం సంపాదించు కొనడం సాధకులకెంతో ముఖ్యం''

''విశ్వంలో వస్తుజాల మంతటినీ వ్యక్తంచేసే బాహ్యమైన వెలుగును గూడ గుర్తించగల శాశ్వతమైన వెలుగు మీలోనే వుంటుంది. దానివల్లనే ఏదైనా తెలుసుకోవడమంటూ సాధ్యమౌతుంది''

''నీవు చూచే ప్రపంచమంతా నిజానికి నీ రూపమే; కాని అదే వేరైనట్లు తోస్తుంది. అది నీ రూపమేనని తెలుస్తే ఆనందము, లేదని భ్రమిస్తే దుఃఖము కలుగుతాయి''

''నీ మనస్తత్వానికి సరిపడిన పని ఎంత చేసినా అలసట కలుగదు; కాని నీకాసక్తిలేని విషయాలు త్వరగా విసుగుపుడతాయి గదా?''

''అంతా ఆ భగవంతునిదే అన్న మాటలకర్థం దృఢంగా గుర్తిస్తే వెంటనే భారమంతా తగ్గిపోతుంది''

''పరాయివారంటూ ఎవరూ వుండరు; అందరూ నీవారే అవుతారు''

''నేను వేరు, అనే భావాన్ని భక్తిలో కరిగించటమో లేక జ్ఞానంతో కాల్చివేయడమో చేస్తే ఆత్మజ్ఞానం కలుగుతుంది''

''గురువుయొక్క శక్తి వలన అన్నీ సాధ్యమౌతాయి. కనుక గురువును వెతుక్కో. ఈలోగా అన్ని రూపాలు, నామాలు ఆయనవే గనుక - ఒకదానిని ఎన్నుకొని నిరంతరమూ దానిని తోడుగా వుంచుకో. గురువు దొరకనంతవరకూ భగవంతుని నామరూపాలలో నీకిష్టమైన దానికి నిరంతరమూ అంటిపెట్టుకో, నీకు సద్గురువుగా ప్రత్యక్ష మవమని ఆయననే ప్రార్థిస్తూ వుండు''

''నీకు గురువును ఆశ్రయించాలని అన్పించకపోతే ఒక క్రమ బద్ధమైన సాధనను అనుసరిస్తూ వుండు''

''నీకు మనస్ఫూర్తిగా ప్రార్థించడం రాకపోతే 'నాకీ ప్రపంచం పట్ల ఇంత ప్రీతి ఎందుకు కల్గుతుంది?' అని ఆలోచించు. నీకే లౌకికమైన విషయంపైనైనా ప్రీతి కలిగితే, 'నేను దీని భ్రమకు లోనౌతున్నాను గదా, ఎందుకని?' అని ఆలోచించు. నీవు కీర్తి, ప్రతిష్ఠల వంటి వాటికోసం ఆశపడితే భగవంతుడు నీకవి ప్రసాదిస్తాడు గానీ అందులో నిజమైన తృప్తి కల్గదని నీకు తెలుస్తుంది. ఆనందమనే

భగవంతుని సామ్రాజ్యం లభిస్తే పూర్తిగా లభించవలసిందే. లేకుంటే

[illegible]
వెచ్చించు. మిగిలినవి వాటంతట అవే లభిస్తాయి. వేరుకు నీరుపోస్తే వృక్షం దానికదే పెరిగి కొమ్మలు, రెమ్మలు, పువ్వులు, కాయలు వేసినట్లే సర్వమూ లభిస్తాయి''.

# అధ్యాయము - 2

అది 1968, బాపట్ల కాలేజీలో ఆంగ్లోపాధ్యాయ పదవిని విడిచిపెట్టి జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధిలో వున్నాను. ఒక గురువారం నాడు గదిలో సాయిని పూజించుకుంటూ మహాత్ముల దర్శనం ప్రసాదించమని ప్రార్థించుకొని బయటకు రాగానే, కుమారస్వామి అనే భక్తుడు మధుర బృందావనంలో తాను సకుటుంబంగా శ్రీ శ్రీ ఆనందమాయి అనే మహాత్మురాలిని దర్శిస్తూంటానని చెప్పి నన్ను గూడ ఆమె దర్శనం చేసుకోమన్నాడు. అది సాయి సందేశమని తోచి త్వరలో ఆమెను దర్శించాలన్న తపన ప్రారంభమైంది. కాని అది లభించడమెంతో కష్టం. కారణం ఆనందమాయి ఎప్పుడూ ఒకచోటనే స్థిరంగా వుండక ఆమెకే క్షణాన ఎక్కడికి పోవాలనిపిస్తే అక్కడికి ఎంత దూరమైనా సరే, భక్తుల కార్లలోనైనా వెళ్ళిపోతుంటారు. ఆమెనెలా దర్శించడమా అని ఆలోచిస్తూ బాపట్లలోని మాతృశ్రీ ప్రెస్‌లో కూర్చుని వుండగా 'ఆనందవార్త' (ఇంగ్లీషు) ప్రతి ఒకటి ఆ కుమారస్వామిగారే నా చేతికందించారు. ఆయన తీసిచ్చిన పేజీలో నాకు కావలసిన ఈ వార్త కనిపించింది. నైమిశారణ్యంలో ఆనందమాయి అమ్మ భాగవత సప్తాహం నిర్వహిస్తున్నారు. 7 రోజులు ఆమె అక్కడే వుంటారు అని. ఆమెను దర్శించడానికి అదే మంచి అవకాశమనిపించింది. ఆరోజే బయల్దేరితే గాని ఆ సప్తాహానికి చేరుకోలేమని ఆ పత్రికలోని విషయాలు తెలుపుతున్నాయి. నాటి సాయంకాలానికల్లా 'మాతృశ్రీ' (ఇంగ్లీషు) పత్రిక ముద్రణ పూర్తవడంతో స్వీకరించిన బాధ్యత ఆ నెలకు పూర్తవుతుంది. సాయి, 'నీవు చేసానని అంగీకరించిన పని త్రికరణశుద్ధిగా చేసి తీరాలి' అని

చెప్పారు గనుక నాటి సాయంత్రానికి ఆ పని పూర్తిచేసిన 10 ని॥లలో ఎక్కవలసిన రైలు రాబోతున్నదని సూచిస్తూ ఎదురుగా వున్న రైల్వేస్టేషను నుండి గంట వినిపించింది. నాకు నైమిశారణ్యం ఉత్తరదేశంలో వున్నదని మాత్రమే తెలుసు. ఒక పెద్దరగ్గు, నాలుగు గుడ్డలు సంచిలో వేసుకుని పరుగునపోయి రైలెక్కాను. విజయవాడ రైల్వేస్టేషనులో విచారిస్తే కాన్పూరు నుండి లక్నో వెళ్ళేమార్గంలో నైమిశారణ్యముందని చెప్పారు.

ఎలాగైతేనేమి ప్రయాణం కొనసాగించి, సాయంత్రం 4 గంటల కల్లా నైమిశారణ్యంలో దిగి బయటికొచ్చేసరికి, ఆ గ్రామం నుండి భాగవత సప్తాహం చూడడానికి వెళ్తున్న బ్రహ్మచారుల బృందం కనిపించింది. నేను కూడా వారి వెంట నడిచాను. అది శీతాకాలం కావడం వలన చలి విపరీతంగా కొరికేస్తున్నది. నడుస్తూంటే ఆ చలికి పళ్ళు కటకట కొట్టుకుంటున్నాయి. అలాగే 8 మైళ్ళు నడిచి అడవిలో ఒక ప్రాంతానికి చేరేసరికి చీకటిపడింది. సంధ్యాసమయంలో దూరాన భూమ్యాకాశాలు కలిసేచోట వెండి గుట్టలలా హిమాలయా పర్వతాలు కొద్దిసేపు మాకళ్ళల్లో మెరిసాయి. ఆ బ్రహ్మచారులందరితో కలిపి నేనుగూడ పృష్ఠ్వది నుండి ఎందరెందరో తపస్వులకు నిలయాలైన ఆ పర్వతాలకు, అక్కడ తపస్సు చేస్తున్న ఋషులనూ స్మరించి నమస్కరించుకున్నాను.

సుమారు 7 గంటలయ్యేసరికి అడవి మధ్యలో నేలను చదును చేసి ఏర్పాటు చేసిన షామియానాలు, కొన్ని గుడారాలు విద్యుద్దీపాలతో వెలుగుతూ కనిపించాయి. చెప్పులు లేని కాళ్ళతో అతి చల్లని నేలపై నడవడంతో అరికాళ్ళు పచ్చి పుండ్లలా తయారయ్యాయి. చలికి

అరచేతులు, చెవులు, ముక్కు మొద్దుబారుతున్నాయి. మంచుకు వంటినున్న గుడ్డలు తడిసిపోయాయి. ఆకలి దహించివేస్తున్నది. కాని మనస్సు మొదట అమ్మను దర్శించాలని ఆరాటపడుతున్నది.

మేము ప్రధానమైన షామియానాలో ప్రవేశించేసరికి అక్కడే ఒక ప్రక్కగా ఒక మంచంమీద ఆనందమాయి కూర్చొని కొద్దిమంది భక్తులకు దర్శనమిస్తున్నారు. వెంటనే మేము గూడ నమస్కరించుకొని ఆమె సన్నిధిలో కూర్చున్నాము. అమ్మ బెంగాలీ భాషలో ఏమేమో సన్నిహిత శిష్యులతో చెబుతూ మధ్య మధ్యలో పసిపిల్లలా పండు వెన్నెలలా హాయిగా నవ్వుతున్నారు. సుమారు 70 సం॥ లు వయస్సున్నట్లు కనిపిస్తున్నప్పటికీ నల్లని జుట్టు, తెల్లని శరీరఛ్ఛాయ, అతి తెల్లని చీర కట్టుకుని కూర్చున్న అమ్మ వెన్నముద్దలా తోచింది. మధ్యలో ఆమె నాకేసి చూసి, ''నీవెక్కడనుండి వస్తున్నావు?'' అని అడిగి, నేను సమాధానమిచ్చేలోపలే నేను దూరప్రాంతం నుండి వచ్చానని ఆమే చెప్పింది. నాకేమీ అర్థంగావడం లేదని హిందీలో సాటివారితో చెప్పి, ''శ్రద్ధ అన్నది చాలా గొప్పది. ఎక్కడెక్కడ నుండి ఎందుకొస్తున్నారో తమకే తెలియకుండా ఎన్నో కష్టాలకోర్చి ఇచటకు వస్తారు. ఆనందస్వరూపమైన పరమాత్మకోసం జీవుడు పడే ఆరాటాన్ని వివరించ సాధ్యంగాదు. జీవితంలో అందరూ అనుభవించే అశాంతికి, కొరతకు అదే కారణం. ఇది ఒక దైవలీల. ఆయనే ఇన్నిరూపాలు ధరించడమెందుకో, మళ్ళీ ఇలా ఆరాటపడడ మెందుకో!'' అన్నారు. అక్కడున్న భక్తులందరూ నాకేసి వింతగా చూచారు. నేను అమ్మకు నమస్కరించి ఆంధ్రదేశం నుండి వచ్చానని చెప్పి, ఆ మాట అర్థంగాకపోయేసరికి నేను మద్రాసీనని చెప్పాను.

అమ్మ, ''అంతదూరం నుండీ వచ్చావా?'' అన్నారు. ''అమ్మ దగ్గర కంటే దూరమేమిటి? వడిలోకి చేరగలగడమే ధన్యత'' అన్నాను. అమ్మ నవ్వి, అవునన్నట్లు తలవూపారు. ఆటు తర్వాత సుమారు అరగంట సేపు గాఢమైన మౌనంలో నాకేసి చూస్తూ కూర్చున్నారు! నాకూ తెలియకుండా కాలం క్షణాలలా గడిచిపోయింది. ఇంతలో ఒక సేవకురాలొచ్చి భోజనాలకు ఏర్పాట్లవుతున్నాయన్నారు. మరుక్షణం లోనే నాలో ఆకలి మంటలు చెలరేగాయి. ప్రయాణంలో ఏమీ దొరకక, ప్రొద్దుటినుండి నేనేమీ తినలేదన్న సంగతి గుర్తురాగానే ఎంతో నీరసమనిపించింది. అమ్మలేచి లోపలకు వెళ్ళిపోయారు. భక్తులందరితో పాటు నేను గూడ లేచాను. నాకు భోజనము, వసతి, నిద్రపోవడానికి తగిన చోటు గురించి ఆలోచన మొదలయింది. అక్కడున్న భక్తులకు సంచీలెక్కడ పెట్టుకోవాలో చెబుతున్న ఒక సన్యాసి వద్దకు వెళ్ళి, నన్ను నేను పరిచయం చేసుకొని నా భోజనం గురించి, వసతి గురించి అడిగాను. ఆయన అదేమీ చెప్పక, ''నీవసలు ఇక్కడికెలా వచ్చావు? అమ్మ సంగతి నీకెలా తెలిసింది? ఈ సప్తాహానికి రమ్మని నీకు జాబు వచ్చిందా?'' అంటూ ప్రశ్నలు కురిపించాడు. అచటి భక్తులలో కొందరు బండ్లెక్కి మేమొచ్చిన దారిలో నాలుగు మైళ్ళదూరానవున్న నైమిశారణ్యం గ్రామానికి కాబోలు వెళ్ళిపోయారు. నా సంగతంతా వివరించేసరికి నా ఆకలి, నీరసం వలన చికాకు తలకెక్కింది. అక్కడ మిగిలిన వారందరూ సన్యాసులో లేక బ్రహ్మచారులో అయివుండాలని వారి వేషాలే తెలుపుతున్నాయి. గళ్ళ లుంగీ, మాసిన చొక్కా, మాసిన గడ్డముతో వున్న నేనొక్కడినే హంసల కొలనులో కాకిలా కన్పించాను కాబోలు, ఆ సన్యాసి ముఖంలో అసహ్యము, కంఠ ధ్వనిలో చికాకు తొంగిచూచాయి. చివరకు చావు కబురు చల్లగా, కఠినంగా చెప్పాడు -

''అమ్మ దగ్గర దీక్ష తీసుకొన్నవారు మాత్రమే ఈ ప్రాంగణంలో వుండవమ్మ. నీవింతాకనే గ్రామస్థులతో ఊరిలోకి వెళ్ళిపోవలసింది'' అన్నాడు. ''ఆ మాట మొదటే చెబిత నేను వారితో కలిసి వెళ్ళిపోయే వాణ్ణిగదా!'' అన్నాను. ''నీవెవరో తెలుసుకోకుండా ఎలా చెప్పాలి!'' అంటూంటే అతని కంఠధ్వనిలో నాపట్ల అపహాస్యము, తాను తీసుకొన్న దీక్షపట్ల, ఆశ్రమంలో తమకున్న స్థానంపట్ల గర్వమూ ధ్వనించినట్లు నాకనిపించింది. ''తెల్లవారేవరకూ ఈ షామియానాలోనే ఈ సంచీ ఒక్కటే పెట్టుకుని పడుకుంటాను, తెల్లవారగానే గ్రామంలో వసతి చూసుకుంటాను. ఒక్క రొట్టెముక్క ఇస్తే ఇక్కడే తింటాను. ఆకలి దహిస్తోంది. ప్రొద్దుటినుండీ ఏమీ తినలేదు'' అని చెప్పాను. ''మేము ఆహ్వానం పంపినవారికి మాత్రమే ఇక్కడ ముందుగా ఏర్పాట్లవుతాయి. ఇది అమ్మవద్ద దీక్ష తీసుకొన్న వారికి ఏర్పాటు చేయబడిన సాధనా శిబిరం. బయటివారందరూ పగలు జరిగే భాగవత ప్రవచనము, భజనలు చేసుకొని వెళ్ళిపోతారు. అలా బయటినుండి వచ్చేవారు వారి ఏర్పాట్లు వారే చేసుకోవలసి వుంటుందని పత్రికలో ముద్రించామే, చూడలేదా?'' అన్నాడు. నేను చూడలేదనీ, ఈ ఒక్కపూట దయతో ఎలాగైనా నన్నక్కడ వుండనిమ్మనీ ప్రాధేయ పడ్డాను. ''ఈరోజు నిన్నిక్కడిని వుండనిస్తే రేపటినుంచీ అందరూ ఎగబడతారు. గ్రామస్థులు తగవు పెడతారు. నీ పొరపాటుకు నన్నేం చేయమంటావ్? నీవిక్కడ వుండడానికి మాత్రం వీలులేదు'' అన్నాడు. ''ఇప్పుడు నేనెక్కడికి వెళ్ళేది?'' - దీనంగా అన్నాను. ''అది నాకు తెలియదు. ఈ ప్రాంగణం దాటి అవతల ఎక్కడికైనా వెళ్ళు'' అంటూ భుజం పట్టుకుని గేటువరకూ తీసుకొచ్చి వదలి లోపలకు వెళ్ళిపోయాడు. నా పక్షం పలికేందుకు అక్కడ ఒక్కరు

కూడా లేరు. అందరూ భోజనాలకు వెళ్ళిపోయారు.

ఎటు చూచినా కారుచీకట్లు కమ్ముకుని వున్నాయి. ఎముకలు కొరికేసే ఆ చలిలో చూస్తుండగానే వంటిపై గుడ్డలు చల్లబడి పోతున్నాయి. ఎదురుగుండా కొద్దిదూరంలో పెనుభూతంలా ఎత్తుగా వున్న పెద్ద చెట్టు అస్పష్టంగా కనిపించింది. దాని క్రిందకు వెళ్ళి చేతిలోని పంచీ క్రిందపడేసి అందులోని రగ్గు నఖశిఖ పర్యంతమూ చుట్టుకుని, మోకాళ్ళు కౌగలించుకుని కూర్చున్నాను. చెవులు హోరెత్తి పోయేటట్లు కీచురాళ్ళు రొద చేస్తున్నాయి. వంటిపైనున్న రగ్గుమీద చెట్టుపైనుండీ నీటిచుక్కలు పడుతున్నాయి. అర్ధరాత్రి అయ్యేసరికి రగ్గు చాలాభాగం తడిసిపోయింది. ఇంతలో బూట్ల శబ్దం వినిపించి చూసేసరికి నా ముఖాన బ్యాటరీ లైటువేసి, ''ఎవరు నువ్వు? ఇక్కడెందుకు కూర్చున్నావ్?'' అని గదమాయిస్తున్న ఘూర్కా గొంతు వినిపించింది. నా సంగతంతా క్లుప్తంగా చెప్పాను. ''ఇక్కడిలా కూర్చుంటే తెల్లవారేసరికి చచ్చిపోతావ్'' అన్నాడు. ''చస్తే చావనీ, నేను చేయగలిగిందేముంది!'' అన్నాను. ఘూర్కా తిరిగి వెళ్ళిపోయాడు. అంతవరకూ కునుకు పట్టిందని అప్పుడుగాని తెలియలేదు. ఆటు తర్వాత నిద్రపట్టనే లేదు. వళ్ళంతా జ్వరం వచ్చినట్లుంది. తుమ్ములు, దగ్గు, గొంతునొప్పి ప్రారంభమయ్యాయి. ఆకాశంలో నక్షత్రాలు దూరాన చెట్లమాటునుండీ ఆశ్రమం వైపుగా కనిపిస్తున్నాయి. ''ఇప్పుడు నన్ను సాయి చూస్తున్నారా? నా దుస్థితి ఆయనకు తెలి యదా? తన భక్తుల్నే పస్తులుండనివ్వనని చెప్పిన ఆయన మాట ఏమయింది? సకల జీవ హృదయాంతర్వర్తియైన ఆయన శక్తి ఈ ఆశ్రమవాసుల హృదయాలను నాపట్ల కరిగించలేకపోయిందా?'' అన్న ఆలోచనలు నాలో చెలరేగాయి. బాబామీద పట్టలేని కోపమొచ్చింది.

కానీ మరుక్షణమే నేను 1963లో శిరిడీ దర్శించినప్పటి నుండి అడుగడుగునా జీవితంలో నా అండనుండి ఒక్కొక్క సన్నివేశాన్ని - అది కష్టంగాని, సుఖంగాని - గొప్ప శిల్పిలా నా అంతరంగాన్ని చక్కగా సంస్కరించడానికి సరిపడే రీతిన ఎలా మలుస్తూ వచ్చారో, విషమ సమయాలలో గూడ నేను ఊహించని రీతిన నన్నెలా రక్షిస్తూ వచ్చారో జ్ఞాపకం వచ్చింది. ఆయన ఒక భక్తుణ్ణి, ''ఏమిటి, నీవు ఒక్క రోజు ఉపవాసానికి గూడా బాధపడిపోతున్నావా? నేను 12 సం॥లు కేవలం వేపాకులు తిని జీవించాను'' అని మందలించటం గుర్తొచ్చింది. అది నాతోనే అన్నట్లు అనిపించగానే ఆకలి, నీరసం అదృశ్యమయ్యాయి. భగవంతుని సృష్టిలో ఎల్లప్పుడూ అలా ఆరుబయట చెట్లక్రింద తలదాల్చుకునే ప్రాణులు ఎన్నో వున్నాయని, అన్ని సం॥ల జీవితంలో కేవలం ఒక్కరాత్రి అలా వుండవలసి వచ్చినందుకు అంతగా బాధపడిపోతున్న నేను నిజంగా ఆనందమాయి దర్శనానికి వచ్చానో, లేక శారీరక, మానసిక సౌఖ్యాలకోసం వచ్చానో నాకర్థం కాలేదు. నాకున్న ప్రేమ సాయిమీదనా, లేక ఆయనవల్ల లభించగలదనుకున్న వసతుల కోసమా! నిష్ఠ, ఓరిమి కించిత్తయినా అలవరచుకోని నేను అసలు అన్వేషిణేనా? కానప్పుడు నేనింత దూరం ఎందుకు వచ్చినట్లు? నన్ను నేను వంచించుకొని నేనొక సాధకుడినన్న అహంకారాన్ని తృప్తి పరచుకోడానికా? ఆనందమాయి వంటి మహాత్మురాలి అనుగ్రహం కోసం వచ్చానా, లేక ఈ అహాన్ని పెంచుకోవడానికా?

ఇలా అప్పటి నా భావాలెంత నికృష్టమైనవో తలచుకొని సిగ్గుపడు తుండగానే పక్షులరొదతో అడవంతా నిండిపోయి మరికొద్దిసేపట్లో ఆకాశం తెల్లబారింది - నా తెలివిలాగే. లేచి నిలబడేసరికి ఒళ్ళు, తల చెప్పలేనంతగా నొప్పి పుడుతున్నాయి. జలుబు, తీవ్రమైన జ్వరం

నన్నావహించాయి. అలా అక్కడ ఎన్ని రోజులు వుండగలను? అని అనిపించింది. సుమారు రెండు ఫర్లాంగుల దూరంలో వున్న నది దగ్గరకు వెళ్ళి ముఖం కడుక్కోపోతే నీరు మంచుగడ్డలా అతిల చల్లగా వున్నాయి. ఎలాగో కాలకృత్యాలు తీర్చుకుని, నడవలేక, నడవలేక తిరిగి అచ్చటికి వచ్చేటప్పటికి విపరీతమైన నీరసము, కడుపులో మంట చెలరేగాయి. అప్పుడే ఆశ్రమం ఎదుట చిన్న షామియానా కట్టుకొని ఒకరిద్దరు 'చా' అమ్ముతుండటం చూచాను. అక్కడ కూర్చుని ఉప్పుబిస్కెట్లు, టీ తీసుకుంటుండగా అంగడివాడు నా పరిస్థితి గురించి ఎంతో జాలిగా అచ్చటివారికి చెబుతున్నాడు. అందరూ నన్ను ఎన్నెన్నో ప్రశ్నలు వేసి సానుభూతి చూపుతున్నారు.

మరికొంతసేపటికి ఆశ్రమంలో శ్రీ ఆనందమాయి అమ్మ వేదికపై జ్యోతి వెలిగించడంతో భాగవత సప్తాహం ప్రారంభమయింది. శ్రీమద్భాగవత పారాయణద్వారా శ్రీ కృష్ణ సాక్షాత్కారం పొందిన శ్రీ అఖండానంద సరస్వతి అనే మహాత్ముడు, సన్యాసి (వయస్సు సుమారు 50 లేక 60 సం॥లు వుంటాయి) భాగవతం చెప్ప నారంభించారు. వారి ముఖ్య శిష్యులొకరు, శ్రోతగా వారి కుడిప్రక్కగా కూర్చున్నారు. భగవత్సాక్షాత్కారం పొందిన హరిబాబా అనే మహాత్ములు గూడా వేదికనలంకరించి అప్పుడప్పుడు భజన చేసారు. ఎర్రని కాషాయ వస్త్రాలు ధరించిన సన్యాసులు, సన్యాసినులు మరియు తెల్లని వస్త్రాలు ధరించిన బ్రహ్మచారులు, బ్రహ్మచారిణులు కొన్ని వందలమంది ముందు వరుసలలో కూర్చున్నారు. వారి వెనుక వరుసలలోనే నేను కూర్చున్నాను. సమయం గడిచిన కొద్దీ పొరుగూరు నుండి కాలినడకన, బండ్లమీద ఎందరెందరో గ్రామస్తులేగాక, కార్లలో మంత్రులు, గవర్నర్లు, నగరవాసులు జనవాహినిగా తరలివచ్చి మిగిలిన

ప్రదేశమంతటా కూర్చుంటున్నారు. అంతమంది వున్నా, ఎంతో నిశ్శబ్దంగా వినయ విధేయతలతో, క్రమశిక్షణతో కూర్చున్నారు. భజనలో కించిత్తైనా బిడియం లేకుండా హృదయపూర్వకంగా పాల్గొంటున్నారు. ధూమపానం అలవాటు వున్నవారు అప్పుడప్పుడూ లేచి ఎంతోదూరంగా పోయి చెట్లచాటున అవసరాలు తీర్చుకొని రావటం చూచాను. ఆంధ్రులు వారినుండి లవలేశమైనా ఈ శ్రద్ధ నేర్చుకోగలిగితే నిక్కష్టమైన మన జీవితాలు ఎంత మధురంగా పవిత్రంగా వుండగలవో గదా అనిపించింది. వేదిక మధ్య మహాత్ముల నడుమ కళ్ళజోడు పెట్టుకొని కూర్చున్న శ్రీ ఆనందమాయి గడ్డం క్రింద చెయ్యి పెట్టుకొని అత్యంత శ్రద్ధతో భాగవతం వింటున్నారు. నిత్యము కార్యక్రమం చివరిలో మహాత్ములు అమ్మకు పాద నమస్కారం చేస్తారు. ప్రజలు వేరొకరిని అలా గౌరవించడం చూచి ఓర్వలేని ఆంధ్రదేశానికి, ఆ దేశానికి వ్యత్యాసం చూడగానే హిమాలయాలలో నిరంతరం తపస్సు చేస్తూ ఆ తపశ్శక్తిని ధారపోస్తుంటే అది గంగ, యమున, బ్రహ్మపుత్ర వంటి మహానదులవలే ఆ ప్రజల జీవితాలను నేటికీ ఎంత పావనం చేస్తున్నాయో అర్థమయింది.

సుమారు 11 గం॥ ప్రాంతంలో ప్రవచనం పూర్తయింది. ఎలా వచ్చిన జనవాహిని అలా చూస్తుండగానే కరిగిపోయింది. కొద్దిమంది శ్రీమంతులు, మంత్రులు, గవర్నర్లు వంటివారు ఎంతో డబ్బు ఖర్చుపెట్టి ఆశ్రమానికి చాలాదూరంలో ప్రత్యేకమైన గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. అమ్మ ప్రత్యేకమైన తమ గుడారంలోకి వెళ్ళిపోయారు. మరలా మధ్యాహ్నం 3 గం॥ ల నుండి 5 గం॥ ల వరకు భాగవత ప్రవచనం జరిగింది. నాటి మధ్యాహ్నం గూడ ఉప్పు బిస్కెట్లు, టీతో కడుపు నింపుకున్నాను. అది తింటున్నప్పుడు వెగటు

పుట్టే మనస్సు, ''బాబా నిన్ను నమ్ముకున్నందుకు నన్ను బాగానే ఆదుకుంటున్నావు'' అని ఎత్తిపాడుస్తూనే వున్నది. సాయంత్రం ప్రవచనం అయిన దగ్గరనుండి చీకటి పడుతున్నకొద్దీ రాత్రికి ఎక్కడ తలదాచుకోవాలా అనే ఆలోచన ప్రారంభమయింది. మనస్సుకు ఎంతగా నచ్చచెప్పుకుంటున్నా శరీరం మొరాయిస్తున్నది. సాధకుడవాలంటే శరీరానికి గూడ కష్టమోర్చటం ఎంతగా అలవడాలో బాగా అర్థమయింది. లేకుంటే శరీరానికి ఎట్టి ఇబ్బందీ కల్గనంత వరకూ తెచ్చిపెట్టుకున్న భక్తితో మనస్సు ఎన్నోరీతుల దైవాన్ని స్మరిస్తుంది. మనమొక సాధకులమన్న అహంకారానికి మెరుగులు దిద్దుకుంటాము. ఎంత స్వల్పంగానైనా కష్టమొచ్చినప్పుడు భగవంతుణ్ణే నిందిస్తాము, ఆయన ఉనికినే శంకిస్తాము గూడ. అంటే భగవంతుడు ఆ సమయంలో మనకు కొరబడ్డ సుఖంపాటి గూడా విలువ చేయడన్నమాట! వెంటనే ఒక కథ గుర్తుకు వచ్చింది. ఒక భక్తుడి ఇంటిలోని రామచిలుక ఎవరొచ్చినా 'సీతారామ, సీతారామ' అని అరుస్తూ అందరి మన్ననలనూ పొందుతుండేది. ఒకరోజు ఒక పిల్లి ఆ పంజరం మీదకు దూకగానే ఆ చిలుక భగవన్నామం విడిచి కీచుకీచుమని ఆర్తనాదం చేసి తన భక్తి ఎంత ఆడంబరమో నిరూపించుకున్నది. గజేంద్రుడు మొదలైన భక్తులవలె ఎంత కష్టంలోనైనా చెదరని విశ్వాసంతో, ప్రేమతో భగవంతుణ్ణే స్మరించగలగటం ఎంతటి అతీత స్థితో బాగా అర్థమయింది. సాధన అన్నది ఎంతో కష్టమని, దున్నపోతునెక్కి న్హాణేఘాట్ అనే పర్వత కనుమ దాటడంకంటే కూడా కష్టమని సాయి చెప్పినది ఎంత వాస్తవమో అర్థమయింది. ఎంత నచ్చ చెప్పుకున్నా మనస్సు మాత్రం 'భోజనము, వసతి కావాలి రామచంద్ర' అనే సాయిని వేడుకుంటున్నది. ఆనందమాయి అనుగ్రహం కోసం అడగ

టానికి బుద్ధికూడా పుట్టడం లేదు.

ఇలా ఆలోచిస్తూ ఆ టీ స్టాల్ ముందు కూర్చుని వుండగా ఒక కారుడ్రైవర్‌తో ఆ అంగడివాడు నాగురించి ఏదో మాట్లాడుతున్నాడు. కొద్దిసేపట్లో ఆ కారుడ్రైవర్ నావద్దకు వచ్చి రాత్రికి తన కారు వెనుక సీట్లో పడుకోమని చెప్పాడు. ఆ మాట వినగానే సాక్షాత్తు వైకుంఠమో లేక కైలాసమో చేతికి అందినట్లు అన్పించింది. సాయినాథుని రక్షణ కొంచెం కొంచెం అనుభవం కాసాగింది. శరీరానికి వసతి దొరికితే భక్తి తలెత్తదు మరి! నాటిరాత్రికి నిశ్చింతగా ఆ కారు వెనుక సీట్లో వెచ్చగా నిద్రపోయాను. తెల్లవారేసరికి జలుబు, జ్వరం ఒళ్ళునొప్పులు తగ్గిపోయాయేమో, విపరీతంగా ఆకలయింది. టీ బిస్కెట్లతో కడుపు నింపుకొని శ్రీ అఖండానంద సరస్వతి కొందరు సాధువులతో జరుపు తున్న సద్గోష్ఠి వింటూ కూర్చున్నాను.

అమిత వృద్ధుడైన ఒక సన్యాసి తన గ్రామస్థులు తమ ఆశ్రమ జీవితానికి ఎన్నో కష్టాలు కల్గిస్తున్నారని చెప్పుకున్నాడు. శ్రీ అఖండానందులు నవ్వి, ''అలా కష్టమనుభవించి క్రమంగా ఓరిమి నేర్చుకోవడానికే భగవంతుడు అలా జరుగనిస్తాడు, సాధ్యమైనంతవరకు ఆ బాధలను ఓర్చుకుంటూ భగవంతుణ్ణే స్మరిస్తూ వుండాలి. ఇక చేతకానప్పుడు భక్తుడైనవాడు ఆ చోటు విడిచి పోవాలేగాని దెబ్బకు దెబ్బ తీయకూడదు. అధర్మాన్ని ఎదుర్కొని నిగ్రహించడం సంసారుల ధర్మము, సన్యాసికి తగదు'' అని చెప్పారు. ఆయన ఎంత చెప్పినా ఆ వృద్ధ సన్యాసి ఊరట చెందలేదు. చివరకు శ్రీ అఖండానంద సరస్వతి

తాము మధుర బృందావనంలో సేవించిన ఒడియా బాబా అనే మహాత్ముడి వృత్తాంతం క్లుప్తంగా చెప్పారు. ఒడియా బాబా దగ్గరకు

ఎందరెందరో భక్తులు, శిష్యులు వస్తుండేవారు. వారిలో ముఖ్యశిష్యుడు దర్శనానికి వచ్చే భక్తులను, చివరకు స్వామినీ గూడా ఎన్నో రీతుల వేధిస్తుండేవాడు. భక్తులందరూ అతనిని తొలగించమని ఎంతగానో స్వామిని తమ స్వప్రయోజనాల కోసం బాధించసాగారు. మొదటి శిష్యుణ్ణి వారందరూ కలిసి తొలగించి ఆయనకు శాంతిని కల్పించి నందుకు ఆయన కృతజ్ఞతతో తమ ఇష్టాయిష్టాలకు విధేయుడై వుండాలన్నట్లు ప్రవర్తించసాగారు. క్రమంగా స్వామి అసమర్థుడని, తామే వారి రక్షకులమనీ చెప్పుకో సాగారు. మొదటి శిష్యుడు గూడా తనను వారందరూ కలిసి తొలగిస్తుంటే చూస్తూ వూరుకున్నందుకు స్వామి పై కక్ష కట్టి, ఆయన తనకు క్షమాపణ చెప్పుకొని పిలుపించు కోకుంటే ఆయనను హతమారుస్తానని నలుగురిలోనూ శపథం చేయసాగాడు. మొదట కొద్ది రోజులు అతడిపై కినుకతో భక్తులు ఆర్భాటంగా స్వామికి కాపలా వున్నారు. కానీ క్రమంగా వారి భక్తి శ్రద్ధలు సన్నగిల్లి ఎవరి పనులు వారు చూచుకోసాగారు. వారికి ఆశీస్సులు అవసరమైనప్పుడు తప్ప ఆయనను దర్శించేవారేగాదు. అది అవకాశంగా తీసుకొని మొదటి శిష్యుడు స్వామి యొక్క ముఖ్య శిష్యుణ్ణి మంచి చేసుకొని తిరిగి ఆశ్రమానికి రాసాగాడు. అది గమనించిన కొందరు భక్తులు, 'స్వామీ! ఈ దుష్టుణ్ణి మరలా దగ్గరకు చేరనిస్తున్నారేమి?'' అని అడిగారు. స్వామి, 'సాధువులమైన మేము ఎవరినీ రమ్మనము, పొమ్మనము. ఎవరెవరికి మాతో ఎలాంటి ఋణానుబంధమున్నదో దానిని నెరవేర్చడానికి వచ్చి ఆ కాస్త పూర్తి చేసుకొనిపోతారు. అవన్నీ చూచుకోవలసింది మీరు. మాకీ దేహమున్నా పోయినా ఒక్కటే. దేహమున్నంత వరకూ భగవంతునికి, జీవులకు చేతనైన మేరకు సేవ చేయడం ఒక్కటే మా విధి !'' అని

మాత్రమే అన్నారు. నేను అది కనిపెట్టి చాలా రోజులు స్వామికి కాపలా వున్నాను. ఒకరోజు తీవ్రమైన జ్వరంతో నేను లేవలేకుండా పడివున్నాను. స్వామి సేవకులిద్దరూ నన్నేమీ పట్టించుకొనలేదు. నేను గూడా స్వామి సన్నిధిలో ఒక స్థానమేర్పరుచుకోవడం వారికి ఇష్టంలేదు. కేవలం స్వామిని చూచి మాత్రమే నన్ను ఉపేక్షించారు. నాటి రాత్రి శ్రీ ఒడియాబాబా నాకు స్వయంగా జావ కాచి ఇచ్చారు. నేను కంట నీరు పెట్టి, 'స్వామీ, నేను మీకు సేవ చేయాల్సింది పోయి మీ చేత సేవ చేయించుకోవలసివచ్చింది. నేనెక్కడికైనా వెళ్ళిపోతాను' అన్నాను. స్వామి అనునయంగా నా కన్నీరు తుడిచి, నాకు రగ్గు కప్పి, తల, వీపు నిమిరి, 'నేను తల్లిని, నీవు బిడ్డవు, అవసరమొచ్చినప్పుడు నేను గూడా నీకు పరిచర్యలు చేయవచ్చు. ఇకముందు నీకిలాంటి బాధలుండవులే. ఎప్పుడూ నా ప్రేమను ఇలా చల్లగా అనుభవిస్తుండవచ్చులే. ఈ రోజుకు హాయిగా విశ్రాంతి తీసుకో. జరుగవలసినవన్నీ పరమదయాళువైన ఆ పరమేశ్వరుడే చూచుకుంటాడు' అని చెప్పి తమ మఠంలోపలి భాగంలో పడుకున్నారు. రోజూ తలుపులు మూసుకొని పడుకొనే వారు. ఆ రోజు అవసరమైనప్పుడు నన్ను పరామర్శించడానికి గాబోలు, తలుపులు బార్లా తెరుచుకొని పడుకున్నారు. నాకు ఆ రాత్రంతా ఒళ్ళు తెలియకుండా నిద్ర పట్టింది. మెలుకువ వచ్చేసరికి బాగా ఎండెక్కి పోయింది. ఆశ్రమమంతా జనంతో కిటకిటలాడి పోతున్నది. లేచి చూద్దునుగదా, నాటి అర్ధరాత్రి ఆ ప్రథమ శిష్యుడు స్వామిని హతమార్చి పరారయిపోయాడు. స్వామి అన్న మాటలకు అర్థం అప్పుడుగాని నాకు తెలియలేదు. అంతకుముందు ఆ దుష్టుడు ఒకటి రెండు సార్లు అలాంటి ప్రయత్నం చేసాడు. మొదటిసారి భక్తులే కనిపెట్టి అతడికి దేహశుద్ధి చేసి పంపించారు. పోలీసు ఫిర్యాదు చేస్తామని

బెదిరించి విడిచి పెట్టారు. రెండవసారి గూడ అతనిని పట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేసారు గూడా. కాని ఎవరెంత చేసినా జరుగవలసింది జరిగిపోయింది. మహాత్ములకు, సాధకులకు, యుద్ధవీరులకు ఒక్కటే ధర్మం. పట్టువిడవకుండా, వెనుతిరగకుండా స్వధర్మం ఆచరించడమొక్కటే కర్తవ్యం. ఎన్ని కష్టాలు వచ్చినా, చివరకు మృత్యువే ఎదురైనా పట్టు విడువని వారే సాధనలో సఫలులవుతారు. ఒడియాబాబా తమను రక్షించుకోవడానికి తమ శక్తిని కించిత్తుగూడ ఉపయోగించలేదు. వారి దేహం పైన వారికి ఎట్టి విలువ వుండదు. పంచభూతాలనుండి ఏర్పడే ఇతర జీవులనుండి సేవలుపొంది వృద్ధి చెందిన వారి దేహం వున్నంతవరకు సర్వ జీవులకు నిర్విరామంగా హితం చేయడమొక్కటే వారికి సార్థకత. అంతటి మహత్తరమైన వారి జీవితం యొక్క విలువను గుర్తించి మన యింటిలోని దీపంగా సంరక్షించుకోవలసింది వారి భక్తులే. దీనితో పోలిస్తే మీకు వచ్చిన కష్టము ఎంతది కనుక?'' అన్నారు శ్రీ అఖండానందస్వామి. అంతటితో ఆ వృద్ధ సన్యాసి ఎంతో ఊరట చెందాడు.

''గురుభక్తి నిశ్చల మయ్యేదెలా?'' అని అడిగాడు ఒక బ్రహ్మచారి. శ్రీ అఖండానందస్వామి, ''అదే అన్నింటికన్నా ముఖ్యమైన ప్రశ్న. మొదట చాలినంత కాలం గురువును పరిశీలించి, వారిపట్ల నిస్సందేహమైన గురుభావం ఏర్పడ్డాకనే వారిని గురువుగా స్వీకరించక తాత్కాలికమైన ఉద్రేకంలో తొందరపడి ముందుగానే స్వీకరించడం వలన అటుతర్వాత ఎన్నెన్నో సంశయాలు తలెత్తుతాయి. మాయ ఒకపట్టాన ఏ జీవినీ తన పిడికిట్లోంచి అంత సులభంగా విడిచిపెట్టదు.

దాని ప్రతిరూపమే మనలోని అహంకారం గూడ కనుక అవి రెండూ గూడా వాటినుండి తప్పుకొనే మన ప్రయత్నాన్ని సుస్థిరంగా

పోయేది. సంసారంలో జీవించేవాళ్లే తాత్కాలికమైన ఆవేశంలో గురువును, మోక్షాన్ని అన్వేషించేలా చేస్తుంది.

కాని అడుగడుగునా అతడిట్టి ప్రయత్నంలో నిలువనీయకుండా అదే అన్ని అడ్డంకులనూ కల్గిస్తుంది. మరల మరల ప్రపంచంవైపుగా ఆకర్షిస్తుంది. లేకుంటే ఎన్నెన్నో సంశయాలను కల్పిస్తూ వుంటుంది. అలాఅని ఆత్మాన్వేషణను గూడా పూర్తిగా విడిచిపెట్టనివ్వదు గూడ. పై చెప్పిన రీతిన చాలినంతగా గురువును పరిశీలించాకనే నిస్సంకోచంగా వారినాశ్రయిస్తే బాధ అంతగా వుండదు. అటు తర్వాత వెనుక తాను పరిశీలించి తెలుసుకున్నదంతా అతనికి అండగా నిలిచి మధ్యలో తలెత్తే సంశయాలను నిర్మూలిస్తూవుంటుంది. అయినప్పటికీ మాయ తన ప్రయత్నం విడిచిపెట్టదు. ఏమీ లేకుంటే తానే శిష్యోత్తముడన్న అహంకారమో లేక తాను చేసే సేవే తన గురువుకు ఆశ్రయమనో అహంకారం వుంటుంది. అలాంటివి కలగకుండా వుండాలంటే శిష్యుడుగా మనమాచరించ వలసిన ధర్మం తెలుసుకొని, దానిని రూపొందించిన మహర్షులపై అపారమైన విశ్వాసంతో దానిని తరచు తప్పకుండా పాటిస్తుండాలి. మనతో గురువెంత ప్రేమగా మసలుకున్నా మనం మాత్రం మన ధర్మం మరచిపోగూడదు. అది వారి ధర్మం, ఇది మనధర్మం. దానిని విడిస్తే వారు మహాత్ములు కారు. దీనిని విడిస్తే మనము సాధకులమూ గాము. ఒక్కసారి మనస్ఫూర్తిగా గురువును ఆశ్రయించాక ఏ కారణంగానైనా వారిపట్ల మన ధర్మాన్ని విడిచి పెట్టడం మహాపాపమవుతుంది. బిడ్డలపట్ల తనకు గల ధర్మాన్ని తల్లిదండ్రులు విడిచి పెట్టినట్లు, భర్తపట్ల భార్య తన ధర్మాన్ని విడిచి పెట్టినట్లు, ఒకసారి గురువును ఆశ్రయించాక అట్టి శిష్యుడు ఆచరించే ధర్మాలన్నీ, సాధనంతా ఆ గురుభక్తినే ఆధారంగా, పునాదిగా కలిగి

వుంటాయి. పునాది కదిలిన భవనం కూలినట్లు శిష్యుడు గురువుపట్ల తన ధర్మాన్ని అతిక్రమిస్తే అన్ని విధాలా నశిస్తాడు. అతడు ఇంకే ధర్మము ఆచరించినా ప్రయోజనముండదు. అలా అని అటు తర్వాత ధర్మాన్ని విడిచి పెట్టినా ఇతర జీవులకంటే అతడెక్కువ శిక్ష అనుభవించవలసి వుంటుంది. ధర్మం ఎరుగని పసిబిడ్డలు ఎంత తప్పు చేసినా చట్టం శిక్షించదు; ధర్మాధర్మాలు ఎరిగిన పెద్ద మనిషి ఎంత స్వల్పంగా ధర్మం తప్పినా అది పెద్ద తప్పు అవుతుంది. అతడెంతటి పెద్దమనిషయితే ఆ దోషమంత ఎక్కువగా వుంటుంది. అలానే ఆ పాప ఫలితమంతా అనుభవించేవరకూ పతితులయిన అట్టి శిష్యునికి మరలా గురుకృప లభించదు. జన్మాంతరాలలో ఏ దైవమూ, మహాత్ముడూ అతనిని కనికరించడు. స్వభావసిద్ధమైన వారి ప్రేమఆర్ద్రతలేవి వారిపట్ల విఫలమై పోతుంటుంది; అతడిలోని చెడు వాసనలకే దోహదమై మరింత పతనం కల్గిస్తుంది. హృదయపూర్వకమైన పశ్చాత్తాపంతో క్షమాభిక్ష కోరి ఆ గురువును ప్రసన్నం చేసుకుంటే గానీ ఈ ప్రమాదం తప్పదు. అందుకని ఏ మహాత్ముణ్ణీ గురువుగా ఆశ్రయించు కున్నా పర్వాలేదుగాని ఆశ్రయించాక ఇక సంశయించ గూడదు. అటు తర్వాత గురువులో ఎట్టి దోషాలు కన్పించినా అవి ఆ శిష్యునిలోని దుష్టవాసనల రూపములే, వారి ప్రారబ్ధమేనని గుర్తించి పరితాపంతో వారి కృప కోసం మరింతగా ప్రార్థించటం ఒక్కటే మార్గం. అలా చేయగల్గాలంటే ఆ మనిషి మొదటినుండి ఋషులు తెల్పిన శాస్త్రాల పట్ల అచంచలమైన విశ్వాసంతో స్వధర్మం ఆచరిస్తుండటం ఒక్కటే మార్గం.''

ఇలా ఇంకెందరో మరికొన్ని ప్రశ్నలు వేస్తే స్వామి సమాధానం చెప్పారు. నేను గూడా కొన్ని ప్రశ్నలు అడుగుదామనుకున్నాను గాని

సాధువులకు మాత్రమే అట్టి అవకాశము వున్నదేమోనన్న సంకోచం వలన, నాకు హిందీ సరిగ్గా రాకపోవడం వలన అడగలేకపోయాము. అక్కడ వున్న వారందరిలో మొదటి రోజు నాతో మాట్లాడిన సన్యాసికి తప్ప మరెవరికీ ఇంగ్లీషు వచ్చినట్లు లేదు. సద్గోష్ఠి సుమారు 2 గంllలు నడచింది. గోష్ఠి పూర్తవగానే స్వామి 'హరిఓం తత్సత్' అని నమస్కరించి అందరితో 'రామ్ రామ్' అని చెప్పారు. తర్వాత ఒక్కొక్కరే లేచి స్వామికి నమస్కారం చేసుకొని బయటకు వెళ్ళిపోతున్నారు. స్వామి ఒక సోఫాలో కూర్చొని వున్నారు. క్రిందమున్న ఒక పీట మీద దిండు వేస్తే దానిపై వారి పాదాలు పెట్టుకున్నారు. ఒక్కొక్కరు నమస్కరించుకుంటుంటే తన మోకాలు మీద వుంచుకున్న కుడిచేతి మధ్యవేలుతో భక్తుల శిరస్సులను తాకి ఆశీర్వదిస్తున్నారు. నేను అందరికంటే చివరికి నమస్కరించుకోదలచాను. కారణం అలా చేస్తే వారిని మరికొంత సేపు చూస్తూ కూర్చోవచ్చుని, కానీ అది వీలుపడలేదు. ఆశ్రమసేవకులలో ఒక బ్రహ్మచారి అది పడనివ్వలేదు. నా వంతు వచ్చేలోగా మనస్సులో నేను, 'బాబా, వీరి ఆశీర్వచనమైనా నాకు ప్రత్యేకంగా లభిస్తేనే శిరిడీలో వున్న మీ ప్రభావం ఇక్కడగూడ పని చేస్తుందని నాకు గుర్తు' అని సాయిని స్మరిస్తున్నాను. అందరూ అయ్యాక ఆ సేవకుడు ఆయనకు నమస్కరించుకొనక నన్ను ముందు నమస్కారం చేసుకోమని సైగచేసాడు. నేను సాష్టాంగ నమస్కారం ఇంకా చేస్తూనే వుండగా స్వామి తటాలున సోఫాలో నుండి లేచి, పీట ప్రక్కకు దిగి, నా తల ప్రక్కనే నిలబడి, క్రిందకు వంగి నా తల పైనుండి వెన్ను వరకు మూడుసార్లు నిమిరి 'అచ్ఛాబేటా, ఉఠో, ఉఠో' అన్నారు. సరిగ్గా ఆసమయంలో నాకు బాహ్యస్పృహతప్పిపోతున్నది. అలానేవుంటే ఏమయ్యేదో గాని స్వామి తట్టి నన్ను లెమ్మని

చెప్పి మేల్కొలిపారు. నేను లేచి నిలబడి నమస్కరిస్తూ వారికేసి చూసే సరికి ఆయన నవ్వుతూ నా కళ్ళలోకి చూచి నా బుగ్గమీద చరిచి, 'బహుత్ మీఠా హై' అని వెనుకకు తిరిగి వెళ్ళిపోయారు. నేనక్కడే మరి కొద్దిసేపు నిలబడి నాకు కలిగిన సంతోషాన్ని మనస్సులోనే స్మరించుకుంటున్నాను. స్వామి నన్ను ప్రత్యేకించి ఆశీర్వదించడంతో అంతకు ముందు లేచి బయటకు వెళ్ళినవారు, బయట నిల్చొని వున్నవారూ నాకేసి చూస్తూ నిలబడిపోయారు. ఒకరితో ఒకరు ఏమేమో చెప్పుకుంటున్నారు. నేను మాత్రం నాకు జరిగినది తల్చుకుంటూ అక్కడే నిలబడిపోయాను. భాగవత ప్రవచనానికి బయల్దేరుతూ స్వామి మరలా భాగవతమందిరంలోనికి వచ్చి అక్కడ ప్రతిష్ఠించబడిన భాగవత గ్రంథానికి, అక్కడ వున్న అందమైన శ్రీ కృష్ణుని పటానికి నమస్కరించి లేస్తూనే నన్ను చూచి హిందీలో, 'నీవింకా ఇక్కడే వున్నావా?' అంటూ మరలా నా బుగ్గమీద కొట్టారు. నేనక్కడే నిలబడడం చూచి, 'అలా నిలబడకు, భాగవత శ్రవణానికి పద!' అని నా జబ్బ పట్టుకొని మందిరంలో నుండి బయటకు లాగుకొనివచ్చి, నా అరచేయి ప్రేమగా నొక్కి గబగబా శ్రీ ఆనందమాయి కుటీరం వైపుకు వెళ్ళిపోయారు. అంతటితో అక్కడ నిలబడి చూస్తున్న ప్రజలలో కలకలం చెలరేగింది. ఎదుట షామియానా క్రింద కూర్చున్న వారిలో గూడా కొందరు లేచివచ్చి నా చుట్టూ గుంపుగా చేరారు. ఒక్కొక్కరూ నాకు చేతులు జోడించి 'మీఠాబాబా, మీరెక్కడినుండి వచ్చారు?' అని ఒకరంటే, 'మీకు స్వామి ఇదివరకే పరిచయమా!' అని ఒకరన్నారు. నేనొకప్రక్క వారికి జవాబు చెబుతుంటే ఒకరు నా నుదుట చందనమద్దారు. మరి కొందరు నా మెడలో మాలలు వేసారు. ఒకరు కలకండ నోట్లో పెట్టారు. వారిలో

ఒడ్డున మేము కట్టించిన కుటీరంలో హాయిగా వుండవచ్చు అంటే మరికొందరు, తాము కట్టించిన కుటీరం ఇంకా వసతిగా వుంటుందని అంటున్నారు. నేనక్కడ వుండటానికి, తపస్సు చేసుకోవడానికి రాలేదని, సప్తాహం అవగానే స్వస్థానానికి వెళ్ళిపోతాననీ వచ్చీరాని హిందీలోనే చెప్పాను. అలా చెప్పగానే వారిలో కొద్దిమందికి నాపై ఏర్పరుచుకున్న భావం మారినట్లు వున్నది. వారు నాకేసి మౌనంగా చూస్తూ వుండిపోయారు. 'ఇంతటి స్వామి ఆశీర్వచనం లభించాక గూడ మరల ఇంటికి వెళ్ళిపోతావా?' అని మందలిస్తున్నట్లున్నాయి వారి చూపులు. కొందరు మాత్రం తమ వైఖరి మార్చుకొనక, 'ముందెప్పుడైనా ఈ క్షేత్రానికి తపస్సుకై వస్తే మా కుటీరంలోనే వుండాలి' అంటూ తమ చిరునామాలు ముద్రించివున్న చిన్నకార్డులు నా చేతిలోను, జేబులోనూ పెట్టారు. మీరు వాళ్ళు నిర్మించిన ఏ కుటీరంలోవున్నా భిక్ష మాత్రం మేము పంపుతాము అని ఒకరు, ఉదయమే పాలు మేము పంపుతాము అని మరొకరూ అంటు న్నారు. నేను 'చూద్దాం లెండి' అంటూ వేదిక మీదకు వస్తున్న శ్రీ ఆనందమాయి, శ్రీ అఖండానందులను చూపి, నేను గూడా షామియానాలో కూర్చోడానికి బయల్దేరడంతో ఆ కలకలం తగ్గి భక్తులందరూ వారివారి స్థానాలలో కూర్చున్నారు.

ప్రవచనం రోజులాగానే సాగింది. శ్రీ ఆనందమాయి దర్శనం అలా ఆమె వేదిక పైకి వచ్చి కూర్చున్న సమయంలో మాత్రమే లభిస్తున్నది. విడిగా ఆమె దర్శనం దొరకడం లేదు. సాయంత్రం పూట ప్రవచనమయ్యాక భక్తులందరూ వెళ్ళిపోయేముందు ఆమె మౌనంగా అందరినీ చూచి ఆశీర్వదించి తమ గుడారంలోకి వెళ్ళిపోతారు. ఈ

విషయం నాకు కొంచెం బాధ కలిగించింది. నేను పెట్టుకున్న ఆశలు నెరవేరేలా లేవు. కొంతసేపు మనసారా అమ్మ దర్శనం చేసుకుంటూ కూర్చున్నాక అంతకుముందు భక్తులు నాపై కురిపించిన ఆదరణ గురించి ఆలోచించాను.

అఖండానందస్వామి నన్ను ఆశీర్వదించక ముందు ఆ క్షేత్రంలో నా ముఖం చూసిన వాడే లేడు. అన్నం తిన్నానో లేదో, నేను ఎక్కడ రాత్రి నిద్రించానో అడిగినవాడే లేడు. ఈ ఆదరణంతా స్వామి ఆశీర్వచనం యొక్క పర్యవసానమే. కాని దానికి కారణం నేను సాయిని స్మరించడమేనా అన్న ప్రశ్న మిగిలిపోయింది. సాయంత్రమయ్యాక గదా దాని సంగతి తేలేది అని సాయికి చెప్పుకున్నాను. రాత్రికి గూడ నాకు భోజనము, వసతి లభించకపోతే ఇప్పుడు ఈ భక్తులు వలకపోసిన ఆప్యాయతంతా కేవలం కాకతాళీయమే అవుతుంది అనుకున్నాను. రోజూలాగే మధ్యాహ్నానికి ప్రవచనం ముగిసింది. ఆకలి దహించుకు పోతుంటే బిస్కెట్లు, టీలతో కడుపు నింపుకోడానికి గేటు బయటకు వచ్చాను. వాటిని తల్చుకుంటే వెగటనిపిస్తున్నది. అలాగే పోయి ఆ స్టాల్‌ముందు కూర్చొని టీ, బిస్కెట్లు ఇవ్వమని ఆ స్టాల్‌వానిని అడిగాను. వెంటనే ఆ ప్రక్కనున్న వ్యక్తి వారించి, 'మీకు భిక్ష మా ఇంటి నుండి వస్తున్నది. ఆలస్యమేమీ లేదు' అని చెప్పాడు. మరికొద్ది నిమిషాలలో సైకిల్ మీద ఒక కుర్రవాడు, రొట్టెలు, కూర మిఠాయి కట్టుకొని తెచ్చాడు. మరొక గ్లాసు నిండా పాలు పోసాడు. అది ముగ్గురికి సరిపడావుంది. నన్ను మూడుపూటలు పస్తుంచి, డొక్కమాడ్చి, ఇప్పుడు ఆవారా ఈవారా ఇంత భోజనం పంపారా?'

అని బాబాతో నిష్ఠూరంగా అనుకొని కొంచెంగా తిన్నాను. ఆ భక్తుడు నేను అంతకొంచెం తినడం చూచి పకపకా నవ్వి, మిగిలినదంతా

ఆకలిగా తిన్నాను. సాయంత్రం గూడా తనయింట నుండి భిక్ష ఏర్పాటు చేస్తానని, త్వరపడి బిస్కెట్లవంటివి తినవద్దనీ ఆ భక్తుడు కోరాడు. నా వసతి సంగతి అతడికి తట్టినట్టేలేదు. మొదట నేను అడుగుదామనుకున్నాను గాని ఇంత దూరదేశంలో గూడా సాయి ప్రభావం వుంటుందో లేదో చూడదలచి అడగలేదు. తర్వాత 'బీడీగాని, సిగరెట్టుగాని, హుక్కాగాని త్రాగుతారా?' అని అతడు అడిగాడు. నాకు అలవాటు లేదని చెబితే అతడు నవ్వి నా చేతిలో కొంచెం సోపు గింజలు, ఒక పాను వుంచాడు. తర్వాత నేనొక చెట్టు క్రింద తువ్వాలు పరుచుకొని అక్కడ కొన్న ఒక పుస్తకం చదువుకున్నాను. మధ్యాహ్న ప్రవచనం గూడా యథావిధిగా పూర్తయింది. నేను లేచి గేటు బయటకు వచ్చేసరికి పదిమంది నాచుట్టూ గుమిగూడి రాత్రి భిక్షకు తమ ఇంటికే రమ్మంటే తమ ఇంటికి రమ్మనమని కొర్దిసేపు పోటీబడ్డారు. భిక్షకు ఒకరింటికి వెళితే, నిద్రకు తమ ఇంటికి రమ్మనమని మరికొందరు పోటీబడ్డారు. నేను ఎవరి ఆహ్వానం అంగీకరించాలో తెలియక వాళ్ళ మాటల హోరు భరించలేక చెవులు మూసుకున్నాను. వాళ్ళెంతో భక్తి శ్రద్ధలతో నన్నొక్కణ్ణే విడిచిపెట్టి దూరంగా వెళ్ళి, ఒక అరగంట చర్చించుకున్నారు. చివరికి ఇద్దరు మనుష్యులను సైకిల్ మీద గ్రామానికి పంపారు. మరికొంతసేపటికి ఊరిలో నుండి ఒక ఎద్దు బండి వచ్చింది. నన్ను దానిపై ఒక నరసింహస్వామి ఆలయానికి తీసుకు వెళ్ళారు. అక్కడ మంచం మీద ఎత్తుగా పరుపులు, రగ్గులు, దాని ప్రక్కనే ఒక పీట అమర్చారు. నన్ను దానిపై కూర్చోబెట్టాక నాకు ఒకరు రగ్గు కప్పారు. ఇంతలో ఆ ప్రక్క ఇంటి నుండి కుంపటి నిండా నిప్పులు తెచ్చి, చలికాచుకోవడానికి మంచం ప్రక్కనే పెట్టారు. మరొక ప్రక్కన త్రాగడానికి వేడినీళ్ళు

పెట్టారు. కొద్దిమంది నా మెడలో మాలలు వేసారు. ఒకరు నుదుట బొట్టు పెడితే మరొకరు నా పాదాలకు, చేతులకు గంధం పూసారు. తర్వాత జయహరిరామ్, జయశ్రీరామ్ అని కొద్దిసేపు భజన చేసారు. ఇంతలో దాదాపు పదిహేను ఇరవై పళ్ళాల నిండా రొట్టెలు, కూరలు, మధుర పదార్థాలు, పాలు తెచ్చిపెట్టారు. అవన్నీ పెట్టేందుకు బల్లమీద చోటు చాలక పోయేసరికి ఒక పెద్ద జమఖానా వంటిది ఆ ప్రక్కనే నేలమీద వేసి గోడ వెంబడే ఆసనంగా మడిచిన ఒక రగ్గు వుంచారు. నన్ను దానిమీద కూర్చోబెట్టి ఆ పళ్ళాలు నా ఎదుటపెట్టి నమస్కరించారు. వాటిలో ఎవరు తెచ్చినవి తీసుకుంటావోనని ఎంతో ఆత్రంగా కొద్ది ని॥లు చూస్తూ నుంచున్నారు. నేను ఏది తీసుకోవాలో తెలియక వారికేసి చూస్తూ కూర్చున్నాను. నేను తింటుంటే ఎవరూ చూడ గూడదనుకున్నారేమో; ఒక భక్తుడు వారందరినీ బయటకు పంపివేసి, 'బాబా, మీరు ప్రశాంతంగా భోజనం చేయండి. నేనిక్కడే వాకిట్లో కూర్చుంటాను. తమకేదైనా కావాలంటే పిలవండి' అని చెప్పాడు. ఆ భోజనమంతా ఏమి చేయాలో అర్థం కాలేదు. 'ఇక్కడ సాధువులెవరైనా వున్నారా?' అన్నాను. అతడు వున్నారని చెప్పి గబగబా గేటు బయటకు వెళ్ళి ఆ దగ్గరలో అరుగులు మీద కూర్చున్న కొందరు సాధువులను పిలుచుకు వచ్చాడు. అందరమూ కూర్చొని భోజనం చేసాము. తర్వాత అందరూ కొద్దిసేపు భజన చేసి వెళ్ళిపోయారు. తర్వాత ఆ భక్తుడొక్కడూ నాకు తోడుగా ఒక రగ్గు కప్పుకొని పడుకొని ఆ ఆలయం అహోబిలం మఠం వారిదని చెప్పాడు. ఇంతలో ఒక భక్తుడువచ్చి ఒక బీడీ కట్ట, సిగరెట్టుపెట్టె, అగ్గిపెట్టె, నాలుగైదు కిళ్ళీలు తెచ్చి అక్కడుంచాడు. నాకు వద్దని చెబుతుంటే, నాకు తోడుగావున్న వ్యక్తి నన్ను మాట్లాడవద్దని సైగ చేసాడు. రెండోవ్యక్తి వెళ్ళిపోగానే

కొని మిగిలినవన్నీ జేబులో వేసుకున్నాడు. తర్వాత మేము పడుకోగానే సాయి కృప ఆ దూరదేశంలో గూడా ఎంతగా పనిచేస్తుందో తెలుసుకున్నాము. ముందటి రోజు గూడ సాయిని నిష్ఠూరాలాడినందుకు సిగ్గుపడ్డాను. నిజానికి చెట్టుక్రింద, ఆలయంలోను నివసించడం సాధుధర్మమని గుర్తుకురాగానే సాయి చూపిన అనుగ్రహం అర్థం చేసుకోగల వివేకం గూడా నాకు లేదని స్పష్టమయింది. భిక్షాభోజనంతో సాయి నన్ను ఎంతగా అనుగ్రహించారో అర్థమయింది. శిరిడీని, ద్వారకామాయిని తలుచుకుంటూ నిద్రపోయాను.

మరుసటి ఉదయమే నది వద్దకు వెళ్ళి కాలకృత్యాలు తీర్చుకొని, నిత్యమూ శ్రీ అఖండానందస్వామి చేస్తున్న సద్గోష్ఠికి హాజరయ్యాము. ఆ రోజు గూడ వారిని ఎందరెందరో ఎన్నో ప్రశ్నలు వేశారు. ఒకరు, ''ఆధ్యాత్మిక జీవనానికి, మా ప్రాపంచిక జీవితానికీ పొత్తు ఎలా కుదురుతుంది?'' అని అడిగారు. స్వామి, ''ఎందుకు కుదరదు, కుదురుతుంది. అలాగాకుంటే, ఆధ్యాత్మ విద్యను బోధించిన ఋషులే గృహస్థాశ్రమాన్ని, స్వధర్మాచరణను ఎందుకు విధించి ప్రశంసించారు? భగవంతుని లీలా శ్రవణము, చింతనము, నామస్మరణ చేయడము, మన విద్యుక్తధర్మాలు, సాంసారికమైన బాధ్యతలు నిర్దుష్టంగా నిర్వర్తించుకోవడము - వీటిలోనే మన కాలమంతా ఇమిడి పోయేలా చూచుకోవాలి. ఎవరితోనైనా మాటాడవలసివస్తే సాధ్యమైనంతవరకూ ఏదో ఒకరీతిన మానవ జీవిత పరమావధి, దానిని పొందడానికి ఆలంబనమైన భగవంతుని లీలలు లేక నిత్య జీవితంలో వివేకంతో రాగద్వేషాలను తొలగించుకుని స్వధర్మమాచరించడం గురించి మాట్లాడాలి. మొదటిది ముముక్షు

త్యాగం, రెండవది భక్తి, మూడవది మనిక వైరాగ్యాలతో ''సాధన
నిర్దుష్టమైన ధర్మాచరణకూ దోహదం చేస్తాయి. అలాచేస్తే సంసారులు గూడ గొప్ప సాధకులే అవుతారు'' అని చెప్పారు. తర్వాత ఎవరో భగవదవతారాల తత్త్వం గురించి స్వామినడిగిన తర్వాత, నేను గూడ కొద్ది చొరవ తీసుకుని వచ్చీరాని హిందీతో ఆంగ్లపదాలు కలిపి ఒక ప్రశ్నవేశాను, ''అధర్మం పెచ్చు పెరిగిపోయినప్పుడు దానిని నశింపజేయడానికి భగవంతుడవతరిస్తానన్నాడు గదా, నేటి ప్రపంచ మింత కుళ్ళిపోయినా ఆయనింకా అవతరించడేమి!'' అన్నాను. ఆయన నావంక ఎంతో వాత్సల్యంతో చూచి, నా ఆవేదన గ్రహించి పకపకా నవ్వుతూ, ''ఆయన శిష్టులనూ, ధర్మాన్నీ రక్షించడానికి గూడ అవతరిస్తానన్నారుగదా! ఈ రోజుల్లో అలా రక్షించదగిన వారెక్కువ మంది భూమిమీద లేరేమో! ఈనాడే ఆయన అవతరిస్తే భూమి మొత్తాన్నీ హారతి కర్పూరంలా దహించక తప్పదని గాబోలు ఆయన అవతరించలేదు. నీ-నా వంటి కొందరికి ఇట్టి ఆవేదన కలిగిస్తున్నాడు గదా! ఆ దివ్యప్రేరణకు ఆత్మార్పణం చేసుకొని సద్ధర్మాన్ని పాటిస్తూ సాటివారిని మలచుకుంటూ పోవాలి. ఇలా మరికొందరు శిష్టులైతే నైనా వారిని రక్షించడానికి భగవంతుడు తప్పక అవతరిస్తాడు. నేను అలానే చేస్తున్నాను, నీవూ అలానే చేయి. ప్రపంచాన్ని విడిచి మేము కొందరం చేస్తుంటే, ప్రపంచంలో వుంటూనే నీలాంటి మరికొందరు ఇలా చేయాలి. అదెంతో కష్టమే, సాక్షాత్తూ ముళ్ళబాటే, సందేహంలేదు. కాని ఆయన అవతరించాలంటే ఇలాంటి కఠోర తపస్సు మనం చేయక తప్పదు'' అంటూ నా చెవి పట్టుకొని ప్రేమగా దగ్గరకు లాక్కొని చెంపమీద తట్టారు. భక్తులలో అంతకు ముందు ఆయన నన్నాశీర్వదించినపుడు చెలరేగిన దానికంటే గూడ ఎక్కువ సంచలనం చెలరేగింది. తర్వాత భాగవత ప్రవచనం జరుగు

తున్నప్పుడు గూడ సందర్భానుసారం నాలుగైదుసార్లు నేనానాటి సద్గోష్ఠిలో అలా ప్రశ్నించడం గురించి స్వామి ప్రస్తావించడంతో అందరూ నాకేసి ప్రత్యేకించి చూడడమారంభించారు.

అప్పుడు నాకున్న ఆలోచనలు రెండే : ముందటి రాత్రి ఆలయంలో నాకు విందు చేసిన సాయి, నాటి మధ్యాహ్నం భోజన మెలా పెడతారో చూడాలన్నది ఒకటి; ఇంతదూరం వచ్చి ఇన్ని రోజులున్నా, ఇతర మహాత్ములను దర్శించినప్పటిలాగ ఆనందమాయి అమ్మ నన్నేమీ ప్రత్యేకించి ఆదరించలేదేమన్నది రెండవది. ఈ ఆలోచనలతో నాలో అశాంతి రేకెత్తిందేమో, నాటి ప్రవచనం పూర్తి గావడానికి కొంచెం ముందుగా లేచి, జనం దృష్టి నుండి తప్పుకోవాలని ఆశ్రమం చుట్టూరా తిరిగి, వెనుకవైపు చెట్లలోకి వెళ్ళాను. ప్రవచన మవగానే కొందరు భక్తులు గబగబాలేచి బయటకు వెళ్ళి నా కోసం గాలించారు. వాళ్ళు ఒకరితో ఒకరు, ''వెళ్ళిపోయాడు'' అను కోవడం గాలివాలుకు స్పష్టంగా వినబడింది. ఆనందమాయి అచటి కుటీరంలోనికి వెళ్ళడం చూచాను. అప్పుడిక ఆ భోజనం సంగతి గూడ నాకు పట్టలేదు. ఎలాగైనా అమ్మను కొద్దిసేపైనా విడిగా చూడాలని ఆరాటం కలిగింది. ఎక్కడ నుంచి కిటికీ గుండా అమ్మ బాగా కనిపిస్తారో చూచుకొని ఆ దిక్కున దూరంగా చెట్టుక్రింద కూర్చుని ఆమెను చూస్తున్నాను. కాని చూచిన కొద్దీ తృప్తిలేదు సరిగదా సాయి నాకలాంటి అవకాశం ఎందుకు కల్పించడం లేదు; ఈమె ముందు ఆయన అశక్తుడా? అన్న చికాకు మొదలైంది. వెంటనే అమ్మ కిటికీలోంచి తదేకంగా నాకేసి చూచి ఎవరితోనో ఏమో చెప్పారు. వారు మధ్యలో వున్న కంచెవద్దకు వచ్చి నన్ను అమ్మ పిలుస్తున్నారని చెప్పారు.

[illegible] కాని లీరా ఆమె గదిలో ప్రవేశించే సమయానికి నన్ను అంతవరకూ ఆమె అలా ఆశ్రయము, ఆహారము గూడ పెట్టకుండా వుంచినందుకు నా హృదయంలో అక్కసు చెలరేగింది. ఆమెతో తగువు పెట్టుకోవా లనిపించింది. ఎలాగో నిగ్రహించుకుని లాంఛనంగా నమస్కరించి ఆమె ముందు నిల్చున్నాను. 'నీవెవరు? ఎక్కడి నుంచి వచ్చావు?'' అని మొదట బెంగాలీలోనూ, తర్వాత హిందీలోనూ అమ్మ అడిగారు. నా వేషం చూచి గాబోలు ఆమె ఫక్కున నవ్వారు. నన్నలా కించపరచి ఆమె సంతోషిస్తోందని, అది సాయికి సిగ్గుచేటనీ బలంగాతోచి, కొంచెం దూకుడుగానే నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

అమ్మ, 'నీ విడిది ఎక్కడ?'

నేను, ''చెట్టుక్రింద'.

అమ్మ, ''భోజనమెక్కడ చేస్తున్నావు?''

నేను, ''గేటు బయట హోటల్లో టీ-బిస్కట్లతో కడుపు నింపుకుంటున్నాను. అంతటి ఆదరణకు కృతజ్ఞుడను'' చెప్పాను. ఒక్కసారిగా అమ్మ ముఖం చిట్లించి మొదటి రోజు నాతో మాట్లాడిన సన్యాసినే పిలిచి, ఈ బాబుకు మనతోపాటే ఆశ్రమంలో భోజనము, ఒక ప్రక్క వుండడానికి గుడారము ఇప్పించు'' అని కొంచెం కఠిన మైన స్వరంతో హెచ్చరించారు. నేను దీక్ష తీసుకొనని పరదేశీయుడనని, ఆహ్వానం లేకుండానే వచ్చాననీ, ఆ విషయం ముందుగా ఒక్క మాటైనా వ్రాయలేదనీ ఆ సన్యాసి ఆమెతో చెబుతూంటే, ఎలాగైనా తన మాట నిలబెట్టుకోవాలన్న పంతము, దాని వెనుక ప్రాంతీయ భావము స్పష్టంగా తెలుస్తున్నాయి. చివరికతడు నా కేసి చికాకుగా చూస్తూ, ''చూడు, అమ్మకెంత ఇబ్బంది, బాధ కలిగిస్తున్నావో!'' అని

నాతో అన్నాడు. నేను మొహమాటపడి నాకెట్టి వసతులూ అవసరంలేదని చెప్పాలని అతడి భావం. కాని నేను వసతి కోరుతున్నది బాబాను, అమ్మను. మధ్యలో ఇతని గోలేమిటి' అనుకొని నేను చూస్తూ ఊరుకున్నాను. ఈ సారి అమ్మ అతనిని నోరు మూసు కొమ్మని సైగచేసి, చెప్పినట్లు చెయ్యమన్నారు. అతడు నాకేసి కొరకొరా చూస్తూ వెళ్ళిపోయాడు. ఇక అమ్మదగ్గర కూర్చుందామను కుంటుండగా అందరితోపాటు నన్నుగూడ భోజనాలకు పిలిచారు. అంతవరకూ అమ్మ బెంగాలీలో మాట్లాడుతూంటే అక్కడున్న ఒక బ్రహ్మచారిణి మా ఇద్దరికీ మధ్య అనువాదకురాలిగా సాయం చేసింది. అందువలన, తర్వాత ఆ వృద్ధ సన్యాసి సణుగుడు వలన నాకు అమ్మ సన్నిధిలో కొద్దిసేపుండే అవకాశం కలిగింది. సాయిలీల అమ్మ విష యంలో గూడ అలా నిరూపణ గావడంతో నాకు తనివి తీరిపోయింది. సంతోషంగా వెళ్ళి భోజనం చేసి వచ్చేలోగా ఆశ్రమానికి కొద్దిదూరంలో వరి ఒడ్డునే ప్రత్యేకంగా నాకొక గుడారము వేయించి ఇచ్చారు. నాటి మధ్యాహ్నం గూడ ఒకరిద్దరు సాధువులతో మాట్లాడి మధ్యాహ్నం ప్రవచనమయ్యాక సామూహికంగా అమ్మ ఇచ్చిన దర్శనం చేసుకొని నేను కుటీరానికి బయలుదేరడంతో గ్రామస్థులు అసలు విషయం తెలిసి ఎంతో అసంతృప్తి చెందారు. నాటినుండి వారందరూ ఒక స్థాయికి చెందినట్లు, నేనేమో చనువుగా వ్యవహరించదగనట్టి సాధుకూటమికి చెందినవాణ్ణిగానూ తలచి దూరం నుంచే నమస్కరించి పోసాగారు. అప్పటినుండి సప్తాహమంతా నాకు ప్రశాంతంగా గడిచిపోయింది.

కాకుంటే చివరిరోజు ప్రవచనంలో శ్రీ అఖండానందస్వామి, "ముక్తి సాధించుకోడానికి సశరీరుడైన గురువు అవసరమనీ, సమాధి చెందినవారు ఎంత గొప్పవారైనా మన కార్యాలు నెరవేర్చవచ్చేమోగాని

ఆత్మజ్ఞానం ప్రసాదించలేరు'' అని పదేపదే చెప్పారు. అది సాయి విషయంలో నాకొక సంశయాన్ని కలిగించింది. నాటి రాత్రి సంతర్పణ అవగానే శ్రీ అఖండానందస్వామి, శ్రీ హరిబాబా, అమ్మవద్ద సెలవు తీసుకొని కారులో వెంటనే వెళ్ళిపోవడంతో నాకు వారితో చర్చించే అవకాశం కలుగలేదు.

మరురోజు తెల్లవారగానే అమ్మవద్ద దీక్ష తీసుకున్న కొద్దిమంది తప్పిస్తే మిగిలిన వారందరూ తిరుగు ప్రయాణమవుతున్నారు. నాకొక పెద్ద సందేహమెదురైంది. నేను గూడా అమ్మవద్ద సెలవు తీసుకొని వెళ్ళిపోకుంటే ఆమె సపరివారంగా వెళ్ళిపోయాక అక్కడ నాకెవరూ తోడుండరు; అలా అని ముందుగా బయల్దేరి వెళ్తే అక్కడ నుండి బయల్దేరేముందు అమ్మ అందరినీ ఆశీర్వదించి ప్రసాదమిచ్చే అవకాశముంటే అది నాకు లభించదు. కొద్దిసేపు మనస్సు అటూ ఇటూ ఊగిసలాడింది. దానికి తోడు అమ్మ దగ్గర మరలా ప్రత్యేకంగా దర్శనం, ఆమె సన్నిధి ఒక్కరోజైనా నాకు లభించకుండానే నేను తిరిగి వచ్చేస్తున్నానన్న వెలితి నన్ను బాగా బాధిస్తున్నది. చివరకు దిక్కుతోచక బాబాను స్మరించి, ''అమ్మ తనకై తానే నన్ను పిలిచి ప్రసాదమిస్తే నేను వెంటనే బయల్దేరమని మీ ఆదేశమైనట్లు తలుస్తాను. లేకుంటే అమ్మ వెళ్ళిపోయేదాకా వుండమని మీరు ఆదేశించినట్లు తలుస్తాను,'' అనుకుంటూ కూర్చున్నాను. శిరిడీలో వాతావరణానికీ నైమిశారణ్యం లోని సన్నిధికీ బాహ్యంగా వున్న వ్యత్యాసం గుర్తిస్తూ బాబాను స్మరించు కుంటున్నాను. కొద్ది నిమిషాలలో అమ్మ నన్ను పిలిపించారు. నేను వెళ్ళి నమస్కరించగా ఆమె ప్రేమగా నా కళ్ళలోకి చూస్తూ, నా చేతిలో రవ్వకేసరి ప్రసాదం వేసారు. అంతటితో నా కర్తవ్యం స్పష్టమై మనసులో బరువు కొంత తగ్గింది. ప్రసాదం కళ్ళకద్దుకుని అమ్మకు సెలవు

చెప్పుకుని వెనుకకు తిరుగగానే ఆమె హిందీలో, "ఏమయ్యా! నీకు కావలసిందేమిటి?" అని మరుక్షణమే తన మాట సర్దుకుంటూ, "నీకేం కావాలి?" అన్నారు. ముక్తి లేక జ్ఞానము కావాలని కోరితే ఆమె ఆశీర్వదిస్తారు. కాని అది ఫలించేది ఎన్నడో ఎవరికి తెలుసు? అనుకుని, నేనామెను మరల దర్శించుకోలేను గదా! అని గుర్తురాగానే నేను వెనక్కు తిరిగి, 'అమ్మా, మీ దర్శనం నాకు మరొక్కసారి కావాలి' అన్నాను. అమ్మ ఒక్క క్షణం ఆలోచనగా నాకేసి చూచి, 'మంచిది, అలాగే లభిస్తుందిలే పో!' అన్నారు. నేను వెంటనే బయల్దేరి స్టేషనుకు వెళ్తున్న మరికొందరితో కలిసి బండిలో రైల్వేస్టేషను చేరుకున్నాను. చివరి రెండు మూడురోజులూ ఆ గ్రామస్థులకూ, నాకూ అనుబంధం తగ్గిపోవడం వలన నాకు వాళ్ళెక్కడా కనిపించలేదు. నావరకూ నాకు అమ్మ ఆశీర్వచనం ఫలించే అవకాశమే కనిపించలేదు. అప్పట్లో అమ్మ వయస్సు సుమారు 85 సం॥ లు; మరలా ఆమె ఎక్కడా స్థిరంగా ఒకచోట వుండబోయేదీ లేదు; నిరుద్యోగిగా వున్న నేను త్వరలో ఇంతదూరం వచ్చే అవకాశమూ లేదు, కనుక ఆమె ఆశీర్వచనం ఎంతవరకూ ఫలిస్తుందో చూడాలనుకున్నాను.

నేను తిరిగి జిల్లెళ్ళమూడి చేరాను. కాలచక్రం గిర్రున తిరిగి వచ్చింది. నేనెందుకు ఉద్యోగం విడిచి అక్కడకు వెళ్ళానో అది నెరవేరక పోయేసరికి నేను మరల విద్యానగర్‌లో (నెల్లూరు జిల్లా) ఆంగ్లోపాధ్యాయుడుగా చేరాను. క్రమంగా అక్కడ నిత్యమూ సత్సంగము, సద్గ్రంథపారాయణ, అవకాశము చిక్కినప్పుడల్లా మహాత్ముల దర్శనము, శిరిడీ మొ॥వ క్షేత్రాలు దర్శిస్తూండటంతో కాలమెంతో మధురంగా గడచిపోతున్నది. ఇలా కొద్దికాలం గడిచాక ఒకనాడు హైద్రాబాద్‌లో నా దగ్గర చదువుకున్న ఒక పాత విద్యార్థి వచ్చి తాను గృహస్థుడుగా

పూనేలో వుంటున్నానని, శిరిడీ వచ్చినప్పుడు తన ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించమనీ ఎంతో ప్రేమతో ఆహ్వానించాడు. నిజానికి నేనా రోజులలో ఏ స్నేహితులను, బంధువులను, చివరకు విజయవాడలో ఒంటరిగా వుంటున్న మా తండ్రిగారిని గూడ చూడటానికి వెళ్ళేవాడినికాను. కారణం ఏనాటికైనా సన్యసించి దేశమంతా సంచరించాలని, చివరకు ఎక్కడో ఏకాంత స్థలంలో భగవత్ధ్యానం చేస్తూ జీవితశేషం గడిపి ప్రశాంతంగా శరీరం విడిచిపెట్టడం ఒక్కటే నా ధ్యేయంగా వుండేది. కానీ అదంతా ఆ పాత విద్యార్థితో ఏకరువు పెట్టి ఎప్పుడో గాని మరలా కలుసుకోని అతని ఆత్మీయతను, ఆదరణను కించపరచదల్చక అతడితో మొహ మాటానికి మాత్రమే పూనా వస్తానని చెప్పాను. కొంతకాలానికి శిరిడీలో ఒక వారం రోజులు నిత్యమూ సాయి సమాధికి 108 ప్రదక్షిణలు, చరిత్ర పారాయణ చేస్తూవుండి, విరామ సమయమంతా నాటి సజీవులుగావున్న ప్రత్యక్ష సాయి సేవకుల నుండి శ్రీ సాయిబాబాకు సంబంధించిన వివరాలు, వారి అనుభవాలు సేకరించదలచాను. ఆప్రకారమే శిరిడీ వెళ్ళి రెండవ రోజు నుండి నా కార్యక్రమం ప్రారంభించాను. ఆరోజంతా ఎంతో అమోఘమైన ధ్యానపారవశ్యంలో గడిచిపోయింది. కాని అదేమి చిత్రమో, మరురోజు తెల్లవారుతూనే మొదట పూనాలో నివసిస్తున్న ఆ పాత విద్యార్థి గుర్తుకొచ్చి నా మనస్సు చెప్పలేనంత బలంగా అతని దగ్గరకు వెళ్ళాలని ఆరాటపడసాగింది. ఎన్ని విధాల ప్రయత్నించినా అది సమాధానపడలేదు. దాని వలన శిరిడీలోవున్న సమయమంతా

వికల్పాలతో వ్యర్థం కాసాగింది. అంతకంటె ఒక్కసారి పూనా వెళ్ళి ఆ గుంజాటన వదిలించుకొని తర్వాత మరలా శిరిడీ వచ్చి నా కార్యక్రమం చేసుకోవడం ఒక్కటే మార్గమనిపించింది.

ఆ మరునాడే బయలుదేరి పూణే చేరాను. నాడు సోమ వారమేమో మా రైలు కొంచెము ఆలస్యమవడం వల్ల నేను ఇల్లు చేరేసరికి ఆ విద్యార్థి ఆఫీసుకు వెళ్ళిపోయాడు. అతడి భార్యకు నేనెవరో తెలియదు. దేశంగాని దేశంలో ఆకాశం నుండి ఊడిపడినట్లు అకస్మాత్తుగా నేను వెళ్ళి పరిచయం చేసుకోవడంతో ఆమె ఎంతో కంగారుపడింది. అది గుర్తించి, ''అమ్మా, అతడు ఆఫీసు నుండి వచ్చేలోపల నేను ఊరు జూచుకొని వస్తాను'' అని చెప్పి సంచీ అక్కడ విడిచి నేను ఊర్లోకి బయల్దేరాను కాని ఎక్కడకు వెళ్ళాలో, ఆ మహానగరంలో ఏమి చూడాలో నాకేమాత్రము తెలియదు. సాయంత్రం దాకా ఎక్కడ ఎలా కాలక్షేపం చేయాలన్నది పెద్ద సమస్య అయింది. సినిమాలు మొ॥వ వంటే అసహ్యం. ఏమి చేయాలా అని ఆలోచించుకుంటూ వీధి చివరకు చేరేసరికి అక్కడొక పూల దుకాణము, పండ్ల దుకాణము కన్పించాయి. ఒక దానిలో సాయిబాబా, అక్కల్కోటస్వామి, గజానన్ మహారాజ్ మొ॥వ వారి పటాలకు పూలమాలలు వేసి వున్నాయి. నేను ఆ దుకాణానికి వెళ్ళి, ''బాబు, ఈ ఊరిలో దర్శించదగిన స్వాములు, సాధువులు ఎవరైనా వున్నారా?'' అని అడిగాను. అటువంటి చోటైతే కాలం తెలియకుండా గడచి పోతుందని నా భావం. అంగడి మనిషి పరీక్షగా నా ముఖంలోకి చూచి, ''ఉన్నారు, ఉన్నారు. శ్రీగుళవణి మహారాజ్ అనే యోగి పుంగవులు వున్నారు. ఆయనను ఎందరెందరో వచ్చి దర్శించి పోతుంటారు. ఆయన సాక్షాత్కారం పొందిన పురుషుడని చెబుతారు. నీవు తప్పక వారిని దర్శించుకో!'' అన్నారు. నేను అతనివద్దనే పూలు, పండ్లు కొనుక్కొని అతడు చెప్పిన చిరునామా ప్రకారం వాసుదేవ నివాస్ అనే ఆశ్రమానికి వెళ్ళాను. అక్కడ శ్రీ దత్తాత్రేయస్వామి మరికొందరు

మహాత్ముల పటాలువున్నాయి. అప్పటివారు నన్నొక ప్రక్కనున్న గదిలో ప్రవేశపెట్టారు. సుమారు 80 సం॥ల వృద్ధులు బక్కపల్చని రూపంలో ఒక ప్రక్కగా పరుపుమీద కూర్చొనివున్నారు. వారి ఎదుట కొద్దిమంది విద్యావంతులైన భక్తులు కూర్చొని ఆయనతో మాట్లాడుతున్నారు. నేను ఆ దేశ ఆచారమనుసరించి నేను తెచ్చిన పూలు, పండ్లు వారి పాదాలముందుంచి సాష్టాంగ నమస్కారంచేసాను. ఆయనకు ఇంగ్లీషు భాష•వచ్చినప్పటికీ ఆ భాషలో ఎన్నడూ మాట్లాడరని అప్పటి సేవకులు అంతకు ముందే చెప్పారు. అంటే సాయంత్రం వరకు నేనుగా ఆయనతో మాట్లాడే అవకాశమేలేదు. ఆయన మాట్లాడేది నాకు అర్థమయ్యేదిగాదు. భాషా సమస్య గురించి చెబితే ఆ భక్తులలో ఒకరు నేను ఆంగ్లభాషలో చెబితే స్వామికి అర్థమవుతుందని, ఆయన చెప్పినది అతడే నాకు ఇంగ్లీషులో చెబుతాననీ అన్నాడు. నాకెంతో సంతోష మనిపించింది. అప్పుడు నేను నా జీవితము, నా అన్వేషణల గురించి కొంత పరిచయం చేసుకొంటుండగా అకస్మాత్తుగా వెనుక నైమిశారణ్యంలో శ్రీ అఖండానంద సరస్వతిగారు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. ''నేను మొదటి నుండి శిరిడీ సాయిబాబాను ఆశ్రయించుకున్నాను. అప్పటి నుండి నాకెంతో శాంతి, తృప్తి కలిగాయి. ఎప్పుడూ ఆయన గుర్తుకు వస్తుంటారు. వారే నా గురువేమోనన్న భావం నాలో బలపడుతూ వచ్చింది. కాని ప్రత్యక్షంగా ఆత్మజ్ఞానియైన గురువు లభించనిదే ముక్తి కల్గదని, వారు ఎంతటి వారైనా సమాధి చెందాక మనకు ముక్తిని ప్రసాదించలేరనీ పెద్దలొకరు చెప్పారు. అంతటితో నాకొక పెద్ద సమస్య ఎదురైంది. నేనిప్పుడు మరలా గురువు కోసం వెతుక్కోవాలా అన్నదే నా సమస్య. దయచేసి నాకీ విషయం నిశ్చయంగా చెప్పండి'' అని కోరాను. మొదట శ్రీ గులవణీ మహారాజ్ గారు

నా గురుభక్తిని గురించి, గురువు అనుగ్రహంకోసం నేను తపించటం గురించి వాళ్ళతో ఏమేమో చెప్పారు. వాళ్ళు నాకదేమో వివరించి చెప్పలేదు. నా ప్రశ్నకు వారు చెప్పిన సమాధానము మాత్రమే నాకు ఇంగ్లీషులో చెప్పారు. స్వామి, ''సాధన లేక తపశ్చర్యం ద్వారా ఆత్మజ్ఞానం సాధించుకున్న మహాత్ములందరి విషయంలోను శ్రీ అఖండానంద సరస్వతిస్వామి చెప్పిన మాట వాస్తవమే. అందుకే ముముక్షువు సమిధలు చేత పట్టుకొని శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడు అయిన గురువును ఆశ్రయించాలని ఉపనిషత్తులన్నీ చెప్పాయి. భగవద్గీతలో శ్రీ కృష్ణ పరమాత్మగూడ అలానే చెప్పాడు కానీ, జన్మతః ఎట్టి సాధన అవసరం లేకుండానే దివ్య పురుషులుగా అవతరించిన వాళ్ళ విషయంలో ఈ సూత్రం వర్తించదు. శ్రీ శిరిడీ సాయిబాబా అటువంటి పూర్ణ దత్తావతారమే. వారు మహాసమాధి చెందాక గూడ అవసరమైనప్పుడు భక్తులకు భౌతికంగా దర్శనమిచ్చి అనుగ్రహిస్తున్నారు. కనుక ఆయనకు ఇట్టి అభ్యంతరం వర్తించదు. కేవలం నీ పూర్వపుణ్య విశేషంవలన నీకు మొదటి నుండీ వారిపైనే గురుభావం కలిగింది. నీవు నిశ్శంకగా వారినే ఆశ్రయించుకోవచ్చు. వేరొక గురువును ఆశ్రయించనవసరంలేదు'' అన్నారు. కానీ వారిమాటలు నాకు ఇంగ్లీషులో చెబుతున్న భక్తుడు శ్రీ గుళవణీ మహారాజ్ గూడ అంతటి వారేనని, కేవలం నమ్రత వల్ల మాత్రమే తమ గురించి చెప్పుకోవడంలేదనీ తెలిపాడు. నేనుగూడ శ్రీ గుళవణీ మహారాజ్ గారికి శిష్యుణ్ణే కావడం మంచిదన్న భావం అతడి మాటలలో స్ఫురించింది. వారిని ఆశ్రయిస్తే ఆయన శక్తిపాతంచేసి ఉపదేశదీక్ష యిస్తారని, అది తీసుకున్న వారందరికీ ఎంతో అద్భుతమైన వికాసం కల్గుతోందనీ అతడు చెప్పాడు. కానీ స్వామి అతడిని వారించి, తాము

చెప్పిన మాటలు మాత్రమే నాకు తెల్పమని, అధిక ప్రసంగం చేయ వద్దనీ అతనిని హెచ్చరించారు. అదంతా వినగానే నా మనస్సులో ఒక అనుమానం తలెత్తింది. ఎక్కడి నుండో వచ్చిపోయే నాకు ఉపదేశ దీక్షయిచ్చి నా బాధ్యత తమ మెడకు తగిలించుకోవడం ఇష్టంలేక మాత్రమే, నా బెడద ఎలాగైనా వదలించుకోడానికి మాత్రమే ఆయనలా చెప్పారేమోననిపించింది. నేను తలవంచుకొని కూర్చోగానే ఆయన కొంచెం చికాకుగా, ''నేను ఇంత హృదయపూర్వకంగా యథార్థం చెప్పినా గూడ అతడింకా ఏవో శంకలు మనసులో పెట్టుకుంటున్నాడు. వాటిని లోపల పెట్టుకోకుండా నిశ్శంకగా అడిగి తెలుసుకో''మని మరల చెప్పించారు.

అయినా నా బుద్ధి వక్రంగా మాత్రమే పనిచేసింది. ఆయన నన్నెలాగైనా వదిలించుకోవాలని నిశ్చయించుకున్నాక నేనెంతగా అడిగితే మాత్రం ఆయన వేరొక సమాధానం ఎలా ఇస్తారు? అప్పుడే నాశంక కనుక ఈసారి ఆయనను డొంకతిరుగుడుగా ఎంతో యుక్తిగా ప్రశ్నించి చిక్కించుకోదల్చాను. ''స్వామి! నాకు మొదటి నుండి ధ్యానమెలా చేసుకోవాలో ఎవరూ చెప్పలేదు. నేను సరిగ్గా చేయగల్గుతున్నానో లేదో గూడా నాకు తెలియదు. దానిగురించి నాకు స్పష్టంగా అడగడం గూడా చేతకాదు. కనుక మీరే దయదలచి మీ అంతర్ దృష్టితో చూచి తగిన సవరణలు తెల్పితే ఆ ప్రకారంగానే ధ్యానం చేసుకుంటాను'' అన్నాను.

ఇలా అడగడంలో నా భావమిది - నాకు ఉపదేశం ఇవ్వడం ఇష్టంలేక మాత్రమే ఆయన నాకలా చెప్పివుంటే ధ్యానంలో నాకు తగిన సవరణలేవీ వారు చెప్పరు. అలాగాక ఆ సవరణలు చెబితే మాత్రమే ఆయన నిజంగా నా హితం గోరి హితం చెప్పినట్లు గుర్తు. ఇటువంటి సంశయాలతోనే నేను వారికి నమస్కరించాను. నేను పైకిలేవగానే

ఆయనెంతో ప్రీతితో నావైపుకు కనుబొమ్మలు ఎగరవేస్తూ అచ్చటి వారితో, ''ఇతడు శిరిడీ నుండి వస్తున్నాడు సాయిబాబా మనిషి, సాయినాథుని బిడ్డడు. తెలిసిందా?'' అన్నారు. అచ్చటి వారు అత్యంత ప్రీతితో నమస్తే అని చెప్పారు. నా గురించి ఆయన ఇంకా ఏమేమో మరాఠీలో వాళ్ళతో నా గురించి చెప్పారు. మధ్యమధ్యలో, 'శ్రద్ధ', కఠిన్ తపస్య వంటి కొద్ది మాటలు మాత్రం నా గురించి వాడారని తెలిసింది. నేను 'ఉద్యోగం చేస్తున్నానని, బ్రహ్మచారినని, నాకు డబ్బంటే లక్ష్యంలేదని, ఎక్కడైనా మహాత్ములను దర్శిస్తూంటాననీ చెప్పారట. నా కళ్ళు, నొసలు, కనుబొమ్మలు గురించి ఏమో చెప్పారట గాని అవన్నీ రహస్యమైన విషయాలని చెప్పి అచ్చటి భక్తులు నాకు వివరించలేదు. చివరకు స్వామి నేనేమైనా అడగదలిస్తే నిస్సంకోచంగా అడగవచ్చని చెప్పారట. నేను నాకు వచ్చిన సమస్య గురించి అడిగాను.

నేనలా అడగ్గానే ఆయన కొద్ది నిమిషాలు తదేకంగా సాలోచనగా చూచారు. అటు తర్వాత అకస్మాత్తుగా ఏదో స్ఫురించినట్లు ఇలా చెప్పారు : ''సాయినాథుని బిడ్డవైన నీవు ఈ విషయంలో ఎవరినీ ఏమీ అడుగనక్కర్లేదు. ఆ సాయినాథుని అనుగ్రహం వలన సరిగ్గా సమయానికి సాక్షాత్తు పరమాత్మ స్వరూపమైన శ్రీ ఆనందమాయి మాత ఇప్పుడు ఈ నగరంలోనే వున్నారు. మేము గూడా వారిని దర్శించి నమస్కరించుకుంటాము. నీవు ఈ ఊళ్ళో ఉన్నన్ని రోజులు ఆమె దర్శనం చేసుకొని ఎలాగైనా ఒక్క గంటసేపు ఆమె సన్నిధిలో నీకు చేతనైనట్లు ధ్యానం చేసుకో. నీవు నోరు విప్పి మాట్లాడనక్కర్లేకనే నీలో జరుగవలసిన పనరణ అదే జరిగిపోతుంది'' అని ఎంతో సంతోషంగా చెప్పారు.

ఆ మాటలు నా చెవిన పడగానే నా శరీరం గగుర్పొడిచింది! ఎక్కడ పూణే, ఎక్కడ ఆనందమాయిమాత! వారి దర్శనం మరల నాకు లభిస్తుందని నేను ఊహించనేలేదు. నేను ఆమెను కోరినది మరల ఈ జన్మలో లభించబోదని, బహుశ మరొక జన్మలో నెరవేరవచ్చని మాత్రము అప్పుడు తలచాను. అటు తర్వాత నేనావిషయము గుర్తుంచుకోలేదు. ఆమె దర్శనంకోసం నిరీక్షించనూలేదు. అలాంటిది ఇంత అకస్మాత్తుగా ఎలా సిద్ధించింది అని ఆశ్చర్యపోయాను. ఏదో ఒక మిషమీద పూణేకు వెళ్ళమని శిరిడీలో సాయి నన్నంతగా ఎందుకంత బలంగా ప్రేరేపించారో అర్థం కాసాగింది. అలనాడు నైమిశారణ్యంలో వారి దర్శనము, సాన్నిధ్యము, ఆశ్రయము ప్రసాదించినది శ్రీ సాయి నాథుడే గనుక ఆయనయే పవిత్రమైన నా కోరికను ఇలా నెరవేరుస్తున్నారని అర్థమయింది.

వెంటనే నేను అచ్చటి వారిని, ''శ్రీ ఆనందమాయి మాత ఎక్కడ వున్నారు? నేను అక్కడకు ఎలా వెళ్ళాలి?'' అని వివరాలు కోరాను. వారిలో ఒకరు, ''నేనిప్పుడు అక్కడకే వెళ్తున్నాను. మీరు గూడ నాతోపాటే రావచ్చు'' అని చెప్పారు. శ్రీగుళవణీ మహారాజ్‌గారు సంతోషించి, ''మంచిది, మంచిది. ఇతనిని తప్పకుండా తీసుకువెళ్ళు. అది మహా పుణ్యము!'' అని ఆశీర్వదించి మమ్మల్ని బయల్దేరమన్నారు. మేమిద్దరమూ అతని స్కూటర్ మీద పూణేలోని 'ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్' (Express Estates) అనే చోటికి వెళ్ళాము.

అదెంతో పెద్ద ఆవరణ. అందులో ఒక ప్రక్కన శ్రీ ఆనందమాయి మాత కోసము అందమైన పచ్చి వెదుళ్ళతో పెద్ద కుటీరం నిర్మించారు. దానికి దూరంగా మరొక ప్రక్కన

షామియానాలు వేసి వేదిక ఏర్పాటు చేసారు. మేము వెళ్ళిన కొద్ది సేపట్లో అమ్మ ఆ వేదికమీదకు వచ్చి అంతవరకూ అక్కడ భక్తులు చేస్తున్న భజనలో పాల్గొన్నారు. కొద్దిసేపు ఆమెయే భజన చేసారు గూడ. కానీ ఒక పావుగంటలో అమ్మలేచి తమ కుటీరంలోకి వెళ్ళిపోయారు. భక్తులందరూ ఆమెకు దూరంనుండే నమస్కారం చేసుకోవాలని, ఆమె దీక్షలో వున్నారని, ఆ రోజుకింక ఆమె దర్శనం వుండదనీ ఆశ్రమ ప్రముఖులు భక్తులతో చెప్పారు. నైమిశారణ్యంలో లాగానే అమ్మతో పాటు కొద్దిమంది సేవకులు, సాధకులు వున్నారు. వారిని విచారిస్తే అమ్మకై అమ్మే ఎవరినైనా పిలిచి వాళ్ళతో మాట్లాడు తుంటారని, అంతకుమించి ఇలా వేదిక మీదకు వచ్చినప్పుడు తప్ప ఆమెను దర్శించడానికి వేరే అవకాశం లేదనీ చెప్పారు. అమ్మ అంతకు రెండు రోజుల ముందే ఆ నగరానికి వచ్చారట. నన్ను అక్కడకు తీసుకువచ్చిన వ్యక్తి ఆ కుటీరం ఎదుటనే కూర్చొని కొంతసేపు ధ్యానం చేసుకున్నాడు. తర్వాత మేమిద్దరం మరల వాసుదేవనివాస్‌కు చేరగానే నాకు లభించిన అమ్మ దర్శనం గురించి స్వామితో చెప్పాడు. ఆయనెంతో సంతోషించి, ''ఆమె దర్శనమే చాలు. ఆ దివ్యపురుషుల చూపు ఒక్కటి చాలదూ?'' అని మాత్రం అన్నారు. తర్వాత నన్ను, ''శిరిడీలో వున్నన్ని రోజులు నీవేమేమి చేస్తుంటావు? ఎంతకాలంగా శిరిడీ వెళ్తున్నావ్?'' మొ॥న వివరాలన్నీ అడిగి ఎంతో శ్రద్ధగా విన్నారేగాని ఒక్క విషయంలో గూడ ఆయనెట్టి సలహా ఇవ్వలేదు. మధ్య మధ్యలో అప్పటి భక్తులు తమ సందేహాలు తీర్చుకుంటున్నారు. వారిలో ఒకరికి స్వామి చెప్పిన సూచన అందరికీ బాగా ఉపకరిస్తుందని తోచింది. ఒకరితో ఆయనిలా చెప్పారు – ''ఉద్యోగము సంసారము వున్నప్పటికీ కొంత సమయమైనా ఒక నియమం పాటిస్తుండటం మంచిది. రాత్రి

భోజనమయ్యాక ఏరోజు ఎవరెవరితో, ఏ సందర్భంలో ఎలా ప్రవర్తించామో, ఎలా మాట్లాడేమో, ఎవరి గురించి ఎలాంటి భావాలు వహిస్తున్నామో నిష్కర్షగా ఆత్మపరిశీలన, ఆత్మవిమర్శ చేసుకోవాలి. జాగ్రత్తగా పరిశీలిస్తే ఎట్టి అవసరమూ లేకున్నా చిన్న చిన్న అబద్ధాలు చెబుతుంటాము. ఒకరి మీద ఇష్టంతో వారేమి చేస్తున్నా సమర్థించి మాట్లాడుతుంటాము. ఒక్కొక్కరిమీద అతి చిన్న కారణాలుగా ప్రతికూల భావం వహిస్తుంటాము. అప్రయత్నంగానే వారి గురించి తేలికగా మాట్లాడుతుంటాము. భగవంతుని ఎదుట వాటి గురించి పరితాపం చెంది మనలను క్షమించమని, మనలో అట్టి బలహీనతలు తొలగించమనీ భగవంతుణ్ణే ప్రార్థించాలి. మనలో అసత్యము, పక్షపాతము ఎంతగా జీర్ణించుకుపోయాయో ఇలాంటి సంఘటనలు నిరూపిస్తాయి. పెద్ద పెద్ద ఆపదలు వచ్చినప్పుడు కేవలం భయంతో వాటి నుండి తప్పుకోవడానికి మీరు చెప్పే అబద్ధాలు అంత ప్రమాదమైనవి గావు. కాని దైవంపట్ల విశ్వాసం ధృడపడినకొద్దీ అన్నింటికీ ఆయనే వున్నాడన్న ధైర్యంతో అలాంటి సందర్భాలలో గూడ అబద్ధమాడటం మానివేస్తారు. సత్యమునందు నిష్ఠ కుదిరాక అలా అబద్ధం చెప్పవలసిన అవసరం రానివిధంగా తమ నడవడిని ఎంతో జాగ్రత్తగా మలచుకోవాలి. ఇలా రోజులో తాను చేసిన తప్పులు మాత్రమే మొదట్లో కాగితంమీద వ్రాసుకొని తన ఇష్టదైవం ముందు నిష్కపటంగా తన తప్పులను ఒప్పుకోవాలి. అభ్యాసం వలన ఇటువంటి లోచూపు, ఆత్మపరిశీలన మనలో నిరంతరమూ నిలిచి మన త్రికరణాలను శుద్ధిగా వుంచుతాయి. కాగితానికి అంటిన నూనె చాలా స్వల్పమే కావచ్చు గాని దానిపైన మాత్రం ఎంత మంచి కలమున్నా ఏ అక్షరమూ అంటుకోదు. అలానే మానవుడు సత్యానికి

ఎంత దూరంలో వుంటాడో భగవంతుడికి గూడ అంతే దూరంలో వుంటాడు. ఇలా నిత్యమూ కొద్దిసేపు ఆత్మ విమర్శ చేసుకొని మనలో వున్న అనర్థాలను గుర్తించి పరితాపం చెందుతుంటే కొద్దికాలానికి అవన్నీ నశించి పోతాయి. వాటిపట్ల, అంటే మన దుస్థితి పట్ల మనస్ఫూర్తిగా పరితాపం చెందితే గాని మనం వాటినుండి విడివడాలని నిజంగా కోరుకోలేము. నిజంగా కోరుకుంటే గాని భగవంతుడు అనుగ్రహించడు. ఇటువంటి వాటివల్లనే మానవులు ఎక్కువమంది ఎన్ని పూజలు, యాత్రలు చేసినా భగవంతునికి కించిత్తు గూడా దగ్గరవ్వరు. నిజానికి భగవంతుడి మీద కంటే వారికట్టి బలహీనతం మీదనే మక్కువ ఎక్కువగా వుంటుంది. అందువల్లనే రోజులో ఎక్కువ భాగం భగవంతుడ్నైనా మరుస్తారేమోగాని ఇటువంటి బలహీనతలను మాత్రం హృదయపూర్వకంగా అంటిపెట్టుకుంటారు. అందువలన చిత్తశుద్ధితో భగవంతుణ్ణి ప్రార్థించలేరు. ఇలా అభ్యాసం చేసేవరకు ఇతరులలో తప్పులెన్నే అవలక్షణం మనలోనుండి తొలగిపోదు''.

సాయంత్రమయ్యేసరికి ఇంటికి వెళ్ళి ఆ పాతమిత్రుణ్ణి కలుసుకొని ఆ నగరంలో నాల్గురోజులు వున్నాను. తర్వాత రెండు రోజులు గూడా అమ్మ దర్శనం ఇంత మాత్రమే లభించింది. రోజు రోజుకు నాలో ఆవేదన పెరిగిపోయింది. పూణేలో ఎన్నిరోజులున్నా ఏమి లాభము? అనిపించింది. అయినప్పటికీ ఇంత అప్రయత్నంగా లభించిన అమ్మ సాన్నిధ్యం విడచిపెట్టి పోబుద్ధిపుట్టలేదు. మూడవరోజు సాయంత్రం శ్రీ గుళవణీ మహరాజ్ ''ఏమయ్యా, అమ్మ సన్నిధిలో ధ్యానం చేసావా?'' అని అడగటంతో నాలో ఉత్కంఠ తీవ్రతరమైంది. నాటిరాత్రి, మరుసటి ఉదయం నాకట్టి అవకాశము

యిప్పించమని సాయిని ప్రత్యేకించి ప్రార్థించాను. ఒక వంక ఆయనే నా గురువు అవునో కాదో అని శంకిస్తూనే మరోవంక ఆయననలా ప్రార్థించడం నాకే ఎంతో సిగ్గనిపించింది. కాని ఆ పరిస్థితిలో నేను చేయగలిగినది అంతకంటే ఏమిలేదు. ఆ గురువారం నాడు సాయిని ప్రార్థించుకొని అమ్మ సన్నిధి చేరేసరికి రోజు కంటే 10 ని॥లు ఆలస్యమైంది. నేను చేరుకున్న కొద్దిసేపటికే అమ్మ వేదిక పైనుండి లేచి దూరానవున్న కుటీరం వైపుకు నడవసాగారు. ఎలాగైనా ఆ రోజు ఆమె దర్శనం పొంది శిరిడీ వెళ్ళిపోవాలని నాకు తొందర గలిగింది. అప్రయత్నంగానే నేను గూడా అమ్మను అనుసరించాను. కానీ రెండవ రోజులాగ ఆ రోజు నన్ను ఎవరూ ఆటంకపరచలేదు. అమ్మ తిన్నగా కుటీరంలోకి వెళ్ళిపోయారు. నేను గూడ ఆమె వెనుకనే కుటీరంలోకి ప్రవేశించాను. అమ్మ అకస్మాత్తుగా వెనక్కు తిరిగి అక్కడవున్న ఒక్క బ్రహ్మచారిణితో వాకిలి తలుపు మూయమని చెప్పారు. గాని నేనక్కడ వున్నట్లు ఆమె గుర్తించినట్లేలేరు. ఆమె తిన్నగా వెళ్ళి అక్కడవున్న ఒక మంచంమీద ఒక ప్రక్కకు తిరిగి కళ్ళు మూసుకొని కూర్చున్నారు. నాకేం చేయాలో తెలియలేదు. ఆమెను పలకరించి నమస్కరిస్తే నన్ను బయటకు పొమ్మంటుందేమోనన్న భయం. అలాని ఊరుకుంటే నేనక్కడ కూర్చోవచ్చోలేదో తెలియలేదు. ఆ విషయమే అడగటానికి అక్కడ ఇంకెవరూ లేరు. 5 ని॥లు అలాగే నిలబడి, తర్వాత అక్కడే నేలపై కూర్చున్నాను. కొద్ది ని॥ల తర్వాత ఆ కుటీరంలోకి వచ్చిన ఒక బ్రహ్మచారిణిచేత నేపాల్ నుండి వచ్చిన భక్తులను పిలిపించుకొని వారు

చెప్పుకొనేదంతా అమ్మ ఎంతో శ్రద్ధగా వినసాగారు. వాళ్ళేదో దేవాలయంలో ఒక పెద్దయజ్ఞం వంటిది తలపెట్టినట్లు, దానిని గురించి వివరం అమ్మకు తెల్పి, ఆమె సలహాలు, సూచనలు, ఆశీర్వచనము

పొందటానికి వచ్చినట్లు వారి సంభాషణ తెల్పింది. అమ్మదగ్గరకు నేనెందుకు వచ్చానో గుర్తు రావడంతో వెంటనే కళ్ళు మూసుకొని ధ్యానం ప్రారంభించాను. త్వరలోనే మనస్సు ఎంతో ప్రశాంతమయింది. అంతకంతకు మహా శూన్యంలోకి నేను వెళ్ళిపోతున్నట్లు అన్పించి ఒకానొక తన్మయం కలిగింది. మరల బాహ్యపరిసరాల మీదకు నా దృష్టి మళ్ళినప్పుడు నేను పూణేలో అమ్మ సన్నిధిలో వున్నానన్న సంగతి గుర్తుకొచ్చింది. సమయం చూచుకుంటే నేను ధ్యానానికి కూర్చొని ఒక్క నిమిషం తక్కువగా గంటసేపు గడచిపోయింది. అమ్మ యింకా ఆ వచ్చిన వారితో ఎంతో ఉత్సాహంగా మాట్లాడుతూ మధ్యలో చేతులు తట్టి నవ్వుతున్నారు. సరిగ్గా ఆ నిమిషం గడిచిపోగానే ఆమె మాట్లాడ్డం మానివేసి నాకేసి చూచి, ''తృప్తయిందా?'' అన్నారు. నేనెంతో సంతోషంగా లేచి సాష్టాంగ నమస్కారం చేసాను. ఆమె నవ్వి ఆశీర్వదించారు. ఆ ముందటి రోజు నేను కొనుక్కున్న ''జ్ఞానేశ్వరీ భగవద్గీత'' (ఇంగ్లీషు) ఆమె ముందుంచగానే ఆమె దానిపై చేయిపెట్టి ఆశీర్వదించారు. నేనది తీసుకొని కళ్ళకద్దుకొని, అంతకుముందు నైమిశారణ్యంలో ఆమెను కోరినది నెరవేరిందని చెప్పాను. ఆమె నవ్వి ''అది పరమేశ్వరుని లీల'' అన్నారు. నేను సెలవు తీసుకొని వెనుకకు తిరగబోతుంటే, ''అసలు నీకేమి కావాలి?'' అన్నారు. అప్రయత్నంగా, ''మూడవసారి గూడ అమ్మదర్శనం కావాలి'' అన్నాను. ఆమె నా ముఖంకేసి పరీక్షగా చూచి, ''అచ్ఛా. మిలేగా, జావ్'' - ''మంచిది, (దర్శనం) లభిస్తుందిలే వెళ్ళు!'' అన్నారు.

నేను పుణే వచ్చినపని అయిపోయింది. సాయి మనమెంతగా అనుగ్రహిస్తారో తలుచుకున్నకొద్దీ సాధ్యమైనంత త్వరగా శిరిడీ చేరు కోవాలనిపించింది. కాని అమ్మ దర్శనము, సన్నిధి లభించడానికి

కారకులైన శ్రీ గుళవణీ మహారాజ్‌గారికి నా కృతజ్ఞతలు చెప్పుకొని సెలవు తీసుకొవడం నాధర్మమనిపించింది. నేను వారిని దర్శించేసరికి ఆయన భక్తులతో ఏదో ఉల్లాసంగా చెబుతూవున్నారు. నేను సాష్టాంగ నమస్కారం చేసేసరికీ నన్నాశీర్వదించటానికా అన్నట్లు ఆయన సంభాషణ ముగించి చూస్తూ కూర్చున్నారు. నేను లేచి కూర్చున్నాక గూడా చాలాసేపు ఆయన మౌనంగా వున్నారు. తర్వాత ఆయన నాకేసి నవ్వుతూ చూచి కనుబొమ్మలు ఎగరవేస్తూ, ''అవకాశం దొరికిందా?'' అన్నారు. నేను దొరికిందని చెప్పగానే ఆయన, ''చాలు చాలు. ఇంకేమీ చెప్పనక్కర్లేదు,'' అన్నారు. కొద్ది ని॥లు ఆగి, ''ఇంత వరకూ నీవు నమ్ముకున్న సాయినాథుడే నిన్ను పైకి తీసుకుపోతారు. వారి సన్నిధిలో కలిగిన అనుభవం స్థిరంగా నిల్చిపోవడమే జరుగ వలసినది. వేరేమీకాదు : ఇదెప్పుడూ గుర్తుంచుకో, నీవు శ్రీ గురు చరిత్ర గూడ చదివి మననం చేసుకుంటూండు. ఎంతో మేలు కలుగు తుంది'' అన్నారు. అప్పుడు నేను వారితో చెప్పాను - సాయిబాబా చరిత్రలో కొందరు భక్తులు ''శ్రీ గురుచరిత్ర'' పారాయణ చేసి నట్లు, కొందరిచేత సాయిబాబాగూడా పారాయణ చేయించినట్లు చదివినప్పటి నుండి ఆ గ్రంథం కోసం వెదకుతున్నానని, అది మరాఠీలో వుండటంవల్ల నేను చదవలేకున్నాననీ చెప్పాను. ఆయన తమ శిష్యుని చేత మూడు పుస్తకాలు తెప్పించి వాటిపై ఒక పువ్వు, కొద్ది కలకండ పెట్టి నాకిస్తూ, ''ఇది మా గురు మహారాజ్ శ్రీ టెంబెస్వామి సంస్కృతంలో వ్రాసిన గురుచరిత్ర, స్తోత్రాలు. మావద్ద ఈ గ్రంథాలన్నీ అయిపోయాయి. నీకోసమేనన్నట్లు ఇలా ఒక్క ప్రతి మిగిలింది, ఇవి చదువుకో'' అన్నారు. వాటిలో ఒక గ్రంథం ''శ్రీ సంహితాయన గురుద్విసాహస్రి'', రెండవది ''శ్రీ గురుచరిత్ర

(సమశ్లోకి)'', మూడవది ''స్తోత్రావళి''. నేను వారి భావం గుర్తించలేక వాటి వెల చెల్లించడానికి పైకం తీసేసరికి ఆయన నవ్వుతూ వారించి, ''ఇవి మా గురు మహారాజ్ ప్రసాదం. ఇవి కోటి రూ॥లు ఇచ్చినా లభించవు. వీటి వెల నీవేమి చెల్లిస్తావు? నీవివి చదువుకొని తరించడమే వీటి వెల'' అన్నారు. నేను వారికి నమస్కరించుకొని సెలవు తీసుకొని శిరిడీ చేరి నా కార్యక్రమం నెరవేర్చుకున్నాను. ఇద్దరు మహాత్ముల దర్శనము, వారి ప్రసాదము సాయి నాకు ప్రసాదించారు.

ఈసారి మాత్రం అమ్మ ఇచ్చిన వరం ఎలా నెరవేరుతుందో చూడాలని మరింత ఆసక్తిగా వున్నాను. కొంతకాలం గడిచాక మా కళాశాల గ్రంథాలయానికి గ్రంథాలు కొనుగోలు చేయడానికి మద్రాసు వెళ్ళాను. అక్కడ హోటల్లో నా ఎదుట కూర్చున్న వ్యక్తి 'ది హిందూ' ఆంగ్లదిన పత్రిక చదువుకుంటున్నాడు. దానిలో చివరి పేజీలో మద్రాసులో కల్కీ 'గార్డెన్స్ అనే చోటికి శ్రీ ఆనందమాయి అమ్మ వచ్చారని, అక్కడ భక్తులు ఆమెను దర్శించుకోవచ్చనీ ప్రకటించారు. వెంటనే నేను అక్కడకు వెళ్ళి ఆమెను దర్శించాను. అక్కడ జనవాహిని ఎంతో ఎక్కువగా వుండడం వలన ప్రత్యేకమైన దర్శనం కోరాలని గూడా అనిపించలేదు. అందరితోపాటే వరుసలో వెళ్ళి ఆమెకు నమస్కరించాను. త్వరత్వరగా సాగిపోతున్న భక్తుల వరుసకేసి చూస్తూ ఆమె వెంటనే ఆశీర్వదించి ఒక్కొక్కరిని పంపివేస్తున్నారు. నేను నమస్కరించగానే ఆమె ఒక్కక్షణం తేరిపార పరిచయంగా నా ముఖంకేసి చూచారు. నేను క్లుప్తంగా, ''అమ్మా! మిమ్మల్ని మొదట నైమిశారణ్యంలో దర్శించి కోరినట్లు పూణేలోను, మరల ఇక్కడ ఇప్పుడు గూడ మీ దర్శనం ప్రసాదించారు. ధన్యుణ్ణి'' అన్నాను. ఆమె ''అలాగా, బాగుంది'' అన్నట్లు భావం వచ్చేట్లుగా,

''అచ్చా...?'' అని, వెంటనే, ''అయితే ఇప్పుడేం కావాలి?'' అన్నారు. ''సంపూర్ణమైన మీ అనుగ్రహం వుంటే చాలు'' అన్నాను. ఆమె నిండుగా నవ్వి ఆశీర్వదించి నా చేతిలో కలకండ వుంచారు. అదే నాకు శ్రీసాయి అమ్మ ప్రసాదించిన ఆమె చివరి దర్శనం. ఇటీవలే అమ్మ పరమపదించారు. కాని నా స్మృతిపథంలో మాత్రం ఆమె రూపము, మాట, సన్నిధి ప్రభావము స్థిరంగా నిలిచిపోయాయి. అవి సాయి కృపకు అతి ప్రశస్తమైన తార్కాణాలుగా నా జీవితంలో నిలిచిపోతాయి.

http://slidepdf.com/reader/full/sri-anandamai-amma